సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 122
మంగళవారం 23-7-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'


సీనియర్లకు విశ్రాంతి లేదు
అన్ని మ్యాచ్‌లూ ఆడాల్సిందేనని స్పష్టం చేసిన భారత హెడ్ కోచ్ గంభీర్ -16లో


భారత్‌తో బంధం...
పారిస్ ఒలింపిక్స్ బరిలో పలువురు భారత సంతతి క్రీడాకారులు -16లో


ఆహార బోర్డులు ప్రదర్శిస్తే చాలు
కావడి యాత్ర దారిలో హోటళ్ల యజమానులు ఏ రకమైన ఆహారమో తెలిపే బోర్డులు ప్రదర్శిస్తే సరిపోతుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.
వివరాలు 6లో ▸


వాళ్లు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరొచ్చు
ప్రభుత్వ ఉద్యోగులు హిందూత్వ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరడంపై 1966 నుంచి ఉన్న నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది.
వివరాలు 6లో ▸


అడ్వాంటేజ్ హారిస్
జో బైడెన్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా వైదొలగడంతో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు అవకాశాలు మెరుగయ్యాయి.
వివరాలు 6లో ▸


'సరైన' సమాధానమేంటి?
నీట్–యూజీలో ఒక ప్రశ్నకు ఇచ్చిన రెండు ఆప్షన్లలో ఏది సరైన సమాధానమో తేల్చాలని ఐఐటీ ఢిల్లీని సుప్రీం ఆదేశించింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి

గోదావరికి వరద పోటెత్తుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన భద్రాచలంలో పాత కరకట్టతోపాటు కొత్త కరకట్ట పనులను పరిశీలించారు.
- వివరాలు 2లో▶

ఆర్టీసీ లక్ష్యం.. బిలియన్ డాలర్ టర్నోవర్

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ తొలిసారి ఒక బిలియన్ డాలర్ల(దాదాపు రూ.8300 కోట్లు) టర్నోవర్ క్లబ్‌లో చేరేందుకు లక్ష్యం నిర్ధారించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సమకూరిన ఆదాయంతో సంస్థలో కొత్త ఉత్సాహం నెలకొంది.
- వివరాలు 5లో▶

ప్రముఖ కాలేజీల్లో గుట్టుగా గంజాయి
- టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య
- పలువురు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడి

-వివరాలు 12లో



ఉపాధికి ఊతం.. ధరలకు కళ్లెం
మోదీ 3.0 ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఉద్ఘాటన

దేశంలో లక్షలాది ఉద్యోగాలను సృష్టించడంతో పాటు ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం ఉద్ఘాటించింది. అధికధరలతో అల్లాడుతున్న ప్రజలకు ఆర్థిక ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పింది. ముచ్చటగా మూడోసారి కొలువుదీరిన మోదీ 3.0 సర్కారు, ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు 2023–24 ఆర్థిక సర్వేను పార్లమెంట్ ముందుంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం సర్వేను ప్రవేశపెట్టారు. గడిచిన ఏడాది కాలంగా ఆర్థిక వ్యవస్థ పురోగతి, సవాళ్లు, రాబోయే కాలంలో చేపట్టాల్సిన నిర్మాణాత్మక, విధానపరమైన సంస్కరణలను సర్వేలో ప్రభుత్వం ప్రస్తావించింది. లక్షలాదిగా ఉద్యోగాలను కల్పించాలంటే ప్రైవేటు రంగ పెట్టుబడులను పెంచడంతో పాటు వ్యవసాయ, కార్మిక సంస్కరణలను వేగవంతం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొంది. తద్వారా ఈ బడ్జెట్లో తమ ప్రాధాన్యతలను స్పష్టం చేసింది.
- వివరాలు 17లో▶

- ఈ ఏడాది జీడీపీ వృద్ధి రేటు 6.5-7 శాతంగా అంచనా
- లక్షలాది ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- 2030 నాటికి ఏటా 78.5 లక్షల ఉద్యోగాల సృష్టి
- తయారీ, ఎగుమతులకు చైనా పెట్టుబడుల దన్ను
- నిర్మాణాత్మక సంస్కరణలతో 7 శాతం పైగా వృద్ధి
- ప్రైవేటు పెట్టుబడులు, చిన్న పరిశ్రమలకు ఊతం
- విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని పూడ్చాల్సిందే
- కార్మిక, వ్యవసాయ సంస్కరణలు తక్షణావసరం
- పార్లమెంట్‌లో సర్వేను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్


కేంద్ర బడ్జెట్.. 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాకారం చేసుకునే కలకు పునాది కానుంది. మూడేళ్లుగా ఏటా 8 శాతం చొప్పున వృద్ధితో దేశం శరవేగంగా దూసుకుపోతోంది. విపక్షాలు ప్రధాని గొంతునే నొక్కే అప్రజాస్వామ్య పోకడలకు పోతున్నాయి.
- ప్రధాని నరేంద్ర మోదీ

ప్రధాని గొంతే నొక్కజూస్తారా!
విపక్షాలపై మోదీ ధ్వజం
ఇది అమృతకాల బడ్జెట్
వికసిత భారత్‌కు పునాది
6లో

బడ్జెట్ మథనంలో అమృతం చిలికేనా!
- నేడే కేంద్ర బడ్జెట్
- రికార్డు స్థాయిలో వరుసగా ఏడోసారి ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

6లో

ప్రతి ఊరికీ కావాలి ఇలాంటి 'స్టీల్ బ్యాంక్'
-15లో

కేంద్ర పద్దుపై కోటి ఆశలు
తెలుగింటి కోడలు 'పద్దే పెండింగ్' పట్టించుకుంటారా?
కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లు భారీగా కోరుతున్న రాష్ట్ర సర్కారు
-13లో

సోమవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ


విన్నపాలు వినవలె
- 'మూసీ అభివృద్ధి'కి రూ.10 వేల కోట్లు కేటాయించండి
- ఈసారైనా జల్ జీవన్ మిషన్ నిధులు ఇవ్వండి
- గ్యాస్ సబ్సిడీని ముందే చెల్లించే అవకాశమివ్వండి
- పౌరసరఫరాల బకాయిలు విడుదల చేయండి
- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

12లో

హామీ అమలు చేశాం.. అతిథిగా రండి
- వరంగల్ కృతజ్ఞత సభకు రాహుల్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్
- రుణమాఫీ అమలుపై ఖర్గే, సోనియా, ప్రియాంకకు వివరణ


ఏపీ అసెంబ్లీ గేటు వద్ద వైఎస్సార్‌సీపీ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్ జగన్

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి
- ఏపీలో శాంతి భద్రతల పరిస్థితి అత్యంత దారుణం.. హత్యా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి
- హత్యాకాండపై అసెంబ్లీలో నిరసన గళం వినిపించిన వైఎస్సార్‌సీపీ

12లో

హామీలపై నిలదీస్తారనే పూర్తిస్థాయి బడ్జెట్‌పై 'భయం'
కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనిపిస్తోంది: వైఎస్ జగన్



ఉగ్ర గోదావరి
- పోటెత్తుతున్న ప్రాణహిత, ఇంద్రావతి, సీలేరు, తాలిపేరు, కిన్నెరసాని, శబరి ఉప నదులు
- భద్రాచలం వద్ద 50.20 అడుగులు దాటిన నీటి మట్టం.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ

- వివరాలు 2లో

నేటి నుంచి అసెంబ్లీ
- బీఏసీ భేటీలో సమావేశాల ఎజెండా ఖరారు
- 24న రుణమాఫీపై చర్చ
- అదేరోజు మండలి ప్రారంభం
- 25న ఉభయ సభల్లో రాష్ట్ర 2024–25 వార్షిక బడ్జెట్
- ఆ రోజు ఉదయం బడ్జెట్‌ను ఆమోదించనున్న కేబినెట్

- వివరాలు 2లో

నూతన నేర చట్టాలపై మీ వైఖరేంటి?

- రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీకి కేటీఆర్ ప్రశ్న
- నియంతృత్వ సెక్షన్లపై శాసన సభలో తీర్మానం చేసి పంపాలంటూ బహిరంగ లేఖ

- వివరాలు 5లో

ఇంకా చెప్పాలంటే


క్లుప్తంగా...

అసెంబ్లీకి వెళ్లనున్న కేసీఆర్

బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్న బీఆర్ఎస్ అధినేత



సాక్షి, హైదరాబాద్: తుంటి ఎముక సర్జరీ నుంచి పూర్తిగా కోలుకొనేందుకు గత రెండు విడతల అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు తాజాగా జరగనున్న బడ్జెట్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఈ నెల 25న శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. సమావేశాల ప్రారంభానికి ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎదురుగా ఉన్న గన్‌పార్కులో నివాళులు అర్పించనున్నారు. మరోవైపు పార్టీ మారిన తమ శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. అలాగే జాబ్ కేలండర్ కోసం ఉద్యమించిన వారిపై ప్రభుత్వ దమనకాండ, శాంతిభద్రతల నిర్వహణలో వైఫల్యం వంటి అంశాలపై ఈ సమావేశాల్లో గళం వినిపించనుంది. చేనేత కార్మికుల ఆత్మహత్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం, ఆరు గ్యారంటీల అమలు, రైతు రుణమాఫీ అమల్లో ఆంక్షల వల్ల రైతులకు జరుగుతున్న నష్టం తదితరాలను కూడా ప్రస్తావించనుంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీకి బీఆర్ఎస్ ప్రతినిధిగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు.

నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీ...

అసెంబ్లీ వాయిదా అనంతరం మంగళవారం ఒంటి గంటకు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీ సమావేశం కానుంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ శాసనసభాపక్ష నేత కేసీఆర్ ఈ భేటీలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా మేడిగడ్డ బరాజ్‌ను బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సందర్శించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మరో 3 రోజులూ వర్షాలే..

కలెక్టర్లను అప్రమత్తం చేసిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు.

పద్మశ్రీ గ్రహీతలకు రూ.25 వేల పింఛన్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్పకు ప్రతీ నెల రూ.25 వేల ప్రత్యేక పింఛన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సాంస్కృతిక శాఖ ద్వారా పింఛన్ డబ్బులను నేరుగా వారి ఖతాల్లో జమ చేయనున్నామని వెల్లడించారు.

కాంగ్రెస్ పదవికి ట్రాన్స్‌జెండర్ పోటీ

ముషీరాబాద్ (హైదరాబాద్): రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవికి ఓ ట్రాన్స్‌జెండర్ పోటీ పడుతున్నారు. ఈ మేరకు సోమవారం ముషీరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌జెండర్ సూర్యచందర్‌తో మాజీ సీఎం టి.అంజయ్య మనవడు, సీనియర్ కాంగ్రెస్ నేత అభిషేక్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్లకు కూడా రాహుల్‌గాంధీ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియ జేశారు.

నేటి భవితలో..

- **బ్యాంక్ జాబ్స్:**
  ఇండియన్ బ్యాంక్‌లో అప్రెంటీస్
  అప్రెంటీస్ ట్రైనింగ్.. సంబంధిత రంగంలో క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు ఎంతో కీలకం. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి రియల్ టైమ్ పని అనుభవం చాలా అవసరం. ఇటీవల కాలంలో ప్రాక్టికల్ స్కిల్స్ ఉంటేనే బ్యాంకులు నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియన్ బ్యాంక్ అప్రెంటీస్ నోటిఫికేషన్ చక్కటి అవకాశంగా చెప్పొచ్చు. తాజాగా ఇండియన్ బ్యాంక్ 1,500 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ బ్యాంక్ అప్రెంటీస్‌తో అభ్యర్థులకు ప్రయోజనాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..
- **గ్రూప్1, గ్రూప్ 2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్:** సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా..అంతర్జాతీయం, జాతీయం, వార్తల్లో వ్యక్తులు, అవార్డులు, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్ తదితర తాజా పరిణామాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్‌తోపాటు విద్య, ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఉగ్ర గోదావరి!

- కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం దాకా ప్రమాదకర స్థాయిలో గోదావరి ప్రవాహం
- భద్రాచలం వద్ద 49.40 అడుగులు దాటిన నీటి మట్టం.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- నేడు వరద మరింత పెరిగే అవకాశం..

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: పరీవాహక ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వానలు, పోటెత్తుతున్న ఉప నదులు కలసి దిగువ గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. గోదావరిలో ప్రాణహిత కలిసే కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ గోదావరిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్వల్పంగా 20 వేల క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోంది. దానికి దిగువన కడెం ప్రాజెక్టు నుంచి, వాగుల నుంచి వస్తున్న వరదలతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 24 వేల క్యూసెక్కులకుపైగా ప్రవాహం కొనసాగుతోంది. అయితే దాని దిగువన ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, తాలిపేరు, పెద్దవాగు, కిన్నెరసాని ఉప నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌కు 9,54,130 క్యూసెక్కుల వరద వస్తుండటంతో.. కాళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ ప్రవాహానికి ఇతర ఉప నదులు, వాగులు కలసి.. తుపాకులగూడెం (సమ్మక్క), దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బరాజ్‌ల వద్ద మరింత ఎక్కువగా ప్రవాహాలు నమోదవుతున్నాయి.

అర్ధరాత్రి 12 గంటలకు 50.20 అడుగులుగా...

భద్రాచలం వద్దకు వచ్చేసరికి గోదావరి ఉగ్ర రూపం దాల్చుతోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో 50.20 అడుగుల నీటిమట్టంతో 13 లక్షల క్యూసెక్కులకుపైగా వరద కొనసాగుతోంది. భద్రాచలం నుంచి వెళ్తున్న నీరంతా పోలవరం, ధవళేశ్వరం మీదుగా సముద్రంలోకి వెళ్లిపోతోంది.

వరద ప్రమాదకర స్థాయికి పెరిగే చాన్స్

మధ్య గోదావరి సబ్ బేసిన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఆ నీళ్లన్నీ గోదావరిలోకి చేరేందుకు ఒక రోజు పడుతుంది. దీంతో మంగళవారం కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకూ గోదావరిలో ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరవచ్చని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించింది. భద్రాచలం వద్ద వరద 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రవాహం ఇలాగే కొనసాగితే మంగళవారం ఉదయానికల్లా మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

గోదావరి ప్రాజెక్టులకు వస్తున్న వరద ఇలా..

ప్రాజెక్టు	నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
జైక్వాడ్	102.73	29.23	119	119
సింగూర్	29.91	13.7	1,270	391
నిజాంసాగర్	17.8	3.22	630	0
శ్రీరాంసాగర్	90.31	21.37	20,000	0
కడెం	7.6	5.52	4,859	3,002
ఎల్లంపల్లి	20.18	7.88	24,433	0
మేడిగడ్డ	16.17	–	9,54,310	9,54,310
సమ్మక్క	6.94	–	10,15,170	10,15,170
సీతమ్మసాగర్	36.57	53.35	11,86,801	11,86,801

(సోమవారం సాయంత్రం 6 గంటలకు.. నీటి నిల్వ టీఎంసీల్లో.. ఇన్‌ఫ్లో/ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో)

5 రోజుల్లో 200 టీఎంసీలు సముద్రం పాలు

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా కురిసిన వానలతో గోదావరి నది పోటెత్తుతోంది. కొన్ని నెలలుగా సరిగా వానల్లేక, నీటికి కటకటతో ఇబ్బందిపడగా.. ఇప్పుడు భారీగా వరదలు వస్తున్నాయి. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ గేట్లన్నీ ఎత్తేయడం, నీటి ఎత్తిపోతలు చేపట్టకపోవడంతో నీళ్లన్నీ వృధాగా వెళ్లిపోతున్నాయి. మరోవైపు ఎగువ గోదావరిలో పెద్దగా ప్రవాహాలు లేక ఎల్లంపల్లిలోకి నీటి చేరిక మెల్లగా కొనసాగుతోంది. మేడిగడ్డ నుంచి నీటిని లిఫ్ట్ చేస్తే.. అన్నారం, సుందిళ్ల మీదుగా ఎల్లంపల్లిని నింపుకొని, అక్కడి నుంచి మిడ్‌మానేరు, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్ తదితర రిజర్వాయర్లను నింపుకొనే అవకాశం ఉండేదని రైతులు అంటున్నారు. కానీ గోదావరి నీటిని ఒడిసిపట్టే పరిస్థితి లేక వరద అంతా సముద్రం పాలవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారుల అంచనా ప్రకారం.. గోదావరిలో ఈ నెల 17 నుంచి సోమవారం సాయంత్రం వరకు 200 టీఎంసీల మేర నీళ్లు వృధాగా సముద్రంలోకి వెళ్లిపోయాయి. ఎగువ నుంచి నీళ్లు రాక, కాళేశ్వరం లిఫ్టింగ్ లేక.. ఈసారి ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ తదితర రిజర్వాయర్ల కింద ఆయకట్టుకు నీటి సరఫరా కష్టమేనన్న చర్చ జరుగుతోంది.

ముంపు ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన

ములుగు జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సోమవారం పర్యటించారు. ఏటూరునాగారం మండలంలోని ముల్లకట్ట బ్రిడ్జి వద్ద గోదావరి నది, సామాజిక ఆస్పత్రిని, పలు వరద ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.



జూరాల ప్రాజెక్టు 37 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

కృష్ణమ్మకు జలకళ

కృష్ణా నది పొడవునా కొనసాగుతున్న వరద ప్రవాహం

సాక్షి, హైదరాబాద్: పరీవాహక ప్రాంతం(బేసిన్)లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానది జలకళ సంతరించుకుంది. ప్రధాన పాయతోపాటు ఉప నదులు కూడా పరవళ్లు తొక్కుతున్నాయి. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లు ఇప్పటికే నిండుకుండలా మారడంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఆ వరద అంతా జూరాలకు వస్తుండగా.. 37 గేట్లు ఎత్తేసి నీటిని విడుదల చేస్తున్నారు. అలా కృష్ణమ్మ పరుగుపరుగున శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతోంది. మరోవైపు కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రలో వరద ఉధృతి పెరిగింది. తుంగభద్ర డ్యామ్ నిండుకుండలా మారింది. ఎగువ నుంచి మరింత వరద వస్తుండటంతో.. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు గేట్లు ఎత్తి నీటిని వదలడం ప్రారంభించారు. నీటి విడుదలను క్రమేణా పెంచుతామని, నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జల వనరుల శాఖ అధికారులకు తుంగభద్ర బోర్డు సమాచారం ఇచ్చింది. తుంగభద్ర డ్యామ్ నుంచి విడుదలవుతున్న నీళ్లు సుంకేశుల బరాజ్ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతాయి. ఇటు జూరాల నుంచి, అటు సుంకేశుల నుంచి వచ్చే ప్రవాహాలతో.. శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద భారీగా పెరగనుంది.

సాగర్ ఎడమ కాల్వ కట్టకు బుంగ

నడిగూడెం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం సమీపాన సాగర్ ఎడమ కాల్వ కట్టకు ఆదివారం రాత్రి బుంగ పడింది. కట్టతోపాటు, కాల్వ లైనింగ్ కూడా కోతకు గురైంది. దీంతో అధికారులు కృష్ణానగర్, చాకిరాల వంతెనల వద్ద రాకపోకలను నిలిపివేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. బుంగపడిన చోట కంచె ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పడిన చిన్న బుంగ ప్రస్తుతం పెద్దగా మారి, కట్ట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాల్వ కట్టలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



రామాపురం సమీపాన 120 కిలోమీటరు వద్ద పడిన బుంగ

వరదలపై అప్రమత్తంగా ఉండండి

- గోదావరి ఉప్పొంగుతుండటంతో అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- భద్రాచలంలో పర్యటన.. వరద ఉధృతి, సహాయ కార్యక్రమాలపై సమీక్ష
- పెద్దవాగు ప్రాజెక్టు బాధితులకు పరామర్శ.. సాయంపై హామీ..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి నదికి వరదలు పోటెత్తుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మంత్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో పర్యటించారు. గోదావరి తీరంలో కరకట్టలను పరిశీలించి, జిల్లా అధికారులతో సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని.. వరద తగ్గేవరకు కూనవరం- భద్రాచలం – దుమ్ముగూడెం రోడ్ల మీదుగా రాకపోకలను నిలిపేయాలని సూచించారు. భద్రాచలంలోకి చేరే వరద నీటిని నదిలోకి ఎత్తిపోసేలా మోటార్లు సిద్ధం చేయాలన్నారు. అనంతరం బూర్గంపాడు మండలంలో పొలాలను పరిశీలించారు.

'పెద్దవాగు'పై అధికారుల వైఫల్యం

అశ్వారావుపేట మండలంలో పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడటానికి ఇంజనీర్ల నిర్లక్ష్యమే కారణమని పొంగులేటి పేర్కొన్నారు. పెద్దవాగు ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారీ వరద వస్తుంటే అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టలేదని.. ప్రాజెక్టులోని నీటిని ఖాళీ చేయించలేదని మండిపడ్డారు. అధికారులకు నోటీసులు ఇచ్చామని, తప్పు చేసినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వం గత పదేళ్లుగా తగినంత శ్రద్ధ పెట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టు విషయంలో తప్పు జరిగిన విషయాన్ని అంగీకరిస్తున్నామన్నారు. ఇరు రాష్ట్రాల సీఎంలు మాట్లాడుకుని తిరిగి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. ఆలోగా ఫీడర్ చానల్ లేదా రింగ్‌బండ్ నిర్మించి ఆయకట్టు రైతులకు నీరు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రాజెక్టు గండ్లు, వరదలతో నష్టపోయిన వారిని మంత్రి పరామర్శించారు. ప్రభుత్వంతోపాటు తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా సాయం అందిస్తామని ప్రకటించారు. వరద కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి రెండు నెలల్లో ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

ముగ్గురు ఇంజనీర్లపై చర్యలకు సిఫారసు

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఏకైక ఉమ్మడి ప్రాజెక్టు 'పెద్దవాగు'. 16 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా 1981లో దీనిని నిర్మించారు. 40,500 క్యూసెక్కుల వరదను విడుదల చేసేలా స్పిల్‌వేను డిజైన్ చేశారు. కానీ 1989లో 70 వేల క్యూసెక్కుల వరద రావడంతో స్పిల్‌వేకు ఎడమవైపు 200 మీటర్ల వరకు కట్టకు గండిపడింది. ఇప్పుడు 75వేల క్యూసెక్కుల వరద రావడంతో మళ్లీ గండ్లు పడ్డాయి. దీనికి నిర్వహణ లోపమే కారణమని.. ఎగువ నుంచి భారీ వరద రానుందని సమాచారమున్నా ఇంజనీర్లు సకాలంలో గేట్లు ఎత్తలేదని.. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలేవీ జారీ చేయకుండా నీటిని విడుదల చేశారని అధికారులు గుర్తించారు. ప్రాజెక్టు నిర్వహణలో విఫలమైన డీఈఈ, ఏఈఈ, ఏఈలపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ప్రాజెక్టుకు గండ్లు పడటంతో 16 గ్రామాలు నీట మునిగాయి. రూ.100 కోట్ల మేర నష్టం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.

నేటి నుంచి అసెంబ్లీ

- సంతాప తీర్మానాల తర్వాత సభ వాయిదా
- బీఏసీ భేటీలో సమావేశాల ఎజెండా ఖరారు
- 25న ఉభయ సభల్లో రాష్ట్ర 2024–25 వార్షిక బడ్జెట్
- ఉదయం బడ్జెట్‌ను ఆమోదించనున్న కేబినెట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ మూడో విడత సమావేశాలు ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. శాసనమండలి సమావేశాలు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మొదలవుతాయి. అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది. తొలిరోజు మంగళవారం ఉదయం స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభ ప్రారంభమైన వెంటనే ఈ ఏడాది ఫిబ్రవరి 23న రోడ్డు ప్రమాదంలో మరణించిన దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత మరణం పట్ల సభ సంతాపం ప్రకటించనుంది. ఈ సంతాప తీర్మానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడతారు. అలాగే ఇటీవలి కాలంలో మరణించిన పలువురు మాజీ ఎమ్మెల్యేలకు కూడా నివాళులర్పించనుంది. అనంతరం సభను 24వ తేదీ ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తారు. తర్వాత స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం జరుగుతుంది. ఈ భేటీలో సభ ఎజెండా, సమావేశాలు ఎన్ని రోజులు జరిగేదీ ఖరారు చేయనున్నారు. 24న రైతు రుణమాఫీ అంశంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ జరిగే అవకాశముందని సమాచారం. ఇక 25న శాసనసభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెడతారు. 26న సమావేశాలకు విరామం ప్రకటిస్తారు. 27న బడ్జెట్ ప్రసంగంపై చర్చ ప్రారంభం అవుతుంది. బోనాల పండుగ నేపథ్యంలో 28, 29 తేదీల్లో మళ్లీ విరామం అనంతరం, ఈ నెల 30 నుంచి సమావేశాలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో స్కిల్స్ యూనివర్సిటీతో పాటు పలు ప్రభుత్వ బిల్లులు సభ ముందుకు రానున్నాయి.

25న మంత్రివర్గ భేటీ: అసెంబ్లీలో ఈ నెల 25న రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో అదే రోజు ఉదయం 9 గంటలకు మీటింగ్ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. ఈ భేటీలో బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.

ఇప్పటివరకు రెండు విడతలు

గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. తొలి విడత సమావేశాలు డిసెంబర్ 9 నుంచి 21వ తేదీ వరకు 6 రోజుల పాటు, రెండో విడత ఫిబ్రవరి 9 నుంచి 17 తేదీల నడుమ 8 రోజుల పాటు జరిగాయి. తొలి విడత సమావేశాల్లో నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక జరిగింది. గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించింది. ఇక ఫిబ్రవరిలో జరిగిన రెండో విడత సమావేశాల్లో 2024- 25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడంతో పాటు సాగునీటి వనరులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది.

తండ్రి మృతదేహాన్ని 20 కి.మీ. మోసుకెళ్లి..

ఛత్తీస్‌గఢ్‌లో వరద ఇక్కట్లు



జట్టీపై మృతదేహాన్ని మోసుకెళ్తున్న కుమారులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా పలుచోట్ల వాగులు, వంకలు ఉప్పొంగి రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అనారోగ్యంతో మృతి చెందిన తండ్రి మృతదేహాన్ని ఆయన కుమారులు 20 కిలోమీటర్లు జట్టీలపై మోసుకెళ్లారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కిష్టారం పంచాయతీ పరిధి ఆర్లపెంట గ్రామానికి చెందిన రవ్వా భీముడు కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనను తొలుత భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా రానురాను ఖర్చు పెరగడంతో కుమారులు సుక్మా జిల్లా పాలచల్మలో ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న భీముడు సోమవారం మృతి చెందాడు. అయితే, పాలచల్మ నుంచి స్వగ్రామమైన ఆర్లపెంట 20 కి.మీ. దూరం ఉండగా మార్గమధ్యలో పలుచోట్ల రహదారులపైకి నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో భీముడి కుమారులిద్దరు జట్టీ కట్టి తమ తండ్రి మృతదేహాన్ని దట్టమైన అటవీ ప్రాంతంలోనుంచి జోరువానలో 20 కి.మీ. మేర నడుస్తూ తీసుకెళ్లారు. ఆర్లపెంట చేరుకున్నాక అంత్యక్రియలు నిర్వహించారు.

అంత్యక్రియలకు వరద అడ్డంకి

నిండుగా ప్రవహిస్తున్న ప్రాణహిత



వరదలో నుంచి సాలక్క మృతదేహాన్ని తీసుకెళ్తున్న కుటుంబసభ్యులు

వేమనపల్లి: ఆఖరి మజిలీకి వరద అడ్డొచ్చింది. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు వైకుంఠధామం ఉన్నా నిరుపయోగంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల కేంద్రంలో రెండు రోజుల వ్యవధిలో వగావత్ సాలక్క, ఎల్లెల గంగయ్య వృద్ధాప్యంతో మృతిచెందారు. వేమనపల్లిలో వైకుంఠధామం ఉన్నా నీళ్లు, కరెంటు, బాత్రూం సౌకర్యాలు లేక, శిథిలావస్థకు చేరి నిరుపయోగంగానే మారింది. ఎవరూ అక్కడ అంతిమ సంస్కారాలు చేసేందుకు వెళ్లరు. ప్రాణహిత నదికి తీసుకెళ్లి అంతిమ సంస్కారా లు నిర్వహిస్తుంటారు. కాగా, నాలుగు రోజులుగా ప్రాణహిత నది నిండుగా ప్రవ హిస్తోంది. సోమవారం పుష్కరఘాట్, రోడ్డుపూర్తిగా మునిగిపోవడంతో నదికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం గంగయ్యను కుటుంబీకులు మత్తడివాగు వైపు తీసుకెళ్లి దహన సంస్కారాలు చేయగా.. సోమవారం సాలక్క మృతదేహాన్ని సైతం అటువైపే తీసుకెళ్లారు. మార్గమధ్యలో అంపుడొర్రె వరకు ప్రాణహిత ముంపు నీరు ఆవరించి ఉండటంతో మృతదేహంతో అంపుడొర్రె దాటి అవతలి వైపు వెళ్లారు. మత్తడి ఒర్రెలో దహన సంస్కారాలు పూర్తి చేశారు.

వరద 'గుండాల'



వాగు దాటుతున్న గిరిజనులు

గుండాల: అయిదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అత్యవసర పని ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే వాగులు దాటుకుంటూ ప్రాణాలకు తెగించి సాహసం చేయాల్సిందే. మండలంలోని గుండాల – కొడవటంచ గ్రామాల మధ్య లోలెవెల్ వంతెన ఉన్నా.. వరదలు పెరగడంతో దానిపై నుంచి అధికారులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో కొడవటంచ గ్రామస్తులు అధికారుల కళ్లుగప్పి ఇలా ఏడుమెలికల వాగు దాటుకుంటూ వెళ్లాల్సి వచ్చింది.

తప్పని డోలీ ఇక్కట్లు

- జ్వరంతో ఉన్న మహిళను మూడు కిలోమీటర్లు మోసుకుంటూ..
- ఆ తర్వాత అంబులెన్స్‌లో భద్రాచలం ఆస్పత్రికి తరలింపు



డోలీ కట్టి నర్సమ్మను ఆస్పత్రికి తీసుకెళుతున్న గ్రామస్తులు

బూర్గంపాడు: వానాకాలం వచ్చిందంటే ఆ గ్రామస్తులకు డోలీల ఇక్కట్లు తప్పడం లేదు. జబ్బు చేసినా, ఏదైనా ఆపద వచ్చినా డోలీ కట్టాల్సిందే. సరైన రహదారి లేక వారు కష్టపడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీకాలనీకి చెందిన సొడే రాజు నాలుగు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో బాధపడుతుంటే గ్రామస్తులు డోలీ కట్టి మూడు కిలోమీటర్లు మోసుకొచ్చి, ఆ తర్వాత ఆటోలో భద్రాచలం ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. మళ్లీ అదే గ్రామంలోని నర్సమ్మ అనే మహిళ జ్వరం బారిన పడగా సోమవారం ఆమెను కుటుంబసభ్యులు డోలీ కట్టి మూడు కిలోమీటర్లు మోసుకుంటూ వచ్చారు. సమాచారం తెలిసిన బూర్గంపాడు ఎస్సై రాజేశ్ స్పందించి వెంటనే అంబులెన్స్‌ను పంపించగా అందులో నర్సమ్మను భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై సహకారంతో తమకు కొంతమేర డోలీ బాధ తప్పిందని బాధితులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం ఐటీడీఏకు కూతవేటు దూరంలోనే ఉన్న తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

అంబులెన్స్ లేక.. మోటారు బైక్‌పై...



రాజవొమ్మంగి: అభాగ్యురాలైన ఓ గిరిజన మహిళ ఆస్పత్రిలో కన్నుమూస్తే ఆమెను మోటారుసైకిల్‌పై ఇంటికి తరలించిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో జరిగింది. మిరియాలవారి వీధి గ్రామానికి చెందినకుంజం అన్నపూర్ణ (60) అనారోగ్యంతో సోమవారం జడ్డంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లింది. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె వెంట కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేకపోవడంతో మృతదేహాన్ని తరలించేవారు కరువయ్యారు. ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చేసేదిలేక జడ్డంగి లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గణజాల మల్లికార్జున్ చొరవచూపి మృతదేహాన్ని యువకుల సహాయంతో మోటారు సైకిల్‌పై 5 కిలోమీటర్ల దూరంలోని మిరియాలవారి వీధి గ్రామానికి చేర్చారు.

ఉద్యమ చైతన్యం రగిలించిన వైతాళికుడు దాశరథి

దాశరథి కృష్ణమాచార్య శతజయంతి వేడుకల్లో మంత్రులు పొన్నం, జూపల్లి

దాశరథి స్వగ్రామంలోనూ ఘనంగా వేడుకలు



మంత్రులు పొన్నం, జూపల్లి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న ప్రముఖ కవి జగన్నాథం. చిత్రంలో అందెశ్రీ, అలేఖ్య పుంజాల బండా ప్రకాశ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్)/ సాక్షి, మహబూబాబాద్: తెలంగాణ అస్తిత్వాన్ని తన రచనల ద్వారా చాటిచెప్పిన దాశరథి కృష్ణమాచార్య చిరస్మరణీయులని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం దాశరథి కృష్ణమాచార్య సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ కవి జూకంటి జగన్నాథానికి ప్రదానం చేశారు. అవార్డుతో పాటు రూ.1,01,116 నగదు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. దాశరథి సొంత జిల్లా మహబూబాబాద్‌ను దాశరథి జిల్లాగా ప్రకటించాలని ఆయన కుటుంబ సభ్యులు కోరగా ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, ప్రజాకవి అందెశ్రీ, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, దాశరథి కుటుంబ సభ్యులు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ సాహిత్యాన్ని భావితరాలకు అందించాలి



నందిని సిధారెడ్డి

తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వంపై ధిక్కార స్వరం వినిపించిన దాశరథి కృష్ణమాచార్యులు, ఇతర కవుల ఉద్యమ సాహిత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. దాశరథి పుట్టిన గ్రామం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యుడు రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, దేశపతి శ్రీనివాస్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం చిన్నగూడూరు, మహబూబాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి దాశరథి: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: సాహిత్యం ద్వారా నాటి రైతాంగంలో రాచరికానికి వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి దాశరథి కృష్ణమాచార్య అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు కొనియాడారు. పద్యాన్ని ఆయుధంగా మలిచి పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధుడు దాశరథి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'పాటల పయోనిధి దాశరథికి వినమ్ర పూర్వక నివాళులు. తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మెరిట్ X రిజర్వేషన్ కమ్ మెరిట్ !

• రోనాల్డ్ రాస్‌కు పలు సంఘాల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులకు 2014 జూన్ 2 తర్వాత ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి ఓసీ, బీసీ ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి చేసింది. విద్యుత్ సంస్థల సర్వీస్ నిబంధనలు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు, స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ సైతం మెరిట్ ఆధారంగానే సీనియారిటీని నిర్ధారించాలని కోరుతున్నాయని తెలిపింది. రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల ఇన్‌చార్జ్ సీఎండీ రోనాల్డ్‌రాస్ సోమవారం విద్యుత్‌సౌధలో విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ, విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమై పదోన్నతులపై చర్చించారు. అయితే, ప్రత్యక్ష నియామకాల ద్వారా ఎంపికైన ఉద్యోగుల సీనియారిటీని రూల్ ఆఫ్ రిజర్వేషన్ కమ్ మెరిట్ ఆధారంగానే నిర్ధారించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి చేసింది.

ఉద్యమకారుల సంఘానికి జిల్లా ఇన్‌చార్జీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం సాధన కోసం ఏర్పడిన తెలంగాణ ఉద్యమకారుల సంఘానికి.. వివిధ జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు విష్ణువర్ధన్ గౌడ్, ఖమ్మం జిల్లాకు రడం సురేష్, వరంగల్ జిల్లాకు గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ జిల్లాకు దేవి రెడ్డి విజయ్, మెదక్ జిల్లాకు కుమార్ సాగర్, నిజామాబాద్ జిల్లాకు శ్రీనివాస్ గౌడ్, ఆదిలాబాద్ జిల్లాకు శ్రవణ్ నాయక్, హైదరాబాద్ జిల్లాకు శివ గౌడ్, రంగారెడ్డి జిల్లాకు సంజయ్ గౌడ్, కరీంనగర్ జిల్లాకు పాలెపు దిలీప్‌లను నియమించినట్టు సంఘం వ్యవస్థాపకుడు పిడమర్తి రవి తెలిపారు.

పూర్తి సమాచారం వచ్చాకే తదుపరి చర్యలు

• జీవో 317 బాధిత ఉద్యోగుల వినతులపై ఉప సంఘం నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో జీవో 317 కేటాయింపులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి అందిన వినతులపై పరిష్కారం ఇంకా కొలిక్కి రాలేదు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సచివాలయంలో సమావేశమైంది. దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. జీవో 317పై ఉద్యోగులు ఇచ్చిన వినతులకు సంబంధించి పలు శాఖల నుంచి సమాచారం రాకపోవడం పట్ల ఉపసంఘం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. శాఖల వారీగా సమాచారాన్ని తెప్పించాలని, యుద్ధప్రాతిపదికన ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. పాత జిల్లాల వారీగా ఉద్యోగుల సర్వీసు, పదోన్నతుల అంశాలను పరిగణనలోకి తీసుకొని 317 జీవో సమస్యలను పరిష్కరించాలని ఉపసంఘం ప్రాథమికంగా నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల నుంచి పూర్తి స్థాయి సమాచారం వచ్చిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని మంత్రులు అభిప్రాయపడ్డారు.

184 మంది మెడికల్ ప్రొఫెసర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లను వైద్య ఆరోగ్యశాఖ బదిలీ చేసింది. మొత్తం 184 మంది ప్రొఫెసర్లను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ ప్రొఫెసర్లు జిల్లాలకు వెళ్లడం వల్ల, వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులు బలోపేతం అవుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

సవరణ

సోమవారం ప్రచురితమైన 'డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి కెప్టెన్ చైర్' సత్కారం వార్తలో యూఎస్‌కు చెందిన జాన్ హాప్కిన్స్ వర్సిటీకి బదులుగా యూకేకు చెందిన జాన్ హాప్కిన్స్ వర్సిటీగా పొరపాటున ప్రచురితమైంది.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌కు సినారె పురస్కారం



డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి. చిత్రంలో వేణుగోపాలాచారి తదితరులు

నాంపల్లి: డాక్టర్ సినారె పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు ప్రదానం చేశారు. సోమవారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో రసమయి సంస్థ సి.నారాయణరెడ్డి 93వ జయంత్యుత్సవ సభను నిర్వహించింది. కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి.. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె.రాము, ఏపీ కళారత్న అవార్డు గ్రహీత ఎంకేఆర్ ఆశాలత పాల్గొన్నారు.

5 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

సాక్షి, హైదరాబాద్: లాసెట్, పీజీ లాసెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఆగస్టు 5 నుంచి మొదలవుతుంది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి నేతృత్వంలోని 'సెట్' ప్రవేశాల కమిటీ సమావేశం సోమవారం మండలి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. బుధవారం లాసెట్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్, ప్రొఫెసర్ వి.వెంకటరమణ, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ పి.రమేష్‌బాబు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 11 లా కాలేజీలు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొంటాయి. వీటిలో మూడేళ్ల లా కోర్సులో 4,790 సీట్లు, ఐదేళ్ల లా కోర్సులో 2,160, ఎల్‌ఎల్‌ఎంలో 990 సీట్లున్నాయి.

లా ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్



తేదీ	విషయం
24-7-24	నోటిఫికేషన్ విడుదల
5-8-24 - 20-8-24	ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన
7-8-24 - 10-8-24	స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
21-8-24	అర్హుల జాబితా ప్రకటన, మార్పులు చేర్పులకు అవకాశం
22-8-24 - 23-8-24	తొలి విడతకు ఆప్షన్లు ఇవ్వడం
24.8.24	ఆప్షన్లు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం
27-8-24	సీట్ల కేటాయింపు
28-8-24 - 30-8-24	కాలేజీలో రిపోర్టింగ్



ఏకాంతవాసి అయిన ఒక సన్యాసి ఓసారి అన్నాడు:
'నన్ను ఈ ప్రపంచంతో ముడివేస్తున్న అన్నింటినీ వదులుకున్నాను.
కానీ ఒక్క ఆకాశపు అందం మాత్రం నన్ను వెంటాడుతోంది.'
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 23 జూలై 2024

మలుపు తిప్పిన నిష్క్రమణ

అందరూ అనుమానిస్తున్నట్టే జరిగింది. చెప్పాలంటే అనివార్యమైనదే అయింది. మరో నాలుగు నెలల్లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉన్నాయనగా రెండోసారి ఆ పదవికి ఎన్నికయ్యేందుకు చేస్తున్న ప్రచారం నుంచి డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత దేశాధ్యక్షుడు జో బైడెన్ పక్కకు తప్పుకున్నారు. వైట్‌హౌస్ పీఠానికి రేసు నుంచి వైదొలగుతున్నట్టు ఆదివారం ఆయన ఆకస్మికంగా చేసిన ప్రకటన ఒక విధంగా సంచలనమే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఒక పార్టీ అభ్యర్థి ఇలా అర్ధంతరంగా బరిలో నుంచి వైదొలగిన ఘటన మునుపెన్నడూ జరగనిదే. అలాగని కొద్ది వారాలుగా అమెరికాలో జరుగుతున్న పరిణామాల రీత్యా బైడెన్ ప్రకటన మరీ అనూహ్యమేమీ కాదు. ఎన్నికల్లో పోటీ పడకున్నా, పదవీకాలం పూర్తయ్యే వరకు దేశాధ్యక్షుడిగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని ప్రకటించిన ఆయన తన స్థానంలో పార్టీ అభ్యర్థిగా కమలా హ్యారిస్ పేరు ప్రస్తావించడం, ఆమె అభ్యర్థిత్వాన్ని తోటి డెమోక్రాట్లు బలపరుస్తుండడంతో అమెరికా ఎన్నికల కథ ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఇటీవలే ప్రత్యర్థి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్న ఘటనతో అన్నీ ప్రతికూలంగా కనిపిస్తున్న వేళ డెమోక్రాటిక్ పార్టీకి ఇది కొత్త ఊపిరి పోస్తోంది. మళ్ళీ ఆశలు చిగురింపజేస్తోంది.

ఇరవై తొమ్మిదేళ్ళ వయసులో జో బైడెన్ జాతీయస్థాయి రాజకీయ జీవితం ప్రారంభించారు. రిపబ్లికన్ సెనేటర్‌ను ఓడించడం ద్వారా 1972లో ఆయన కెరీర్ మొదలైంది. సరిగ్గా 52 ఏళ్ళ తర్వాత అమెరికా చరిత్రలో అత్యంత పెద్ద వయసు అధ్యక్షుడైన ఆయన యుద్ధం చేయకుండానే అస్త్రసన్యాసం చేయాల్సి వచ్చింది. నెలన్నర క్రితం కూడా బరిలో నుంచి తప్పుకొనేది లేదని బల్లగుద్ది చెప్పిన బైడెన్ ఇప్పుడిలాంటి నిర్ణయం తీసుకున్నారంటే... ఒక రకంగా అది ఆయన స్వయంకృతం. మరోరకంగా క్షేత్రస్థాయి పరిస్థితుల పట్ల పెరిగిన అవగాహన అని చెప్పక తప్పదు. ఆయనలో ఈ ప్రాప్తకాలజ్ఞతకు చాలా కారణాలే దోహదపడ్డాయి. ట్రంప్‌తో తొలి చర్చలోనే తడబడడం దగ్గర నుంచి నడకలో, నడతలో, మాటలో మార్పు తెచ్చిన వయోభారం, అభ్యర్థిని మార్చాలంటూ సొంత పార్టీ వారి నుంచే కొంతకాలంగా పెరుగుతున్న ఒత్తిడి వరకు ఇలా అనేకం అందులో ఉన్నాయి. అలాగే, ఆరునూరైనా సరే ముందనుకున్నదే చేసి తీరాలన్న మంకుపట్టు కన్నా రాజకీయాల్లో పట్టువిడుపులు ముఖ్యమనీ, కళ్ళెదుటి వాస్తవాలను బట్టి విజయం కోసం ఆట తీరు మార్చడం కీలకమనీ డెమోక్రాటిక్ పార్టీ అర్థం చేసుకుంది. అందుకే, బైడెన్ పోటీ ఉపసంహరణ నిర్ణయం తీసుకుంది. దీన్ని స్వాగతించాల్సిందే తప్ప తప్పుబట్టడానికి లేదు.

ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన పదవికి డెమోక్రాటిక్ అభ్యర్థిగా బరిలో దిగేందుకు 59 ఏళ్ళ కమలా హ్యారిస్ ఇప్పుడు ముందు వరుసలో ఉన్నారు. భారతీయ మూలాలున్న ఈ లాయర్ మొదట అటార్నీ జనరల్‌గా ఎదిగి, ఆ పైన సెనెటరయ్యారు. నిజానికి, అమెరికా ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన తొలి మహిళ, తొలి నల్లజాతి అమెరికన్, తొలి దక్షిణాసియా అమెరికన్ ఆమే! ఉపాధ్యక్షురాలిగా ఆమె అద్భుతాలు చేయకపోయినా, చిందరవందరైన డెమోక్రాటిక్ పార్టీని మళ్ళీ చక్కదిద్ది గాడిన పెట్టగలరని ఆశ. ఇప్పుడు ఆమె ముందున్న అసలు సవాలదే. ఆమెను అభ్యర్థిగా ప్రకటించడానికి డెమోక్రాట్లు జాగు చేయకపోవచ్చు. అదే జరిగాక... ఎంతైనా స్త్రీ అనీ, ఆమె జాతి ఫలానా అనీ ప్రత్యర్థి ట్రంప్ బృందం ప్రచార దాడులు ప్రారంభించడం ఖాయం. అయితే, గతంలో ఇలానే బరాక్ ఒబామాపై ప్రచారాలు సాగినా, అవేవీ ఓటర్లు పట్టించుకోలేదు. అధ్యక్షుడిగా ఆయన రెండు సార్లు గెలిచారన్నది గమనార్హం. ధాటిగా మాట్లాడుతూ, ప్రచారం చేసే సత్తా ఉన్న కమల ఎన్నికల్లో అద్భుతం చేసినా ఆశ్చర్యం లేదు. ఒకవేళ ట్రంప్‌కు అడ్డుకట్ట వేయలేకున్నా, కనీసం ఆయన తలతిక్క నిర్ణయాలు తీసుకొనే వీలు లేని రీతిలో అమెరికన్ కాంగ్రెస్ ఎన్నికయ్యేలా చేయగలరని విశ్లేషణ.

పునర్వైభవం కోసం డెమోక్రాట్లు అంతా ఏకమవుతున్న వేళ సొంత నియోజకవర్గమంటూ లేని కమల ముందుగా భాగస్వాముల్ని, సమర్థకుల్ని, సహాయకుల్ని, అనుభవజ్ఞులూ – ప్రతిభావంతులైన బృందాన్నీ సమకూర్చుకోవాలి. కీలక రాష్ట్రాల్లో వారే ఆమెకు అండ. నిజానికి, పరిస్థితులు చూస్తుంటే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు అమెరికా ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని నాయకత్వ కొరత పీడిస్తున్నట్టుంది. ఇటు డెమోక్రాట్లు, అటు రిపబ్లికన్లు – ఇరు పక్షాల్లోనూ ప్రజాదరణతో పాటు నేర్పు, ఓర్పున్న సమర్థులైన నాయకులెవరూ కనిపించడం లేదు. ఎవరూ రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవిని చేపట్టరాదన్న అమెరికా రాజ్యాంగం ఒబామా లాంటి వారి పునఃప్రతిష్ఠకు అడ్డంకిగా మారింది. అది లోటే అయినా, ఆ నిబంధనలోని విస్తృత ప్రజాస్వామ్యస్ఫూర్తి, దూరాలోచన అర్థం చేసుకోదగినవే. అనుభవం లేనంత మాత్రాన అధ్యక్షబాధ్యతల్లో విఫలమవుతారనీ లేదు. మునుపటి అధ్యక్షులు చాలామంది అందుకు ఉదాహరణ. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటే, ఏ కొత్త బాధ్యతా కష్టం కాదు. పైగా, ట్రంప్‌కు మళ్ళీ పట్టం కట్టడానికి సుతరామూ ఇష్టం లేని అమెరికన్లకు ఇప్పుడు కమల మినహా ప్రత్యామ్నాయం లేదు. అదీ ఆమెకు కలిసిరావచ్చు. అయితే, హత్యాయత్నం తర్వాత పిడికిలి పైకెత్తి, పోరాటానికి నినదించి హీరో స్థాయికి పెరిగిన ట్రంప్ ప్రాచుర్యాన్ని తక్కువగా అంచనా వేయలేం. యువ ఓటర్లను ఆకర్షించడం కోసం ఉపాధ్యక్ష పదవికి 39 ఏళ్ళ జె.డి. వాన్స్‌ను ఎంపిక చేసుకొని ట్రంప్ మంచి ఎత్తుగడే వేశారు. మొత్తానికి, రోజులు గడుస్తున్నకొద్దీ అమెరికా ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారడం ఖాయమనిపిస్తోంది. ఎందుకంటే, అయిపోయిందనుకున్న ఆట అసలు ఇప్పుడే మొదలైంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, **తిథి:** బ.విదియ ప.12.51 వరకు, తదుపరి తదియ,
నక్షత్రం: ధనిష్ఠ రా.11.46 వరకు, తదుపరి శతభిషం,
వర్జ్యం: లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.13 నుండి 9.05 వరకు,
తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ప.1.54 నుండి 3.24 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సమ్మిళిత అభివృద్ధే లక్ష్యం కావాలి!

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

దేశీయ ఆర్థిక వ్యవస్థ 8 శాతం వద్ద స్థిరంగా వృద్ధి చెందుతూ ఉండొచ్చు; అయితే బయటి ఎదురుగాలులు ఈ వృద్ధిని దెబ్బ తీయొచ్చు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సమాన స్థాయిలో మద్దతునిస్తూ, మౌలిక సదుపాయాలు, సేవల వంటి కీలక రంగాలను బలోపేతం చేయడంపై బడ్జెట్ దృష్టి పెట్టాలి. ప్రైవేట్ పెట్టుబడులకు సులభతర వాతావరణాన్ని సృష్టించే దిశగా కూడా ముందుకు సాగాలి. ఐఐటీలు, ఐఐఎమ్‌ల వంటి అద్భుతమైన ఉన్నత విద్యా సంస్థలతో కూడిన దేశంలో ప్రాథమిక, మాధ్యమిక విద్య దుర్భర స్థితిలో ఉంది. సమాజంలోని అన్ని వర్గాలూ ప్రయోజనాలను పొందేలా చూసుకోవాలి. భారీస్థాయిలోని మన యువ జనాభా శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి సన్నద్ధం అయ్యేలా కేంద్ర, రాష్ట్రాలు కలిసి పని చేయాలి.

భౌగోళిక రాజకీయ రంగంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రంలోని కొత్త ప్రభుత్వం తన మొదటి బడ్జెట్‌ను సిద్ధం చేస్తోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్–హమాస్ వివాదం తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు. దేశీయ ఆర్థిక వ్యవస్థ దాదాపు 8 శాతం వద్ద స్థిరంగా వృద్ధి చెందుతూ ఉండవచ్చు. అయితే బాహ్య వాతావరణపు స్థిరత్వాన్ని బట్టి ఇది మారవచ్చు. ప్రపంచ చమురు ధరలు తగ్గింపు స్థితిలోనే ఉంటాయనీ, ఎగుమతి వృద్ధిని ప్రభావితం చేసిన మాంద్యం పోకడల నుండి పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలు బయటపడతాయనీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆశిస్తూ ఉండవచ్చు. అంతర్జాతీయ సముద్ర మార్గాలను కలహాలు లేకుండా ఉంచడం కూడా వచ్చే పోయే వాణిజ్య ఖర్చులలో అనవసరమైన పెరుగుదలను నివారించడంలో కీలకం. స్పష్టంగా, బయటి ఎదురుగాలులు భారతదేశ వృద్ధి కథనాన్ని చెడగొట్టే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అందువల్ల, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సమాన స్థాయిలో మద్దతునిస్తూ, మౌలిక సదుపాయాలు, సేవల వంటి కీలక రంగాలను బలోపేతం చేయడంపై బడ్జెట్ దృష్టి పెట్టడం అవసరం.

మౌలిక వసతుల రంగంలో, గత కొన్నేళ్లుగా నమోదైన మూలధన వ్యయంలో విపరీతమైన పెరుగుదలను విధాన రూపకర్తలు కొనసాగించడం మంచిది. 2024–25 మధ్యంతర బడ్జెట్ మూలధన వ్యయంలో అంతకుముందు నమోదైన 30 శాతం పెరుగుదలను సుమారు 16.9 శాతానికి తగ్గించింది. దేశంలోని విస్తారమైన మౌలిక సదుపాయాల అంతరం కారణంగా మూలధన వ్యయంలో అధిక పెరుగుదల అవసరం. ఇది భారీ సంఖ్యలో నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను వెంటనే సృష్టించలేకపోయినా, ఉపాధి కల్పనపై నిస్సందేహంగా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ. 2.11 లక్షల కోట్లను బదిలీ చేసిన వాస్తవం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ దిశలో కొనసాగడానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

ప్రభుత్వ రంగం కంటే వెనుకబడిన ప్రైవేట్ పెట్టుబడులకు సులభతర వాతావరణాన్ని సృష్టించే దిశగా కూడా బడ్జెట్ ముందుకు సాగాలి. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు వంటి అమలులో ఉన్న విధానాలు తయారీకి ప్రోత్సాహాన్ని ఇస్తాయి. ఈ విధానాలను మరింత క్రమబద్ధీకరించాలి. 1991 ఆర్థిక సంస్కరణల కాలం నుండి నియంత్రణ వాతావరణం కచ్చితంగా చాలా ప్రగతి సాధించింది. కానీ గతంతో పోల్చడం అసందర్భం అవుతుంది. ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో ఇప్పుడు పోల్చుకోవలసి ఉంది. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు సరళమైన, సులభమైన పెట్టుబడి విధానాలను అందిస్తున్నాయి. బహుళజాతి సంస్థలు అక్కడ స్థావరాన్ని ఏర్పరచుకోవడానికి ఇది ఒక ఆకర్షణ. దీనికి విరుద్ధంగా భారతదేశం అంత ఆకర్షణీయంగా కనిపించడం లేదు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

దేశీయ పెట్టుబడిదారులు అధిక మూలధనం, లాజిస్టిక్స్ ఖర్చులతో పోరాడవలసి ఉంటుంది. అయినప్పటికీ, కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు సమృద్ధిగా లభించకపోవడం అనేది దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు ప్రధాన అడ్డంకిగా మిగిలిపోయింది. ఈ సమస్యలు ఇప్పుడు ఎక్కువగా రాష్ట్రాలు లేదా స్థానిక మునిసిపాలిటీల స్థాయిలో ఉన్నాయి. సులభతరమైన వ్యాపారాన్ని ఈ స్థాయికి తీసుకురావడం తదుపరి తరం సంస్కరణల్లో భాగం కావాలి.

మరో తరం సంస్కరణలు అవసరం

ఫిబ్రవరిలో 2024–25 మధ్యంతర బడ్జెట్‌తో విడుదల చేసిన ఆర్థిక ప్రకటనలో ఇది ఇప్పటికే పరిగణించబడుతుందనే సూచన కనిపిస్తోంది. ఇది మండలం, జిల్లా, గ్రామ స్థాయిలలో పాలనను మెరుగుపరచడం గురించి ప్రస్తావించింది. వృద్ధి, అభివృద్ధి ఆధారిత సంస్కరణల కోసం రాష్ట్రాలకు 75,000 కోట్ల రూపాయల రుణాన్ని కూడా అందించారు. ఆరోగ్యం, విద్య, నైపుణ్యం, భూసేకరణ వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించడమైనది.

సంస్కరణలు చేపట్టేందుకు రుణాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అన్ని రాష్ట్రాలు సహకరించకపోవడమే ఈ ప్రణాళికలోని ఏకైక చిక్కు. బీజేపీ పాలిత రాష్ట్రాలు కేంద్రం నుంచి వచ్చే ఆదేశాలకు కట్టుబడి ఉండాల్సి ఉంటుంది, కానీ ఇతర రాష్ట్రాల నుంచి అదే స్పందన రాకపోవచ్చు. అందుకే తదుపరి తరం సంస్కరణలను ప్రారంభించే లక్ష్యం పాక్షికంగా మాత్రమే విజయవంతమవుతుంది. అదే సమయంలో, ముఖ్యంగా దక్షిణ భారతంలోని కొన్ని రాష్ట్రాలు, ఇప్పటికే నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించినట్లు తెలుస్తోంది. ఫలితంగా ఇన్వెస్టర్లు వారికి అండగా నిలుస్తున్నారు. ఉదాహరణకు, ఆపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రధానంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసుకొంటున్నాయి. ఈ రాష్ట్రాలు అవలంబించిన విధానాలను అధ్యయనం చేయాలి. ఇతర రాష్ట్రాల్లోనూ వీటిని పునరావృతం చేయాలి.

ఈ సందర్భంలో, విద్య, నైపుణ్యాలకు చెందిన క్లిష్టమైన విభాగానికి బడ్జెట్ కేటాయింపులు అవసరం. ప్రభుత్వ ఎజెండాలో ఉద్యోగాల కల్పన ఎక్కువగా ఉండాల్సి ఉండగా, అనేక రంగాలు నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయన్నది వాస్తవం. విద్య రకం, పరిశ్రమకు అవసరమైన నిర్దిష్ట నైపుణ్యాల మధ్య అసమతుల్యత కూడా ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికి దీర్ఘకాలిక విధాన చికిత్సలను రూపొందించాలి. అయితే స్వల్ప కాలంలో, రాబోయే బడ్జెట్‌లో నైపుణ్యం కలిగిన సంస్థలకు తగిన కేటాయింపులను అందించవచ్చు.

అదనంగా, విద్యపై ఎక్కువ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఐఐటీలు, ఐఐఎమ్‌ల వంటి అద్భుతమైన ఉన్నత విద్యా సంస్థలతో కూడిన దేశం ఇది. కానీ ప్రాథమిక, మాధ్యమిక విద్య దుర్భరమైన స్థితిలో ఉంది. ఇక్కడ కూడా, మన భారీస్థాయిలోని యువ జనాభా శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి బాగా సన్నద్ధం అయ్యేలా కేంద్ర, రాష్ట్రాలు కలిసి పని చేయాలి.

జీడీపీ, ఉపాధి కల్పనలకు సహకారం అందిస్తున్నందున ప్రయాణం, పర్యాటకం వంటి సేవలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా మరింత మద్దతు ఇవ్వాలి. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికీ, మెరుగైన ఆర్థిక ఎంపికలు అందుబాటులోకి రావడానికీ హోటళ్లకు మౌలిక సదుపాయాల స్థితిని ఆతిథ్య పరిశ్రమ కోరుతోంది. కోవిడ్ ప్రభావిత పతనం నుండి ఈ రంగం బలంగా పుంజుకుంటోంది. అయితే కొంత లక్ష్యిత మద్దతు ఉపాధి అవకాశాలను విస్తరిస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడం తక్షణ అవసరం. వాటిని ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహకాలతో పాటు, రైతులు రిటైల్ మార్కెట్‌లను ప్రత్యక్ష మార్గంలో అందుకోవడానికి తగిన వ్యవస్థలను ఏర్పాటు చేయడం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఆదాయ మార్గాల కల్పనతో పాటు మౌలిక వసతుల కల్పనను తక్షణ ప్రాతిపదికన చేపట్టాలి. లేకుంటే రానున్న సంవత్సరాల్లో పట్టణ, గ్రామీణ అంతరం మరింత విస్తరిస్తూనే ఉంటుంది. సమాజంలోని అన్ని వర్గాలూ ప్రయోజనాలను పొందగలిగేలా చూసుకోవాలి. దేశవ్యాప్తంగా ఆకాంక్షలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయని ఇటీవలి ఎన్నికలు తెలియజేశాయి. సంక్షేమ విధానాలకు స్వాగతమే. అయితే దీర్ఘకాలంలో అవి స్థిరమైన అభివృద్ధికి దారితీయాలి.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎలా భరిస్తున్నారో!



డోనాల్డ్ ట్రంప్ మీద (అమెరికా) మీడియాలో వరుసగా తొమ్మిదేళ్లుగా దూషణలు కొనసాగుతున్నాయి. కానీ బైడెన్ ఒక్క నెల కూడా వాటిని తట్టుకోలేకపోయారు.

– డేవిడ్ సాక్స్, ఆంట్రప్రెన్యూర్

విషయం అర్థం చేసుకోండి!



నా టైమ్‌లైన్ మీద చాలా ఆగ్రహం కనబడుతోంది. మరీ సూటిగా మాట్లాడటం వల్ల ఇలాంటి స్పందన వస్తున్నట్టుంది. ఐపీఎస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, ఇంకా రక్షణ రంగం లాంటివాటిల్లో ఈ (దివ్యాంగుల) కోటాను ఎందుకు అమలు చేయలేదో హక్కుల కార్యకర్తలు పరిశీలించాలి. ఐఏఎస్ అనేది వాటికి భిన్నం కాదనేంతవరకే నా అభిప్రాయం. అందరినీ కలుపుకొనిపోయే సమాజంలో జీవించాలన్నదే మన కల. స్పందనారాహిత్యం అనేదానికి నా మనసులో చోటు లేదు. జై హింద్!

– స్మితా సభర్వాల్, ఐఏఎస్ అధికారిణి

అలా వస్తుంటే...



విమానాశ్రయంలో గుండ్రటి లగేజ్ బెల్ట్ మీదుగా మన బ్యాగు వస్తున్నప్పుడు చూడటంలో ఉండే సంతోషం వేరు!

– మోనికా హాలన్, రచయిత్రి

బడ్జెట్ లాభించేనా?



రానున్న మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శనను నిర్ణయించే అంశాల్లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఒకటి. మూడింట రెండు రాష్ట్రాలు దాదాపుగా చేజారిపోయాయి. దాన్ని తిరగదిప్పడానికి రానున్న నెలల్లో బీజేపీ ఏం చేస్తుందో చూద్దాం.

– వైభవ్ సింగ్, మీడియా పర్సనాలిటీ

తినకూడదా?



ఇండియాలో అసాధారణ ద్రవ్యోల్బణం ఉంది. సగటు ద్రవ్యోల్బణం 5.2 శాతం కాగా, కూరగాయలది 30 శాతం. కూరగాయలకు పెట్టే ఖర్చు చాలా చిన్న విషయమైన ధనికులకు అది ఎక్కువ కాదు. కానీ ఆహారం, కూరగాయల మీద ఎక్కువ ఖర్చుపెట్టే మధ్యతరగతి, పేదవాళ్లకు ఇది ఎంతో ఎక్కువ.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

పర్యటించనేలేదా?



రానున్న నెలల్లో చైనాలో పర్యటించే యోచన బైడెన్‌కు లేకపోతే గనక, జిమ్మీ కార్టర్ తర్వాత పదవిలో ఉండగా చైనాను సందర్శించని మొదటి అమెరికా అధ్యక్షుడు ఆయన అవుతారు. అన్నట్టూ, పదవిలోంచి దిగిపోయాక కార్టర్ చైనాకు ఎనిమిది సార్లు వచ్చారు.

– హు షిజిన్, చైనా సంపాదకుడు

ప్రజాస్వామ్యానికి ముప్పు




కమలా హ్యారిస్ అమెరికాకు తర్వాతి అధ్యక్షురాలు అవుతుంది. నవంబర్‌లో ఆమె గెలుపు కోసం నా పూర్తి మద్దతును ఇస్తున్నాను. ఇంతకుముందుకన్నా మరింత ఎక్కువగా అమెరికా ప్రజాస్వామ్యానికి ఉన్న ముప్పును ఎదుర్కోవడానికి గానూ డోనాల్డ్ ట్రంప్‌ను ఓడించేందుకు మన పార్టీ, మన దేశం వేగంగా ఒక్కటవ్వాలి.

– అలెక్సాండ్రియా ఒకాసియో–కోర్టెజ్, డెమోక్రాట్ నాయకురాలు

ఇన్ బాక్స్

స్వేచ్ఛ కోసం విప్లవించి...

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ పంథాలో పనిచేసి దేశానికి ప్రాణాలు అర్పించినవారిలో చంద్రశేఖర్ ఆజాద్ ఒకరు. 1906 జూలై 23న మధ్యప్రదేశ్‌లోని బాబానగర్‌లో ఆయన జన్మించారు. అయితే ఆయన పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు కావడంతో తల్లిదండ్రులు కాశీ విద్యా పీఠంలో సంస్కృత విద్యను అభ్యసించడానికి ఆయన్ని చేర్చారు. అప్పటికే స్వాతంత్ర్య ఉద్యమానికి ఆకర్షితుడై 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా తాను చదువుకుంటున్న సంస్కృత విద్యాపీఠం ముందే ధర్నా చేశాడు. పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. 'నీ పేరేమిటి?' అన్న జడ్జి ప్రశ్నకు ఆ 15 ఏళ్ల బాలుడు 'ఆజాద్' (స్వేచ్ఛ) అని సమాధానం ఇచ్చాడు. అప్పటి నుంచి అతడి పేరులో ఆజాద్ భాగమయ్యింది. ఇటువంటి సమాధానాలకు అతడికి 15 కొరడా దెబ్బలు శిక్షగా విధించాడు జడ్జి.



చంద్రశేఖర్ ఆజాద్

పెద్దవాడవుతున్న కొద్దీ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం రాదని ఆయన నమ్మాడు. భగత్ సింగ్, రాంప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లాఖాన్‌లతో మైత్రి ఏర్పడింది. వీరంతా కలిసి 'హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థను స్థాపించారు. వారి పోరాటానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి 1925లో కకోరి వద్ద బ్రిటిష్ ప్రభుత్వ ధనాన్ని తరలిస్తున్న రైలును ఆపి దోపిడీ చేశారు. ఈ కేసులో అష్ఫాకుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ లాంటివారిని పట్టుకుని ఉరితీసింది బ్రిటిష్ ప్రభుత్వం. ఆజాద్ అజ్ఞాతంలోకి వెళ్లి పనిచేయసాగాడు. 1931 ఫిబ్రవరి 27 ఉత్తర ప్రదేశ్‌లోని 'ఆల్ఫ్రెడ్ పార్కు'లో ఆజాద్ ఉన్నాడని తెలిసిన పోలీసులు చుట్టుముట్టారు. ఆజాద్ తన తుపాకితో వీరోచితంగా పోరాడి చివరి బుల్లెట్‌తో తనను తాను కాల్చుకొని పోలీసులకు ప్రాణాలతో చిక్కకుండా ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నాడు. అలా స్వతంత్ర భారత యజ్ఞంలోస్వీయ సమిధయ్యాడు.

– ఛత్రపతి చౌహాన్ । ఏబీవీపీ తెలంగాణ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు
(నేడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి)

బడ్జెట్ 3.0లోనైనా సంక్షేమం వికసించేనా?

అభిప్రాయం



తండ సదానందం

మన దేశంలో బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెడతారు. ఈ సంవత్సరం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో మధ్యంతర బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టారు. అందుకే పూర్తి స్థాయిలో నేడు (జూలై 23న) 18వ లోక్ సభలో 2024–25 బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేశారు. గత బడ్జెట్లు అన్నీ సంపన్నులకు లాభం చేకూర్చేవిగానే ఉన్నాయనీ, ఈసారైనా కాస్త సామాన్యులకు ఊరట కలిగించేవిగా ఉండాలనీ జనం ఎదురుచూస్తున్నారు. భాగస్వామ్య పక్షాల వెన్నుదన్నుతో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ దూకుడు తగ్గించి సామాన్యుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందనీ, ఇవ్వాలనీ ప్రజలు ఆశిస్తున్నారు.

కోవిడ్ కాలం నుండి పేదల బతుకుల్లో ఆశించిన మార్పులు లేవు. ఉపాధి కోల్పోయి కొనుగోలు శక్తి లేక ఆకలి సైతం తీర్చుకోలేక విలవిలలాడుతున్న దుర్భర పరిస్థితులు ఉండడం బాధాకరం. ఇప్పటికీ వ్యవసాయం, చేనేత, లఘు పరిశ్రమలు వంటివి సంక్షోభంలో పడిపోగా కోట్లాదిమంది అర్ధాకలితో, పస్తులతో గడుపుతున్నారు. 125 దేశాలను పరిగణనలోకి తీసుకున్న అంతర్జాతీయ ఆకలి సూచికలో 111వ స్థానంలో భారత్ ఉంది. దీన్ని బట్టి ఇక్కడ పేదరికం ఎంతగా ఉందో అర్థమవుతుంది. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా ఆహార ధాన్యాలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం తగ్గించేలా 3.0 బడ్జెట్‌లో చర్యలు ఉండాలి.

గత ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పేద ప్రజలందరికీ గృహ నిర్మాణ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలి. 2022–23 బడ్జెట్‌తో పోలిస్తే 2024–25 మధ్యంతర బడ్జెట్లో వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు వేల కోట్ల రూపాయలు తగ్గించారు. ఇది సరికాదు. రైతన్నను ఆదుకోవడానికి తగిన కేటాయింపులు ఈసారన్నా జరగాలి. దేశ ప్రగతికి కీలక అవసరమైన విద్యపై గత బడ్జెట్లో ఆశించిన కేటాయింపులు లేవు. ప్రైవేటు విద్యను ప్రోత్సహించేలా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధికి నిధుల కేటాయింపు పెంచాలి.



అలాగే ప్రభుత్వమే ఉచిత వైద్యం అందించేలా బడ్జెట్ రూపొందించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ప్రజారోగ్యంపై స్థూల జాతీయోత్పత్తిలో ఐదు శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.1 శాతం మాత్రమే మన దేశంలో ఖర్చు పెడుతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా 5 శాతం నిధులు ప్రజారోగ్యంపై కేటాయించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.


స్టాండర్డ్ డిడక్షన్ కొత్త పన్ను విధానంలో 7 లక్షల నుండి 12 లక్షల వరకు పెంచాలి. అదేవిధంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలి. 'బేటీ పఢావో బేటీ బచావో' అనేది నినాదాలకు పరిమితం చేయకుండా మహిళా సాధికారత దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలి. మహిళల పట్ల వేధింపులు లేకుండా ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిని కల్పించడానికి ఏకైక మార్గమైన 'ఉపాధి హామీ పథకా'నికి ఎక్కువ నిధులు కేటాయించాలి. మొత్తం మీద ఈ బడ్జెట్ నిరుపేద, మధ్య తరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెడతారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

వ్యాసకర్త టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్
మొబైల్: 99895 84665

స్వ స్వరూపాన్ని గుర్తించే సాధనం

ఉపవాసం అంటే పస్తు ఉండటం, నిరాహారంగా ఉండటం అని వాడుక. కానీ 'ఉప–వాసం' అనే పదబంధానికి ఆహారంతో సంబంధం కనిపించదు. 'ఉప' అంటే 'సమీపం', 'వాసం' అంటే 'నివాసం'. కాబట్టి 'ఉపవాసం' అంటే దగ్గరగా ఉండటం. దేనికి దగ్గరగా ఉండటం? ఉపవాసం చేసే సాధకుడు దేనికి దగ్గరగా ఉండాలనుకొంటున్నాడో దానికి!

ఉదాహరణకు, ఒక భక్తుడు కొంత సమయం పాటు, ఎప్పటికంటే ఎక్కువగా, మనో–వాక్–కాయ–కర్మల ద్వారా తన ఇష్ట దైవానికి సన్నిహితంగా ఉండాలని సాధన చేస్తే, అది ఉపవాస సాధన అవుతుంది. శరీరాన్ని వీలయినంత ఎక్కువ సమయం భగవన్మూర్తికి దగ్గరగా ఉంచుతూ, ఇతర లౌకిక విషయాలకు దూరంగా ఉంచటం శారీరకమైన ఉపవాసం. వాక్కును కొంతకాలం పాటు భగవత్ స్తోత్రాలకూ, భగవద్విషయమైన చర్చలకూ పరిమితం చేయటం వాక్కుపరమైన 'ఉపవాసం'.



జ్యోతిర్మయం

మనసును ఆహార విహారాల లాంటి ఇంద్రియ విషయాల మీదనుంచి కొంతసేపు మళ్ళించి, దైవం మీద నిలిపి ఉంచటం మానసికమైన ఉపవాసం. అలాగే లౌకికమైన పనులకు కొంతకాలం సెలవిచ్చి, ఆ సమయాన్ని పూజలకూ, ఆరాధనలకూ, అభిషేకాలకూ, వ్రతాలకూ వెచ్చించడం... కర్మల పరంగా దైవానికి సమీపంగా ఉండే 'ఉపవాసం'.

ఈ దేహమూ, ఇంద్రియాలూ, మనస్సు– ఇవే 'నేను' అన్న మిథ్యా భావనలో మునిగిపోయి, వీటికి అతీతంగా వెలుగుతుండే ఆత్మజ్యోతి తన అసలు రూపం అని మరిచిపోయిన జీవుడు, కొంతకాలం పాటన్నా దేహేంద్రియ వ్యవహారాలకు దూరంగా, తన స్వ స్వరూపానికి దగ్గరగా వెళ్ళి దానిని గుర్తించేందుకు చేసే సాధన 'ఉపవాసం' అని వేదాంతులు వివరణ ఇచ్చారు.

మామూలుగా రోజూ తినే ఆహారం మీద నుంచి దృష్టి మళ్ళించేసి, ఒక్కపూట మరేదయినా ఆహారం పుచ్చుకొంటే ఇహానికీ పరానికీ మంచిదన్న భావనతో, దాని మీద దృష్టి పెట్టడం కూడా 'ఉపవాసమే'. కానీ అది మనో వాక్ కాయ కర్మలన్నిటి ద్వారా, ఆ కొత్త ఆహారానికి 'సమీపంగా ఉండటం' మాత్రమే అవుతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

ఆర్టీసీ లక్ష్యం.. బిలియన్ డాలర్ టర్నోవర్

- లక్ష్యం నిర్ధారించుకుని ఆ దిశగా ముందుకు
- తొలి త్రైమాసికంలో రూ.2 వేల కోట్లకు పైగా రెవెన్యూ
- రూ.8,300 కోట్ల ఆదాయం సాధించేందుకు ఆర్టీసీ సిద్ధం
- త్వరలో 500 కొత్త బస్సులు.. పెరగనున్న టికెట్ ఆదాయం
- 'మహాలక్ష్మి'వల్ల రెట్టింపైన మహిళా ప్రయాణికుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ తొలిసారి ఒక బిలియన్ డాలర్ల(దాదాపు రూ.8,300 కోట్లు) టర్నోవర్ క్లబ్‌లో చేరేందుకు లక్ష్యం నిర్ధారించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సమకూరిన ఆదాయంతో సంస్థలో కొత్త ఉత్సాహం నెలకొంది. దీంతో మిగతా మూడు త్రైమాసికాల్లో దానికి తగ్గకుండా ఆదాయాన్ని సాధించటం ద్వారా ఒక బిలియన్ డాలర్ టర్నోవర్ సాధించే అరుదైన మైలు రాయిని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఆర్టీసీ చరిత్రలో ఓ అరుదైన ఘట్టంగా మిగులుతుందని సంస్థ భావిస్తోంది. ఓవైపు భారీగా రికార్డవుతున్న సంస్థాగత వ్యయం, అప్పులపై చెల్లిస్తున్న రూ.వందల కోట్ల వడ్డీ.. వెరసి సంస్థకు కొంత నష్టాలనే మిగులుస్తున్నా, ఆదాయ పరంగా ఈ కొత్త రికార్డు సృష్టించాలని నిర్ణయించుకుంది.

ఆదాయం పెంపుపైనే దృష్టి పెట్టి..

గత కొంతకాలంగా ఆదాయాన్ని భారీగా పెంచుకునేందుకు ఆర్టీసీ శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఏడాదిన్నర క్రితం పలు రకాల సెస్‌లను సవరించి పరోక్షంగా బస్ చార్జీలను పెంచింది. దాని ద్వారా ఆదాయం భారీగా పెరిగింది. ఎండీ సజ్జనార్ వినూత్న ఆలోచనలతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తూ ఆదాయం పెంచటంలో సక్సెస్ అయ్యారు. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో స్పేర్‌లో ఉన్నవి సహా అన్ని బస్సులను రోడ్డెక్కించి, సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరిగేలా చూస్తున్నారు. లక్షే లక్ష్యం పేరుతో .. ప్రతి డిపో నిత్యం రూ.లక్ష వరకు అదనపు ఆదాయం సాధించేలా కొత్త టార్గెట్‌ను అమలు చేస్తున్నారు. ఫలితంగా 38 డిపోలు లాభాల్లోకి వచ్చాయి. ఇలాంటి ప్రత్యేక చర్యల వల్ల గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.6,942 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అది రూ.2 వేల కోట్లను మించింది.

మహిళల ఉచిత ప్రయాణంతో..

ఉచితంగా ప్రయాణించే మహిళలకు బస్సుల్లో జీరో టికెట్లు జారీ చేస్తున్నారు. వాటి విలువను లెక్కగట్టి ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సి ఉంది. మహిళల సంఖ్య భారీగా పెరగటంతో ఆర్టీసీ ఆదాయం కూడా బాగా పెరిగింది. ఆ మేరకు తొలి త్రైమాసిక ఆదాయం రూ.2 వేల కోట్లను దాటింది. ఇక త్వరలో దశలవారీగా 500 వరకు కొత్త బస్సులు సమకూరనున్నాయి. వీటి ద్వారా కూడా ఆదాయం పెరుగుతుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.8,300 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. దాన్ని మన రూపాయల్లో కాకుండా ప్రత్యేకంగా డాలర్లలో పేర్కొంటే బిలియన్ డాలర్ల మొత్తంగా అవుతుంది. దీంతో ఆ పేరుతో ఈ లక్ష్యాన్ని నిర్ధారించుకున్నారు.



అంకెల్లో ఆదాయం.. వాస్తవరూపందాలుస్తుందా?

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళల ఉచిత ప్రయాణాలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.2,350 కోట్ల విలువైన జీరో టికెట్లు జారీ అయ్యాయి. కానీ, ప్రభుత్వం మాత్రం ఆర్టీసీకి రూ.1,740 కోట్లు మాత్రమే రీయింబర్స్ చేసింది. మిగతా రూ.610 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. కానీ, "బిలియన్ డాలర్ల టర్నోవర్"లో మాత్రం రూ.2,350 కోట్ల మొత్తాన్ని ఆదాయంగా చూపుతారు. అంటే అంకెల్లో ఆదాయం కనిపిస్తుంది, వాస్తవంగా లోటులో ఉంటుంది. అంకెల్లో ఉన్న ఆదాయం వాస్తవం కావాలంటే ప్రభుత్వం ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది.

ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తేనే అసలు ఆదాయం

ఆర్టీసీలో 2015లో చేసిన వేతన సవరణకు సంబంధించి బాండ్ల మొత్తాన్ని ఉద్యోగులకు ఇవ్వనున్నట్టు గత ఫిబ్రవరిలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దానికి సంబంధించిన రూ.281 కోట్ల మొత్తాన్ని విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. కానీ, కేవలం రూ.81 కోట్లు మాత్రమే రావటంతో ఆర్టీసీ దానికి డ్రైవర్లకు అందించింది. మిగతా నిధులు ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. త్వరలో చెల్లిస్తామంటూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొంటున్నారే తప్ప, ఎప్పటికి ఇస్తారో మాత్రం చెప్పలేకపోతున్నారు. భవిష్య నిధికి బకాయి చెల్లించకపోవటంతో ఆ సంస్థ ఇటీవల ఏకంగా ఆర్టీసీ ప్రధాన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసింది. సంస్థ ఆర్థిక పరిస్థితి ఇలా ఉన్న తరుణంలో బిలియన్ డాలర్ల టర్నోవర్ లాంటి ఫీట్ చేపట్టడం విశేషం. ప్రభుత్వపరంగా ఆర్టీసీకి పూర్తి చేయూతనందిస్తే ఈ ఫీట్ ప్రత్యక్షంగా సంస్థకు ఉపయోగంగా ఉండనుంది.

ఫార్మా, ఎయిర్‌కార్గోలో తెలంగాణ సూపర్!

- 2023–24 ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వం వెల్లడి
- రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగుపర్చుకునే దిశగా చర్యలు
- ఇక్కడి పురుషులు, మహిళల్లో పెరుగుతున్న ఊబకాయం సమస్య
- ఈ–నామ్‌తో 89% మంది తెలంగాణ రైతులకు ప్రయోజనం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడించింది. తెలంగాణ, ఏపీతోపాటు పలు ఇతర రాష్ట్రాల్లో స్థూల ద్రవ్యలోటు, ఆర్థిక లోటు తగ్గాయని పేర్కొంది. ముఖ్యంగా మూలధన పెట్టుబడులపై ఈ రాష్ట్రాలు దృష్టి సారించడంతో.. మెరుగ్గా ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2023–24 ఆర్థిక సర్వే నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

● దేశ ఫార్మా ఉత్పత్తుల్లో తెలంగాణ వాటా 30 శాతానికిపైగా ఉందని, వెయ్యికిపైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలకు వేదికగా మారిందని కేంద్రం తెలిపింది. ● దేశవ్యాప్తంగా విమానాల ద్వారా సరుకుల రవాణా (ఎయిర్ కార్గో)లో హైదరాబాద్ 44 శాతంతో టాప్‌లో నిలిచిందని వెల్లడించింది. ● 2019–21 మధ్య దేశ వయోజన జనాభాలో ఊబకాయం ఆందోళనకర స్థాయికి పెరిగిందని... తెలంగాణలో పురుషుల్లో ఊబకాయం 24.2% నుంచి 32.3 శాతానికి.. మహిళల్లో 28.6% నుంచి 30.1శాతానికి పెరిగిందని తెలిపింది. ● వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల కోసం తెచ్చిన ఈ–నామ్‌తో తెలంగాణలోని 89 శాతం మంది రైతులు మెరుగైన ధర పొందారని పేర్కొంది. ● దేశంలో సిమెంట్ పరిశ్రమల వార్షిక స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం 622 మిలియన్ టన్నులకు చేరిందని.. అందులో 85శాతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోనే ఉందని తెలిపింది. ● ఇక ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా సిద్దిపేటలో అమలు చేస్తున్న 'స్టీల్ బ్యాంక్' విధానాన్ని కేంద్రం ప్రశంసించింది.

ఫిరాయింపులపై వారంలో సుప్రీంకు..!

- ఢిల్లీలో న్యాయనిపుణులతో భేటీ అయిన కేటీఆర్
- హైకోర్టులో జాప్యం అవుతుండటంతో సుప్రీంకోర్టుకు వెళ్లాలని భావిస్తున్నాం
- కవిత అనారోగ్యానికి గురై బరువు తగ్గడం బాధగా ఉందని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై వారం రోజుల్లో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలను దేశవ్యాప్తంగా తెలియ చెబుతామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణలో జరుగుతున్న ఫిరాయింపులపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సోమవారం సోదరి, ఎమ్మెల్సీ కవితను తీహార్ జైలులో కలిసేందుకు వచ్చిన కేటీఆర్.. సుప్రీంకోర్టుకు చెందిన న్యాయనిపుణులతో భేటీ అయ్యి, ఫిరాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు. దానం నాగేందర్ వ్యవహారంపై తాము ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించామని, అక్కడ చాలారోజుల నుంచి జాప్యం జరుగుతోందని కేటీఆర్ చెప్పారు. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. హరియాణా, హిమాచల్‌ప్రదేశ్‌లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఫిర్యాదు మేరకు అక్కడి స్పీకర్లు వారిపై అనర్హత వేటు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీని వీడి మరొక పార్టీలోకి చేరిన వారిపై పోరాటాలు చేస్తున్న కాంగ్రెస్.. తెలంగాణలో ఫిరాయింపులకు ఎందుకు పాల్పడుతోందని ప్రశ్నించారు. వాషింగ్ మెషీన్ పార్టీగా బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్ తెలంగాణలో వ్యవహరిస్తున్న తీరును ఏవిధంగా సంబోధించాలో చెప్పాలన్నారు. ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టుకు చెందిన న్యాయ నిపుణులకు అన్ని ఆధారాలను ఇచ్చామని, సుప్రీంకోర్టులో ఫైట్ చేయనున్నట్లు కేటీఆర్ వివరించారు.

రాజ్యసభలో గళం విప్పుతాం

తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని కాంగ్రెస్ చేర్చుకోవడంపై రాజ్యసభలో గళం విప్పుతామని కేటీఆర్ చెప్పారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ ఒక్కరిపై అనర్హత వేటు వేయాల్సిందేనని, ఆ దిశగా తాము న్యాయ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. రాజ్యసభ, లోక్‌సభలో అనుభవజ్ఞులైన సభ్యులున్నారని వారితో ఫిరాయింపులపై ఓ కమిటీని వేయాలంటూ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి అఖిలపక్ష సమావేశం దృష్టికి తీసుకెళ్లినట్లుగా పేర్కొన్నారు.

బరువు తగ్గిన కవిత

సోదరి కవితను కలిశానని, అనారోగ్యం నుంచి ఆమె ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని కేటీఆర్ చెప్పారు. ఆమె దాదాపు 7–10 కిలోల బరువు తగ్గిందని, బలహీనంగా కనిపించడం వల్ల బాధ కలిగిందన్నారు. 130 రోజులుగా న్యాయం కోసం తన సోదరి జైల్లో పోరాడుతోందని చెప్పారు. కవిత కొద్దిరోజుల్లో కడిగిన ముత్యంలా బయటకు వస్తుందని కేటీఆర్ విశ్వాసం వ్యక్తంచేశారు. మరో వైపు ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని ఈ నెల 26 వరకూ ట్రయల్ కోర్టు పొడిగించింది.

నూతన నేర చట్టాలపై మీ వైఖరేంటి?

రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్‌కు కేటీఆర్ ప్రశ్న

- పలు నిబంధనలు, సెక్షన్లు వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటకలో వీటి అమలుపై వ్యతిరేకత
- నియంతృత్వ సెక్షన్లపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి పంపాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమల్లోకి తెచ్చిన నేర చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ తమ వైఖరి వెల్లడించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కొత్తగా వచ్చిన భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)పై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. నూతన న్యాయ చట్టాలపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో నియంతృత్వ సెక్షన్లపై రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేసి పంపాలని కేటీఆర్ కోరారు. ఈ మేరకు సోమవారం కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఈ చట్టాల్లోని పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. ఈ చట్టాలు పోలీసులు, ప్రభుత్వానికి మితిమీరిన అధికారాన్ని కట్టబెట్టేలా ఉన్నాయని, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని హక్కుల సంఘాలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామికవాదులు, న్యాయ నిపుణులతోపాటు పలు రాష్ట్రాలు కూడా నూతన చట్టాలను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేశారని పేర్కొన్నారు.

తొందరపాటు చట్టాలు

దేశవ్యాప్తంగా విస్తృత స్థాయి సంప్రదింపులు జరపకుండానే కేంద్రం తొందరపాటుతో ఈ చట్టాలను తెచ్చిందని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. పార్లమెంటు ఉభయ సభల నుంచి 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్‌చేసి ఆమోదించిన ఈ చట్టాలపై ఇప్పటికే బీఆర్‌ఎస్ నాయకులతోపాటు పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛను హరించేలా ఉన్న ఈ చట్టాలతో నిందితులకు బెయిల్ వచ్చే అవకాశాలు తగ్గిపోతాయన్నారు. ప్రభుత్వచర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్షలపై కేసుల నమోదు అధికారం వచ్చిందన్నారు. సైబర్ నేరాలు, హ్యాకింగ్, ఆర్థిక నేరాలు, గోప్యత, సాంకేతికత ద్వారా విధ్వంసం వంటి వాటి కోసం రూపొందించిన ప్రత్యేక అధ్యాయంలో అనేక అస్పష్టతలున్నాయని పేర్కొన్నారు. ఏడు నెలలుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న విద్యార్థులను, యువకులను, నిరుద్యోగులను, సోషల్ మీడియా కార్యకర్తలను ఎక్కడికక్కడ అణిచివేసేందుకు సర్కారు పోలీసులను విస్తృతంగా వినియోగిస్తోందన్నారు. నూతన చట్టాల నేపథ్యంలో ఈ పరిణామాలు మరింత దుర్మార్గమైన వాతావరణానికి దారితీస్తాయని చెప్పారు.

రుణమాఫీతో రైతులకు పెద్ద పండుగ

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



యాచారం: ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ రాష్ట్రంలో రైతులకు పెద్ద పండుగగా మారిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలో కిసాన్ సెల్ ఆధ్వర్యంలో సీఎంకు కృతజ్ఞత, అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంపత్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏకకాలంలో రుణమాఫీ అమలు కావడంతో కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని, రైతుల్లో అపోహలు సృష్టిస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నాయని మండిపడ్డారు. ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి మాట్లాడుతూ.. రైతును రాజుగా చూడడమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులకు రుణమాఫీ చేయగా, మళ్లీ ఇన్నాళ్లకు కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ఏక కాలంలో మాఫీ చేసిందని గుర్తు చేశారు. లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు, భూ చట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ సమస్యతో రాష్ట్రంలో రెండు లక్షలకుపైగా భూ సమస్యలు పుట్టుకొచ్చాయని చెప్పారు. అనంతరం రూ.లక్ష లోపు రుణమాఫీ అయిన రైతులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారుతో ఢీకొట్టి.. 4 కి.మీ.ఈడ్చుకెళ్లి..

- టోల్ గేట్ వద్ద వెలుగులోకి..
- సంగారెడ్డి జిల్లాలో అమానవీయ ఘటన


వెంకటేశం


బైక్‌ను ఢీకొట్టిన కారు

మునిపల్లి (అందోల్): బైక్‌పై వెళుతు న్న ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టాడు.. గాయపడిన వ్యక్తి కారు బంపర్‌లో ఇరు క్కుపోయినా పట్టించుకోలేదు. నాలుగు కిలోమీటర్లు అలాగే ఈడ్చుకెళ్లడంతో ఆ వ్యక్తి చనిపోయాడు. ఈ అమానవీయ ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. బుదేరా ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్ల కానపురం తండాకు చెందిన మెగావత్ వెంకటేశం (22) హైదరాబాద్ మియాపూర్‌లో ఉంటూ ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. జహీరాబాద్ లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి బైక్‌పై మియాపూర్‌కు పయనయ్యాడు. హైదరాబాద్‌కు చెందిన రాజ్‌కుమార్ కర్ణాటకలోని గానుగాపూర్ దైవదర్శనానికి వెళ్లి కారులో తిరిగి వస్తూ.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పరిధిలో ముంబై జాతీయ రహదారిపై వెంకటేశాన్ని వేగంగా ఢీకొట్టాడు. దీంతో బైక్ పక్కకు పడిపోగా వెంకటేశం కారు బంపర్‌లో చిక్కుకున్నాడు. ఈ విషయం తెలిసినా కూడా రాజ్‌కుమార్.. కారుతో అలాగే నాలుగు కిలోమీటర్లు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో లింగంపల్లి టోల్‌గేట్ వద్ద ఆగిన కారు.. మృతదేహం ఇరుక్కుపోవడం వల్ల ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో టోల్‌గేట్ సిబ్బంది వచ్చి చూడగా.. మృతదేహం ఉన్న సంగతి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వెంకటేశాన్ని సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు చెప్పారు.

ఛిద్రమైన శరీరం..

కారులో ఇరుక్కున్న వెంకటేశం మృతదేహం పూర్తిగా ఛిద్రమైంది. వీపుభాగం మొత్తం కాలిపోయింది. కాళ్లు విరిగిపోయాయి. తలకు తీవ్ర గాయం కావడంతో రక్తస్రావమైంది. చేతులు నెంబర్ ప్లేట్‌లో, కొన్ని శరీర భాగాలు పొగగొట్టంలో ఇరుక్కుపోయాయి. రోడ్డు ప్రమాదం జరగడంతో భయపడి తాను కారు ఆపకుండా వచ్చానని రాజ్‌కుమార్ అంగీకరించినట్టు బుదేరా ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు.

గంజాయి.. ఆపై మద్యం మత్తు

ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన వ్యక్తి

- ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు
- డీఎస్సీ పరీక్ష రాసేందుకు హైదరాబాద్ వెళ్తుండగా ఘటన


ప్రమాదానికి కారణమైన కారు. (ఇన్‌సెట్‌లో) యాకయ్య

ఖమ్మంక్రైం: గంజాయి మత్తు.. ఆపై మద్యం తాగాడు. ఏం చేస్తున్నాడో, ఎలా వెళ్తున్నాడో తెలియని స్థితిలో ఉన్న వ్యక్తి అతివేగంగా కారు నడిపి ఒకరి మృతికి కారణమయ్యాడు. ఖమ్మంలో సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లికి చెందిన జాతంగి యాకయ్య (39) మరిపెడ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. డీఎస్సీ పరీక్షకు సిద్ధమైన ఆయన భార్య గౌతమి హైదరాబాద్‌లో సోమవారం పరీక్ష రాయాల్సి ఉంది. దీంతో ఆదివారమే మరిపెడ నుంచి ఖమ్మంలోని గౌతమి తల్లిదండ్రుల వద్దకు వచ్చిన యాకయ్య దంపతులు అక్కడ పిల్లలను వదిలి సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు హైదరాబాద్ బయలుదేరారు. వీరిద్దరూ బైక్‌పై ఖమ్మం కొత్త బస్టాండ్‌కు వెళ్తుండగా ముస్తఫా నగర్ సమీపాన గంజాయి, మద్యం సేవించి మత్తులో ఉన్న సిరిగిరి సమ్మయ్య అనే వ్యక్తి తన కారుతో వేగంగా వచ్చి ఈ దంపతులను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో యాకయ్య అక్కడికక్కడే మృతి చెందగా గౌతమికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, ఈ ఘటనలో యాకయ్యను ఢీకొట్టిన కారు ఆయనను కొన్ని మీటర్ల మేర ఈడ్చు కుంటూ వెళ్లగా ఓ స్తంభా న్ని ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో యాకయ్య ప్రమాద స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు గౌతమిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. యాకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన సమ్మయ్యను అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

మొద్దు నిద్ర ప్రభుత్వం.. తట్టినా లేవట్లేదు

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- రాష్ట్రంలో రోజువారీ సమస్యలు కూడా తీరడం లేదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తీవ్రమైన సమస్యలున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, బీఆర్‌ఎస్ పార్టీ.. ఈ సర్కారును తట్టి లేపినా నిద్ర లేవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు ఉన్నా కనీసం రోజువారీ సమస్యలను కూడా రేవంత్ ప్రభుత్వం పరిష్కరించడం లేదని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఒక్కటి కూడా ముందడుగు వేయడం లేదని విమర్శించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోయాయని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన బీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియా తో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ ఏడాది మార్చికి ముందే పంచాయతీలకు రూ.500 కోట్లు విడుదలైనా కార్మికులకు కనీసం జీతాలు అందడం లేదన్నారు. పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం మరో రూ.750 కోట్ల నిధుల విడుదలను నిలిపివేసిందని వెల్లడించారు. ఆసరా పింఛన్లు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి వేతనాల చెల్లింపులో కూడా తాను ప్రశ్నించిన తర్వాతే కొంత చలనం వచ్చిందన్నారు. రైతు రుణమాఫీకి రేషన్ కార్డు లింక్ లేదని సీఎం రేవంత్ చెప్పినా అమలు కావడం లేదని హరీశ్‌రావు అన్నారు. రూ.లక్ష లోపు రుణమాఫీకి అర్హులైన వారిలో 30 నుంచి 40 శాతం మందికి లబ్ధి జరగలేదని తమ అధ్యయనంలో వెల్లడైందన్నారు. ప్రభుత్వ బదిలీల్లో పారదర్శకత లేక అన్ని వర్గాలు రోడ్డెక్కుతున్నాయని అన్నారు.

నిలిచిన వస్త్రోత్పత్తి

- సిరిసిల్లలో రోడ్డెక్కిన నేతన్నలు
- ఉపాధి కల్పించాలని రిలేదీక్షలు
- 25న చలో అసెంబ్లీ


సిరిసిల్లలో దీక్ష చేస్తున్న వస్త్రపరిశ్రమ ప్రతినిధులు

సిరిసిల్ల: సిరిసిల్లలో వస్త్రోత్పత్తి సోమవారం నిలిచిపోయింది. ఆర్డర్లు లేక.. బతుకమ్మ చీరల బకాయిలు రాక.. మార్కెట్‌లో బట్టకు గిరాకీ లేదు. దీనికితోడు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 20 ఏళ్లుగా అమలైన 50 శాతం విద్యుత్ రాయితీని పది హెచ్‌పీల మోటార్లకే పరిమితం చేయడంతో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లింది. 'మగ్గం నడవాలి.. నేతన్నలు బతకాలి' నినాదంతో 16 అనుబంధ రంగాల సంఘాలు తొలిసారి ఏకమై రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సాంచాలపై వస్త్రోత్పత్తిని నిలిపివేసి ఆందోళన బాట పట్టారు. మంగళవారం రాస్తారోకో, బుధవారం సిరిసిల్ల బంద్, ఈనెల 25న చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి ఉద్యమ కార్యాచరణను జేఏసీ ప్రకటించింది.


వాటర్, ఆపిల్ అమ్ముకుంటున్న రమేశ్

రోడ్డున్నపడ్డ నేతన్న

రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ముందు వాటర్ బాటిళ్లు, యాపిల్‌పండ్లు అమ్ముతున్న ఈ వ్యక్తి పేరు మహేశుని రమేశ్(50). జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌లో చాప అశోక్ అనే వ్యక్తి వద్ద సాంచాలు నడుపుతూ వారానికి రూ.వెయ్యి నుంచి రూ.1500 సంపాదించేవాడు. సాంచాలకు 50 శాతం విద్యుత్ రాయితీ తొలగించడంతో ఆ కార్ఖానా మూతపడి రమేశ్‌కు పని లేకుండా పోయింది. కూటికోసం ఇలా నీళ్ల సీసాలు, యాపిల్‌పండ్లు విక్రయిస్తున్నాడు. 'పొట్ట కోసం పోగుల పని నేర్చుకుంటే.. సాంచాలు బందుపడి ఇలా నా బతుకు రోడ్డున పడింది.. అని రమేశ్ వాపోయాడు.

అడ్వాంటేజ్ హారిస్



- డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందంజ!
- ఆమెకే జై కొడుతున్న సొంత పార్టీ ప్రత్యర్థులు

వాషింగ్టన్: జో బైడెన్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా వైదొలగడంతో భారతీయ అమెరికన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు అవకాశాలు మెరుగయ్యాయి. అధ్యక్ష అభ్యర్థిగా కమలకు బైడెన్ మద్దతు ప్రకటించారు. ఇది ఆమెను అధ్యక్ష టికెట్ రేసులో ముందు వరుసలో నిలుపుతుంది. అయితే బైడెన్ మద్దతిచ్చినంత మాత్రాన ఆటోమేటిగ్గా కమల డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి అవ్వలేరు. డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో డెలిగేట్ల మద్దతును సంపాదించాల్సి ఉంటుంది. డేలిగేట్ల ఓటింగ్‌లో ఎవరైతే మెజారిటీ సాధిస్తారో వారే డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి అవుతారు. డెమొక్రాటిక్ పార్టీ టికెట్ కోసం కమలకు గట్టి పోటీదారులుగా మారతారని భావించిన పలు రాష్ట్రాల గవర్నర్లు తమ మద్దతు ఉపాధ్యక్షురాలికేనని బాహటంగా ప్రకటిస్తున్నారు. ప్రస్తుతానికైతే అధికారికంగా కమల ఒక్కరే రేసులో ఉన్నారు. బైడెన్ విరమణ ప్రకటన అనంతరం కమల తక్షణం రంగంలోకి దిగారు. పార్టీలోని సహచరులకు ఆదివారమే 100 పైగా ఫోన్‌కాల్స్ చేసి మద్దతు కూడ గట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు భారతీయ అమెరికన్, ఆఫ్రికన్ అమెరికన్ చట్టసభ సభ్యులు, బైడెన్ అనుచరులు కమలకు మద్దతుగా ముమ్మర లాబీయింగ్ మొదలుపెట్టారు. వివిధ రంగాల్లోని మహిళలు కూడా ఆమెకు బాసటగా నిలుస్తున్నారు. బైడెన్ ప్రచార బృందం కూడా సోషల్ మీడియాలో తమ అకౌంట్ల పేర్లను హారిస్ పేరు మీదకు మార్చేసింది. ప్రచార టీమ్‌లోని 1,000 మంది ఉద్యోగులు తక్షణం ఆమె తరఫున పనిచేయనున్నారు.

పెలోసి, క్లింటన్‌ల మద్దతు

ప్రతినిధుల సభ మాజీ స్పీకర్, డెమొక్రాటిక్ పార్టీలో కీలక నాయకురాలు నాన్సీ పెలోసి కూడా సోమవారం హారిస్‌కు మద్దతు ప్రకటించారు. శ్రామికవర్గ కుటుంబాల కోసం శ్రమించే, సునిశిత మేధోశక్తి గల రాజకీయ నాయకురాలిగా కమలను అభివర్ణించారు. బైడెన్‌ను వైదొలిగేలా ఒప్పించడంలో పెలోసిది కీలక పాత్ర. డజన్ల కొద్ది ప్రతినిధుల సభ సభ్యులు, సెనేటర్లు కూడా కమలకు మద్దతు తెలిపారు. గట్టి పోటీదారులైన పెన్సిల్వేనియా గవర్నర్ జోస్ షాపిరో, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఆదివారమే ఆమెకు మద్దతు ప్రకటించేశారు. అమెరికాలోనే అత్యంత ధనవంతుడైన రాజకీయ నాయకుడు, హయత్ హోటల్ గ్రూపు వారసుడు, ఇల్లినాయీ గవర్నర్ జె.బి.ప్రిట్జ్‌కర్, రెండుసార్లు కెంటకీ గవర్నర్ అండీ బెషియర్ అభ్యర్థిత్వ రేసులో ఉంటారని భావించినా సోమవారం వారిద్దరూ కమలకే జైకొట్టారు. మిషిగన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్ కూడా ఇదే బాటలో నడిచారు. మేరీలాండ్ గవర్నర్ వెస్ మూర్ కూడా కమలకే మద్దతు ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్‌ల మద్దతు కూడా లభించింది. కమలకు ఉదారంగా విరాళాలివ్వాలని హిల్లరీ సోమవారం పిలుపిచ్చారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆమోద ముద్ర కూడి పడితే ఆమెకు తిరుగు ఉండదు. కమల ప్రత్యర్థులుగా ప్రస్తుతానికి రాయ్ కూపర్ (67), అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ పేర్లు వినిపిస్తున్నాయి.

ప్రధాని గొంతే నొక్కజూస్తారా!

విపక్షాలపై మోదీ ధ్వజం ● ప్రతికూల రాజకీయాలంటూ విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: విపక్షాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతికూల రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అందుకు పార్లమెంటును కూడా దుర్వినియోగం చేసే ప్రయత్నంలో పడ్డాయని మండిపడ్డారు. ఆ క్రమంలో ప్రధానమంత్రి గొంతునే నొక్కే పోకడలకు పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌పై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక రాజకీయాలను పక్కన పెట్టి వచ్చే ఐదేళ్లలో దేశాభివృద్ధి కోసం పార్టీలన్నీ ఒక్కతాటిపైకి రావాలి'' అని పిలుపునిచ్చారు. ''పార్లమెంటు ఉన్నది ఏదో ఒక్క పార్టీ కోసం కాదు. మొత్తం దేశం కోసం'' అంటూ విపక్షాలను ఉద్దేశించి హితవు పలికారు. ''మళ్లీ 2029 జనవరిలో మరోసారి లోక్‌సభ ఎన్నికల క్షేత్రంలోకి దిగండి. కావలిస్తే అందుకు పార్లమెంటును కూడా వాడుకోండి. అప్పటిదాకా ప్రజా సంక్షేమం కోసం పాటుపడదాం'' అని పిలుపునిచ్చారు.

విపక్షాల తీరు మారాలి

సభా కార్యకలాపాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న కొన్ని విపక్షాల తీరుతో ఆయా పార్టీల ఎంపీలకు పార్లమెంటులో మాట్లాడే అవకాశమే రాలేదని మోదీ అన్నారు. ''ఇది విచారకరం. అన్ని పార్టీలు సభ్యులందరికీ, ముఖ్యంగా తొలిసారి ఎన్నికైన వారికి మాట్లాడే అవకాశమివ్వాలి. తొలి సమావేశాలకు విపక్షాలు అంతరాయం కలిగించాయి. దాంతో 140 కోట్ల భారతీయుల ఆదేశంతో ఎన్నికైన ప్రభుత్వ స్వరం పదేపదే మూగబోయింది. ఇవి ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. నిజానికి ప్రతికూల రాజకీయాలకు మన పార్లమెంటరీ వ్యవస్థలో ఎప్పుడూ స్థానం లేదు'' అన్నారు.

ఇది అమృతకాల బడ్జెట్

"మేం ప్రవేశపెట్టబోతోంది అమృతకాల బడ్జెట్. వచ్చే ఐదేళ్లకే గాక 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాకారం చేసుకునే కలకు పునాది."

బడ్జెట్ మథనంలో అమృతం చిలికేనా!

నేడే కేంద్ర బడ్జెట్

రికార్డు స్థాయిలో వరుసగా ఏడోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల

సంక్షేమనాదమా, అభివృద్ధి నినాదమా?

వేతనజీవికి ఈసారైనా 'ఐటీ' ఉపశమనం దక్కేనా?

ఈవీ, ఫార్మా, రియల్టీ తదితర రంగాల్లో ఎన్నో ఆశలు

అమృతకాల బడ్జెట్‌గా మోదీ అభివర్ణిస్తున్న కేంద్ర బడ్జెట్-2024 అన్ని వర్గాల ఆశలపైనా నిజంగానే అమృతం చిలికిస్తుందా? పన్ను వాతలు, ఎడాపెడా కోతలతో ఖేదమే మిగులుస్తుందా? 2047కల్లా వికసిత భారత లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశగా పడుతున్న బలమైన పునాదిగా ప్రధాని చెప్పుకున్న ఈ బడ్జెట్లో మధ్య తరగతిని ఎంతో కొంత మురిపిస్తారా? ముఖ్యంగా ఐటీ మినహాయింపులు పెంచి వేతన జీవులకు కాస్తయినా ఉపశమనం కలిగిస్తారా? కేవలం ప్రగతి పరుగులకే మరింత ఊపునిస్తారా? ఈ ప్రశ్నలన్నింటికీ మరికొద్ది గంటల్లో జవాబులు లభించనున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్‌ను విత్త మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గత ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం తెలిసిందే. కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలకు ఇది రికార్డు స్థాయిలో వరుసగా ఏడో బడ్జెట్ కావడం విశేషం. మోదీ 3.0 సర్కారు తొలి బడ్జెట్ నుంచి ఏ రంగాలు ఏం ఆశిస్తున్నాయంటే... - సాక్షి, నేషనల్ డెస్క్



ఐటీ ఊరట.. ఈసారైనా...!

ఆదాయ పన్ను చెల్లించే మధ్య తరగతి, వేతన జీవులు ఈ బడ్జెట్లోనన్నా ఎంతో కొంత ఊరట దక్కుతుందని ఆశిస్తున్నారు. ఐటీ శ్లాబులను సవరించాలన్నది వారి ప్రధాన డిమాండ్. ఓటాన్ అకౌంట్లో నిర్మల దీని జోలికి పోలేదు. నూతన పన్ను విధానంలో పన్ను మినహాయింపును ప్రస్తుత రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో పాటు పాత విధానంలో మినహాయింపులను కూడా పెంచుతారని అంచనాలున్నాయి. తద్వారా వేతన జీవుల చేతిలో మరిన్ని డబ్బులు ఆడతాయని, వారి కొనుగోలు సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థ మరింతగా కళకళలాడుతుందని నిపుణులు చెబుతున్నారు. చాలామంది పాత పన్ను విధానానికే మొగ్గుతున్నందున వారిని కొత్త విధానానికి మారేలా ప్రోత్సహించేందుకు మరిన్ని పన్ను మినహాయింపులకు చోటు దక్కవచ్చని అంచనా. 80సీ కింద మినహాయింపు మొత్తం రూ.1.5 లక్షలను 2014 నుంచీ పెంచలేదు. ఈపీఎఫ్, పీపీఎఫ్, ఇంటి రుణాలు, జీవిత బీమా, ఈక్విటీ ఆధారిత సేవింగ్ పథకాల వంటివన్నీ దీని పరిధిలోకే వస్తాయి. 80సీ తో పాటు స్టాండర్డ్ డిడక్షన్ పరిధిని కూడా పెంచాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో ఉంది. అది నెరవేరితే రియల్టీ పరిశ్రమకు కూడా మరింత ఊపు వస్తుంది.

రియల్టీ

డేటా సెంటర్లతో పాటు రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు (ఆర్‌ఈఐటీ)లకు పలు తాయిలాలు ప్రకటించవచ్చని భావిస్తున్నారు. ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడమే గాక ఉద్యోగావకాశాల సృష్టికి ఇదెంతో దోహదపడుతుందన్నది రియల్టీ పరిశ్రమ ముఖ్యుల అభిప్రాయం. రియల్టర్లకు నగదు అందుబాటును పెంచేందుకు ఆర్‌ఈఐటీలను ఈక్విటీ ఇన్‌స్ట్రుమెంట్లుగా పరిగణించే అవకాశం ఉందంటున్నారు. ఈ రంగానికి జీఎస్టీ చట్టం కింద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను అనుమతించాలన్న ఆర్‌ఈఐటీ సంఘం డిమాండ్ ఏ మేరకు నెరవేరుతుందన్నదీ ఆసక్తికరమే.

ఈవీలపై ఏం చేస్తారో...

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) జోరు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశ్రమకు మరింతగా ప్రోత్సాహకాలను అందించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈవీలకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం తెస్తే బాగుంటుందన్న అభిప్రాయముంది. అన్నిరకాల ఈవీ వాహనాల తయారీ పూర్తిగా భారత్‌లోనే జరిగేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే ఆటో విడి భాగాలన్నింటిపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో పాటు పలు రకాలైన మినహాయింపులను ఆశిస్తున్నాయి. ఈవీ రంగంలో స్టార్టప్‌లకు దన్నుగా నిలిచే దిశగా చర్యలు ఉండవచ్చంటున్నారు. తుక్కు విధానాన్ని కూడా మరింతగా సరళీకరిస్తారేమో చూడాల్సి ఉంది.

ఫార్మా

కరోనా అనంతర పరిస్థితుల నేపథ్యంలో మరింత కీలకంగా మారిన ఫార్మా రంగానికి పలు ప్రోత్సాహకాలు నిర్మల బడ్జెట్లో చోటుచేసుకునే అవకాశముంది. ముఖ్యంగా పరిశోధన, ఇన్నొవేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించే చర్యలు ఉండవచ్చంటున్నారు. ఇప్పటికీ సంక్లిష్టంగానే ఉన్న పలురకాల అనుమతుల ప్రక్రియలను మరింత సరళతరం చేయవచ్చని చెబుతున్నారు. కీలకమైన ఔషధాల తయారీ తదితరాలకు ఆర్థిక ప్రోత్సాహకాలకు సంబంధించిన ప్రకటనపై కూడా ఫార్మా దిగ్గజాలు ఆశలు పెట్టుకున్నాయి.

'స్వదేశీ' రక్షణ!

అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, చైనా దూకుడు తదితర నేపథ్యంలో రక్షణ రంగానికి కేటాయింపులను ఈసారి కూడా ఇతోధికంగా పెంచడం ఖాయంగా కన్పిస్తోంది. అదే సమయంలో రక్షణ సంబంధిత ఉత్పత్తి, మౌలిక సదుపాయాల పరిశ్రమల్లో 'ఆత్మ నిర్భరత'కు మరింత పెద్దపీట వేసేలా మరిన్ని చర్యలు ఉండనున్నాయి. ఇది ఆర్థిక రంగానికి మరింత ఊపునివ్వడమే గాక అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, అంతిమంగా ప్రజల జీవన నాణ్యతనూ పెంచుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరొచ్చు

1966 నాటి నిషేధాన్ని ఎత్తివేసిన కేంద్రం

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులు హిందుత్వ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)లో చేరడంపై 1966 నుంచి కొనసాగుతున్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నెల 9వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు తాజాగా బయటకు వచ్చాయి. దీనిపై ప్రతిపక్షాలు మండిపడగా.. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ స్వాగతించాయి. గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసమే నిషేధం అమలు చేశాయని పేర్కొన్న ఆర్‌ఎస్‌ఎస్..నిషేధం ఎత్తివేతతో దేశంలో ప్రజాస్వామ్య విధానం మరింత బలోపేతమవుతుందని పేర్కొంది. కేంద్రం సరైన సమయంలో ఈ నిర్ణయం తీసుకుందని ప్రశంసించింది. బీజేపీ నేత, కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ రాజకీయాల కారణాలతోనే 1966లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయవాద సంస్థ అనీ, దాని సభ్యులు దేశభక్తులని కితాబునిచ్చారు. ప్రతిపక్షాలవి బుజ్జగింపు రాజకీయాలని, హిందూ వ్యతిరేక వైఖరి అని ఆరోపించారు.

ఉద్యోగులను విభజించే కుట్ర

ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఉద్యోగులను సిద్ధాంత ప్రాతిపదికన విభజించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా రాజ్యాంగ బద్ధ, స్వతంత్ర సంస్థలను ఆధీనంలోకి తెచ్చుకునేందుకు బీజేపీ చేస్తున్న కుట్రగా ఖర్గే అభివర్ణించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై నిక్కర్లతో కనిపిస్తారంటూ, ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫాంను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వాన్ని మంచి చేసుకునేందుకే మోదీ ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిందని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి విమర్శించారు.

బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేం: కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: బిహార్‌కు ప్రత్యేక హోదా కుదరదని, ఆ అర్హత రాష్ట్రానికి లేదని కేంద్రం సోమవారం లోక్‌సభలో తెలిపింది. కొండ ప్రాంతాలు, కఠినతరమైన రవాణా సదుపాయాలు, అతితక్కువ జనసాంద్రత, జనాభాలో గిరిజనుల శాతం ఎక్కువగా ఉండటం, ఇతర దేశాలతో వ్యూహాత్మక సరిహద్దులను పంచుకోవడం, ఆర్థిక వెనుకబాటు, మౌలిక సదుపాయాల లేమి, ఆర్థిక నిర్వలత.. తదితర పరామితులను ప్రత్యేక హోదాకు ప్రామాణికంగా తీసుకుంటారని, ఇవేవీ బిహార్‌కు వర్తించవు కాబట్టి హోదా ఇవ్వడం సాధ్యం కాదని ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపారు.

రెండిట్లో 'సరైన' సమాధానం ఏమిటి?

- ఇందుకోసం ముగ్గురు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయండి
- మంగళవారం మధ్యాహ్నంకల్లా నివేదించండి
- నీట్ ప్రశ్నపై ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్యవిద్యలో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్-యూజీ, 2024 పరీక్షలో పేపర్ లీకేజీ ఉదంతంపై పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టులో సోమవారం ఒక ప్రశ్నపై తీవ్రమైన చర్చ జరిగింది. ఒక ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, వీటిల్లో ఒకటి ఎంచుకున్న అభ్యర్థులకు మార్కులేసి రెండోది ఎంచుకున్న అభ్యర్థులకు మార్కులు వేయలేదని దీనిపై తేల్చాలని కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారించింది. రెండింటిలో సరైన సమాధానం ఏది? అనే దానిపై స్పష్టత వస్తే అభ్యర్థుల తుది జాబితా మెరిట్ లిస్ట్‌లో మార్పులు చేసుకునే అవకాశం ఉంది. ఈ అంశంపై తొలుత పిటిషన్ల తరఫు న్యాయవాది వాదించారు. ''ఈ ప్రశ్నకు సమాధానం రాసేందుకు ప్రయత్నించిన అభ్యర్థుల్ని మూడురకాలుగా విడగొట్టాలి. ఎందుకంటే రెండు 'సరైన' సమాధానాల్లో ఒకదానికి ఎంచుకున్న వాళ్లకు నెగిటివ్ మార్కింగ్ కారణంగా ఐదు మార్కులు పోయాయి. రెండో సమాధానం ఎంచుకున్న వాళ్లకు నాలుగు మార్కులు పడ్డాయి. రెండింటిలో ఏది కరెక్టో తేల్చుకోలేక, నెగిటివ్ మార్కింగ్ వల్ల మార్కులు పోతాయన్న భయంతో సమాధానం రాయకుండా వదిలేసిన వాళ్లూ ఉన్నారు'' అని న్యాయవాది వివరించారు. దీంతో ధర్మాసనం స్పందించింది. ''ఫిజిక్స్ విభాగంలో అణువుకు సంబంధించిన ప్రశ్నలో నాలుగు ఆప్షన్లలో రెండు సరైన సమాధానాలు ఉన్నాయన్న వాదనల నడుమ అసలైన సమాధానాన్ని తేల్చాల్సిన సమయమొచ్చింది. అందుకోసం ముగ్గురు విషయ నిపుణులతో కూడిన బృందాన్ని ఏర్పాటుచేయండి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలలోపు మాకు సరైన సమాధానమేంటో నివేదించండి'' అని ఢిల్లీ ఐఐటీ డైరెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలు ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు చేరేలా చూడాలని సుప్రీంకోర్టులో సెక్రటరీ జనరల్‌కు ధర్మాసనం సూచించింది. 'పరీక్ష నిర్వహణలో లోపాలు చూస్తుంటే ఇది వ్యవస్థాగత వైఫల్యమని తెలుస్తోంది. గుజరాత్‌లో ఒక విద్యార్థి 12వ తరగతిలో ఫెయిల్ అయ్యాడుగానీ నీట్ పరీక్షలో చాలా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాడు. కొన్ని కేంద్రాల్లో అడ్రస్ వెరిఫికేషన్ చేయలేదు. మరి కొన్నింటిలో సీసీటీవీ కెమెరాలే లేవు' అని లాయర్ నరేందర్ హూడా వాదించారు.

కొలిక్కి వస్తున్న నీట్-యూజీ వివాదం!

నీట్ యూజీ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని దాదాపు 40 పిటిషన్లు దాఖలైన విషయం తెల్సిందే. పరీక్ష రద్దు చేయాలంటూ, రద్దు చేయొద్దంటూ దాఖలు చేసిన వారి వాదనలు సుప్రీంకోర్టులో పూర్తయ్యాయి. ఇక కేంద్రం తరఫు వాదనలు మిగిలి ఉన్నాయి. మంగళవారం కేంద్రం వాదనలు పూర్తయితే త్వరగా తీర్పు వెలువరించే అవకాశాలున్నాయి.

ఆహార బోర్డులు ప్రదర్శిస్తే చాలు

దుకాణాల యజమానుల పేర్లు అక్కర్లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ/భోపాల్: ఉత్తరాదిన వివాదం రేపుతున్న కావడి యాత్ర వివాదానికి తెర దించే దిశగా సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. భక్తులు వెళ్లే మార్గాల్లో దుకాణాలు, హోటళ్ల ముందు యజమానులు, సిబ్బంది పేర్లతో బోర్డులు ప్రదర్శించాలన్న యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై స్టే విధిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. బదులుగా లభించేది శాకాహారమో, మాంసాహారమో తెలిపే బోర్డులు ప్రదర్శిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. శ్రావణమాసంలో గంగాజలాన్ని కావడిలో సేకరించి భక్తులు తిరిగి తమ సొంతూరిలోని శివాలయాల్లో జలాభిషేకం చేస్తారు. పుణ్యజలాలను తీసుకెళ్లే భక్తులకు శాకాహారం అందించే హోటళ్ల వివరాలు తెలియాలంటూ ఆయా రాష్ట్రాలు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. తాను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ముస్లింలు నడిపే శాకాహార భోజనంలోనే తినేవాడినని జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ఈ సందర్భంగా చెప్పారు. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల తరఫున ఎవరూ హాజరు కాకపోవడంతో విచారణను శుక్రవారానికి ధర్మాసనం వాయిదా వేసింది.

చేయని తప్పుకు 43 ఏళ్లు కారాగారంలోనే


- 63 ఏళ్ల వయసులో ఎట్టకేలకు విడుదలైన అమాయకురాలు
- అమెరికాలో ఘటన



వాషింగ్టన్: చేయని నేరానికి 43 ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవించిన అమాయకురాలికి ఎట్టకేలకు విముక్తి లభించింది. అమెరికాలోని ఒహాయోకు చెందిన 63 ఏళ్ల సాండ్రా హెమ్మీ కథ ఇది. మిస్సోరీలో 1980లో ఓ లైబ్రరీ వర్కర్‌ను కత్తితో పొడిచి చంపిందని సాండ్రాను అరెస్ట్ చేశారు. లాయర్‌తో వాదించుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. మానసిక చికిత్సకు అధిక మోతాదులో తీసుకున్న ఔషధాల మత్తులో ఆమె చెప్పిన నేరాంగీకార వాంగ్మూలాన్నే పోలీసులు కోర్టుకు సమర్పించారు. దాంతో ఆమెకు జీవితఖైదు విధించారు. కానీ అసలు హంతకుడు మైఖేల్ హోల్మ్యాన్ అనే పోలీసు అధికారి. ఈ విషయాన్ని సాండ్రా లాయర్లు ఆధారసహితంగా తాజాగా కోర్టులో నిరూపించారు. దాంతో ఆమె శుక్రవారం విడుదలయ్యారు. కూతురు, మనవరాలిని హత్తుకుని బోరున విలపించారు. అమెరికా చరిత్రలో చేయని నేరానికి అత్యంత ఎక్కువ కాలం శిక్ష అనుభవించిన మహిళగా సాండ్రా పేరు నిలిచిపోనుంది.

ధనికులైతే చాలు పరీక్ష విధానాన్నే కొనేయొచ్చు

నీట్ వివాదంపై లోక్‌సభలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ధనికులైతే చాలు పరీక్షా విధానాన్నే కొనేయొచ్చంటూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్ వేదికగా విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రభుత్వం తీవ్ర విమర్శలుచేశారు. గత ఏడేళ్లలో ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్లు ఆధారాలు లేవంటూ లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పడంతో ప్రశ్నోత్తరాల సందర్భంగా రాహుల్ మాట్లాడారు. '' నీట్ పేపర్ లీకేజీ ఉదంతంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వీయతప్పిదాన్ని ఒప్పుకోవట్లేదు. ప్రతి ఒక్కరిపై నిందలేస్తూ తప్పుబడుతున్నారు. అసలు ఇక్కడ ఏం జరుగుతుందనే కనీస అవగాహన కూడా ఆయనకు లేనట్లుంది. వరస లీకేజీలతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడిందని కోట్లాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. భారత్‌లో పరీక్షల నిర్వహణ అనేది ఒక మోసపూరిత వ్యవహారమని అభ్యర్థులు ఒక నిర్ణయానికొచ్చారు. ధనికులైతే చాలు పరీక్షావిధానాన్నే కొనేయొచ్చు అనే పరిస్థితి నెలకొంది. ఈ తప్పు వ్యవస్థీకృతంగా జరుగుతోంది. ఈ పరిస్థితిని రూపుమాపేందుకు మీ వంతుగా ఎలాంటి కృషిచేస్తున్నారు?' అని మంత్రిని రాహుల్ నిలదీశారు. దీంతో మంత్రి ప్రధాన్ మాట్లాడారు. '' మొత్తం పరీక్ష విధానమే నిష్ఫలం అన్నట్లుగా మాట్లాడటం దురదృష్టకరం. ఏడేళ్లలో 70 పేపర్లు లీక్ అయ్యాయని కాంగ్రెస్ సభ్యుడు మాణిక్కం ఠాకూర్ చెబుతున్నదంతా అబద్ధం. నిజానికి ఎన్‌టీఏను స్థాపించాక 240కిపైగా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాం. ఐదు కోట్ల మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకున్నారు. 4.5 కోట్ల మంది వివిధ పరీక్షలు రాశారు'' అని మంత్రి చెప్పారు. దీంతో ఠాకూర్ కలగజేసుకుని '' పేపర్ లీకేజీల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ఎలాంటి నిర్ణయాలు ఆచరణలో పెడుతున్నారో మంత్రి చెప్పాలి. లేదంటే రాజీనామా చేయాలి' అని అన్నారు. దీంతో మంత్రి స్పందించారు. '' ఇక్కడ మాలో ఏ ఒక్కరో జవాబుదారీ కాదు. ఏం జరిగినా ప్రభుత్వం మొత్తం జవాబుదారీగా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. ''పేపర్ లీకేజీల విషయంలో మోదీ సర్కార్ రికార్డ్ సృష్టించనుంది. ఒకే చోట రాసిన వారిలో ఎక్కువ మందికి అత్యధిక మార్కులు వచ్చిన పరీక్షకేంద్రాల జాబితాను విడుదలచేయాలి' అని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ డిమాండ్‌చేశారు. అనంతరం టీఎంసీ, డీఎంకే సహా విపక్ష సభ్యులంతా వాకౌట్ చేశారు.



'బ్రహ్మపుత్ర'లో భారీ అగ్ని ప్రమాదం

పూర్తిగా పక్కకు ఒరిగిపోయిన యుద్ధ నౌక

ముంబై/న్యూఢిల్లీ: ముంబై డాక్ యార్డులో మరమ్మతుల కోసం ఉన్న ఐఎన్ఎస్ బ్రహ్మపుత్ర నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనతో యుద్ధ నౌక పూర్తిగా ఒక పక్కకు ఒరిగిపోగా ఒక నావికుడు గల్లంతయ్యారని నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. ముంబై డాక్‌యార్డులో రీఫిట్ పనులు జరుగుతున్న మల్టీరోల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని నేవీ తెలిపింది. సోమవారం ఉదయం కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చామని వివరించింది. అయితే, మధ్యాహ్నం నుంచి యుద్ధ నౌక పక్కకు ఒరిగిపోవడం మొదలైందని, నిటారుగా సరైన స్థితిలో ఉంచేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని వివరించింది. ప్రస్తుతం బ్రహ్మపుత్ర పూర్తిగా పక్కకు ఒరిగి ఉందని తెలిపింది. ప్రమాదంపై విచారణ జరుగుతోందని, గల్లంతైన ఒక జూనియర్ నావికుడి కోసం గాలింపు చేపట్టామని తెలిపింది. దేశీయంగా మొదటిసారిగా రూపొందిన బ్రహ్మపుత్ర క్లాస్‌కు చెందిన గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ ఇది. 2000 ఏప్రిల్ నుంచి విధుల్లో ఉన్న ఈ షిప్‌పై 40 మంది అధికారులు, 330 మంది నావికులు విధుల్లో ఉంటారు.

జమ్మూలో నక్కిన 50 మంది ఉగ్రవాదులు



శ్రీనగర్: జమ్మూ ప్రాంతంలోని ఎత్తైన కొండ ప్రాంతాల్లో కనీసం 40 నుంచి 50 మంది పాకిస్తానీ ఉగ్రవాదులు నక్కి ఉంటారని ఆర్మీ వర్గాలు అనుమానిస్తున్నాయి. వీరి పనిపట్టేందుకు బలగాలు భారీ కూంబింగ్ చేపట్టాయని ఆర్మీ తెలిపింది. వీరు పాక్ నుంచి దొంగచాటుగా దేశంలోకి ప్రవేశించారని పేర్కొంది. వీరి వద్ద రాత్రి వేళ కూడా స్పష్టంగా చూడగలిగే పరికరాలను అమర్చిన అమెరికా తయారీ ఎం4 కార్బైన్ రైఫిళ్ల వంటి అత్యాధునిక మారణాయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కూడా చొచ్చుకుపోయి ధ్వంసం చేయగలిగిన చైనా తయారీ స్టీల్ కోటెడ్ బుల్లెట్లు ఉన్నాయని తెలిపింది. వారిని వేటాడేందుకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టామని వెల్లడించింది.

రోహిణి-560 రాకెట్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ఇస్రో శాస్త్రవేత్తలు సోమవారం శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి రోహిణి-560 సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. దేశీయంగా తాము అభివృద్ధి చేసిన ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీని ప్రయోగించడమే ప్రయోగం లక్ష్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ రెండు దశల ఉప కక్ష్య సౌండింగ్ రాకెట్‌కు రెండు వైపులా ప్రొపల్షన్ వ్యవస్థలు సాలిడ్ మోటార్లు ఉంటాయి. ఇప్పటి వరకు తాము ప్రయోగించిన అతి భారీ సౌండింగ్ రాకెట్ ఇదేనని అన్నారు. ప్రయోగం సందర్భంగా రాకెట్ పనితీరును పరిశీలించేందుకు పరిగణనలోకి తీసుకున్న 110 పరామితులను సాధించామన్నారు.



డేంజర్ జోన్‌గా ఐటీ కారిడార్

రోడ్డు ప్రమాదాల విషయంలో ఐటీ జోన్ డేంజర్ జోన్‌గా మారింది. రాజధానిలోని మూడు కమిషనరేట్లతో పోలిస్తే... ఇక్కడే అత్యధికంగా ప్రమాదాలు నమోదయ్యాయి. -8లో



హైడ్రాకు దీటుగా స్కాడా!

ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తీసుకురాబోతున్న 'హైడ్రాకు' దీటుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు 'స్కాడా'ను విస్తరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. -10లో

గరిష్టం/కనిష్టం
27.0/23.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంటుంది.

హెల్మెట్టే 'హెడ్'ని కాపాడింది!

అందరూ వినియోగించాలని ట్రాఫిక్ చీఫ్ విజ్ఞప్తి


ఆస్పత్రిలో స్రవంతి

సాక్షి, సిటీబ్యూరో: ఏటా లక్షల్లో చలాన్లు జారీ చేస్తున్నా...జరిమానాలు విధిస్తున్నా...అవగాహన కల్పిస్తున్నా..ఇప్పటికీ అనేక మంది ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్లు ధరించట్లేదు. అయితే ఈ శిరస్త్రాణం ఎంత కీలకమో, దాని వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో... వివరిస్తూ నగర ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ తమ హెడ్ కానిస్టేబుల్ ఉదంతమే తాజా ఉదాహరణగా చెప్పారు. ఈ మేరకు ఆయన విషయాన్ని సోమవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. నగర ట్రాఫిక్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న స్రవంతి ప్రస్తుతం బంజారాహిల్స్‌లో ఉన్న టీజీసీసీసీలోని ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం తన విధులకు హాజరుకావడం కోసం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం ప్రభావానికి రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోయాయి. ఉదయం 9.15 గంటల ప్రాంతంలో ఈమె నడుపుతున్న ద్విచక్ర వాహనం లక్డీకాపూల్ ప్రాంతంలో జారి పక్కకు పడింది. దీంతో స్రవంతి సైతం వాహనం పైనుంచి కుడి వైపునకు రోడ్డుపై పడ్డారు. ఆమె తల బలంగా రోడ్డును ఢీ కొన్నప్పటికీ..హెల్మెట్ ధరించిన కారణంగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆమె ధరించిన నాణ్యమైన హెల్మెట్టే తలకు, అంతర్గతంగా ఎలాంటి గాయాలు కాకుండా చేసిందని వివరించిన విశ్వప్రసాద్...కచ్చితంగా ద్విచక్ర వాహనచోదకులు బీఐఎస్ స్టాండర్డ్స్ ఉన్న హెల్మెట్, తేలిక పాటి వాహనాలు పడిపే వారు సీట్‌బెల్ట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం



చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు బంగారు బోనం సమర్పించనున్నారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈసారి నగరంలోని మహంకాళి దేవాలయాల అమ్మ వార్లకు బంగారు బోనాలు సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆరో బోనంగా..మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామని కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. పాతబస్తీ మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా చార్మినార్‌కు తరలి వెళ్తామన్నారు. జోగిని నిషా క్రాంతి బంగారు బోనమెత్తనున్నారన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

- కమ్యూనిటీ హాళ్లు ప్రజలకు ఉపయోగపడాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆమ్రపాలి ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దోమల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గంబూసియా, ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. వర్షాకాలంలో డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, డయేరియా, విషజ్వరాల లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకిన ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. ఆయా అనుబంధ శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పాట్ హోల్స్‌తో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే పూడ్చివేయాలని ఆదేశించారు. అన్నపూర్ణ భోజన కేంద్రాల వద్ద మెరుగైన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కమ్యూనిటీ భవనాల మరమ్మతులు, కనీస వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అవి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. సర్కిళ్ల వారీగా కమ్యూనిటీహాళ్ల వివరాలు సేకరించి, అవసర మైన మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. సినిమా హాల్స్, మాల్స్ వద్ద పార్కింగ్ ఫీజుల వసూళ్లపై తనిఖీలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

భారీ వృక్షం కూలి ఒకరి దుర్మరణం



చాంద్రాయణగుట్ట: రోడ్డుపై వెళుతున్న వాహనదారులపై భారీ వృక్షం కూలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెల్పిన వివరాల మేరకు..శాలిబండ పోలీస్ స్టేషన్ పరిధి శంషీర్‌గంజ్‌లోని జలమండలి కార్యాలయం పక్కన గోశాలకు వెళ్లే రూట్‌లో కొండ చింత (పెల్టోఫోరం)చెట్టు సోమవారం మధ్యాహ్నం 2.27 గంటల సమయంలో ఒక్కసారిగా వేర్లతో సహా కూలి రోడ్డుపై వెళుతున్న వాహనదారులపై పడింది. ఈ ఘటనలో యాక్టివాపై వెళుతున్న చందూలాల్ బారాదరి ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్ సాల్తె (65) తీవ్రంగా గాయపడగా..ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. జహనుమాకు చెందిన షేక్ అహ్మద్(43) తన తల్లిని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకెళుతుండగా వీరిపై కూడా చెట్టు పడింది. అహ్మద్ చాకచక్యంగా వ్యవహరించడంతో అతని తల్లికి స్వల్ప గాయాలవ్వగా, అతనికి కాలు విరిగింది. వీరితో పాటు అక్కడే తోపుడు బండిపై కూరగాయలు విక్రయిస్తున్న హుస్సేన్ కూడా స్వల్ప గాయాలకు గురయ్యాడు. మొత్తం ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. నాలుగు యాక్టివాలు, ఒక ఆటో ధ్వంసమైంది. సమాచారం అందుకున్న శాలిబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్, జీహెచ్‌ఎంసీ యూబీడీ అధికారులు, డీఆర్‌ఎఫ్, విద్యుత్ ఇబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఆ రూట్‌లో ట్రాఫిక్‌ను మళ్లించి చెట్టును పూర్తిగా కట్ చేసి కొమ్మలను తరలించారు. కాగా ఏకధాటిగా కురిసిన వర్షాల కారణంగానే చెట్టు కూలి ఉంటుందని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ తెలిపారు.









రంగ రంగ వైభవంగా..

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు సోమవారం వైభవంగా ముగిశాయి. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల్లో రెండవ ఘట్టమైన రంగంలో స్వర్ణలత అనే అవివాహిత భవిష్యవాణిని వినిపించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని, ప్రజలను బాగా చూసుకుంటానని, నన్ను నమ్ముకున్నవారిని కాపాడుతానని భవిష్యవాణిలో చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ పాల్గొన్నారు.

కలుషిత నీటికి చెక్!

క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగిన సిబ్బంది

- లైన్ల వారీగా సరఫరా అవుతున్న నీటిపై ఆరా
- ఒకే చోట ఉన్న డ్రైనేజీలు, వాటర్ పైప్‌లైన్లపై దృష్టి
- ఆధునిక యంత్రాలతో కలుషిత నీటి మూలాల గుర్తింపు
- సురక్షితమైన నీటి సరఫరా కోసం జలమండలి చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: వర్షాల నేపథ్యంలో కలుషిత నీరు సరఫరా కాకుండా నివారించేందుకు జలమండలి ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ పైప్‌లైన్ లీకేజీలను గుర్తించడంతో పాటు లైన్ల వారిగా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై ఆరా తీస్తోంది. ప్రధానంగా మురుగు నీటి,తాగునీటి పైప్‌లైన్లు దగ్గర దగ్గర ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించింది. మరోవైపు పైప్‌లైన్లలో కలుషిత నీటి మూలాలను గుర్తించే అధునిక సాంకేతిక పరిజ్ఞాన గల యంత్రాలను క్షేత్రస్థాయిలో నిమగ్నం


యంత్రం ద్వారా కలుషిత మూలాలు గుర్తిస్తున్న దృశ్యం (ఫైల్)

చేసింది. రోడ్డు, పైప్‌లైన్ తవ్వకుండానే నీటి కాలుష్య మూలాలు, లీకేజీలను త్వరగా గుర్తించి సరిచేసేందుకు ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ కెమెరాతో కూడిన అధునాతన 'క్విక్ ఇన్‌స్పెక్షన్ వాటర్ పొల్యూషన్ సిస్టం' యంత్రాన్ని వినియోగిస్తోంది. ఎప్పటికప్పుడు సమస్య పరిష్కరించే దిశగా అడుగులేస్తోంది.


మానిటర్‌లో కలుషిత మూలాలు (ఫైల్)

కెమెరా కన్ను ద్వారా..

ఆధునాత సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్య మూలాలు, లీకేజీలు త్వరగా గుర్తించడం సులభతరంగా తయారైంది. యంత్రం ద్వారా పైప్‌లైన్‌లో అంతర్గత స్థితి, విస్తరించిన కాలుష్యం వాటర్ లైన్‌బ్లాక్‌లు, పైప్‌లైన్ పగుళ్లు, నీటిలో మునిగిన వాల్వ్‌ల దృశ్యాలు ద్వారా గుర్తిస్తోంది. బ్యాటరీతో నడిచే ఈ యంత్రానికి 120 మీటర్ల పొడవైన పైపు ఉంటుంది. దానికి లైట్‌తో కూడిన ఒక కెమెరా, పైన మానిటర్ ఉంటుంది. ఈ యంత్రం పైపునకు ఉన్న కెమెరాను సంబంధిత వాటర్ పైపులైన్, మ్యాన్ హోల్‌లోకి పంపిస్తున్నారు. ఈ యంత్రాన్ని ఆపరేట్ చేసి సిబ్బందిపైన మానిటర్ ద్వారా పర్యవేక్షిస్తారు. వీడియో సైతం రికార్డు అవుతోంది. సమస్యను గర్తించి తక్షణమే చర్యలు చేపడుతున్నారు.

నీటి స్వచ్ఛతపై పరీక్షలు

నీటి సరఫరా సమయంలో నీటి స్వచ్ఛతను పరీక్షలు నిర్వహిస్తోంది.ప్రతి రోజు సుమారు 15 వేల నీటి శాంపిల్స్‌లు సేకరించి పరీక్షిస్తోంది. నీటిలో కోర్లినేషన్ హెచ్చుతగ్గులు నమోదైతే తక్షణమే సంబంధిత పైప్‌లైన్‌కు నీటి సరఫరా నిలిపివేసి చర్యలు చేపడుతోంది. వాస్తవంగా జలమండలి తాగునీటి సరఫరాలో మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియను అమలు చేస్తోంది. మొదటి దశలో నీటి శుద్ధి కేంద్రాల వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఐఎస్‌ఓ 10500 - 2012 ప్రకారం శాస్త్రీయంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నట్లు జలమండలి అధికారులు పేర్కొంటున్నారు.

అంతా అక్రమమే..

ఎమ్మార్పీఎస్ నేతను నిర్బంధించిన ఫామ్ హౌస్ కూల్చివేత

- బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టిన మున్సిపల్ అధికారులు
- ఫాంహౌస్ నిర్మాణం అక్రమ నిర్మాణమేనని స్పష్టం చేసిన అధికారులు
- 8 బోన్లలో..14 కుక్కల గుర్తింపు
- బాతులు, కోళ్లు కూడా


ఫాంహౌస్‌లోని కుక్కల బోన్లు..

శంషాబాద్: ఇటీవల సంచలనం రేపిన ఎమ్మార్పీఎస్ నేతలు నరేందర్, ప్రవీణ్‌లను కిడ్నాప్ చేసి బంధించిన ఫాంహౌస్‌ను సోమవారం పోలీసుల బందోబస్తు మధ్య శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు నేలమట్టం చేశారు. పట్టణంలోని 103 సర్వే నంబరులో ధర్మగిరి ఆలయానికి సమీపంలో కిడ్నాపర్లు సుమారు వెయ్యి గజాల స్థలంలో ఈ ఫాంహౌస్‌ను నిర్మించినట్లు గుర్తించారు. రెండు మూడేళ్ల క్రితంఎలాంటి అనుమతులు లేకుండా రెండు రేకుల షెడ్‌లతో పాటు ప్రహరీ, కుక్కలను ఉంచేందుకు ప్రత్యేకంగా ఎనిమిది బోన్లను ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో బాతులు, కోళ్లను కూడా పెంచుతున్నారు. కిడ్నాప్ సంఘటనతో పాటు అప్రత్తమైన పోలీసులు ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న గుర్తించిన మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. అక్రమ నిర్మాణంగా తేలితే కూల్చివేయాలని సూచించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషన్ బి.సుమన్‌రావు ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటీవల ఫాంహౌస్‌కు నోటీసులు అంటించారు. సోమవారం మూడు జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. కుక్కలతో పాటు, కోళ్లు, బాతులను తీసుకెళ్లేందుకు పశుసంవర్ధక శాఖతో పాటు బ్లూక్రాస్‌కు సమాచారం అందించారు. అప్పటి వరకు కుక్కలకు సంబంధించిన బోన్ల కూల్చివేతను నిలిపివేశారు. ఫాంహౌస్ పూర్తిగా అక్రమ నిర్మాణమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే కూల్చివేతల సమయంలో దానికి సంబంధించిన వ్యక్తులు ఎవరూ అక్కడికి రాలేదు. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం..

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. భూ కబ్జాదారులు ఇబ్బంది పెడితే పోలీసులను సంప్రదించాలన్నారు.



ఫాంహౌస్‌లో కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

గీజర్.. ప్రాణాలకు డేంజర్!

- గ్యాస్ గీజర్ నుంచి కార్బన్ మోనాక్సైడ్ విడుదలయ్యే ప్రమాదం
- బాత్రూమ్స్‌లో వెంటిలేషన్ లేకపోవడం వల్లే..
- గ్యాస్ గీజర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: సనత్‌నగర్ జెక్ కాలనీలో బాత్రూంలో ముగ్గురు కుటుంబసభ్యులు మృత్యువాత పడిన ఘటనలో భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారు గ్యాస్ ఆధారిత గీజర్ వాడుతుండేవారని, అదే వారి పాలిట మరణశాసనమైందని తెలుస్తోంది. దీని నుంచి వెలువడిన కార్బన్ మోనాక్సైడ్ వాయువు కారణంగానే వారి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని డాక్టర్లు నిర్ధారణకు వచ్చారు. ఈ వాయువును పీల్చిన ఐదు నిమిషాలకే స్పృహ తప్పిపడిపోవడమే కాకుండా ప్రాణాలకే ప్రమాదం అని డాక్టర్లు చెబుతున్నారు. గీజర్ నుంచి ఇలాంటి విషపూరితమైన వాయువులు ఎలా వెలువడుతాయో తెలుసుకుని జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది.

వెంటిలేషన్ లేకపోవడం వల్లే..

సాధారణంగా స్నానాల గదుల్లో గాలి, వెలుతురు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక గ్యాస్ ఆధారంగా పనిచేసే గీజర్లను వాడేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. కొందరు కిచెన్లలో కూడా గీజర్లను బిగిస్తుంటారు. బాత్రూమ్‌లో కానీ, కిచెన్‌లో కానీ వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. వెంటిలేటర్లు బిగించినప్పుడు ఎప్పుడూ తెరిచి ఉండేలా చూసుకోవాలి. గీజర్ ఆన్ చేసుకున్నప్పుడు ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఆన్ చేసి ఉంచుకోవాలి. గీజర్‌ను ఎప్పటికప్పుడూ చెక్ చేసుకోవాలి. ఎక్కడైనా లీక్ ఉంటే అశ్రద్ధ చేయకుండా వెంటనే రిపేర్ చేయించాలి.

రోజంతా గీజర్ ఆన్ ఉంచొద్దు..

గీజర్‌ను ఎట్టిపరిస్థితుల్లో కూడా రోజంతా ఆన్ చేసి ఉంచకూడదు. ఆన్‌చేసి మర్చిపోకుండా జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ అవసరం ఉండి నిత్యం వాడాల్సి వస్తే మాత్రం మధ్యలో కాసేపు ఆఫ్ చేసి.. కొద్దిసేపటి తర్వాత ఆన్ చేసుకోవాలి. బాత్రూమ్‌లోకి వెళ్లే ముందు గీజర్‌ను ఆఫ్ చేసుకుంటే మంచిది. అప్పుడు ప్రమాదాలు జరిగే ఛాన్స్ తక్కువగా ఉంటుంది.

కార్బన్ మోనాక్సైడ్ విడుదలయ్యే ప్రమాదం

గ్యాస్ గీజర్ లోపల కాలినట్లయితే..అందులో నుంచి కార్బన్ మోనాక్సైడ్ విడుదలయ్యే ప్రమాదం ఉంది. ఈ గ్యాస్ రంగు, వాసన ఉండదు. దీంతో అది విడుదలైనట్టు కూడా గుర్తుపట్టడం కష్టం. అది పీల్చుకున్న వారి మెదడుపై నేరుగా చాలా తక్కువ సమయంలోనే ప్రభావం చూపుతుంది. దీంతో ఐదు నిమిషాల్లోనే స్పృహ తప్పిపోతుంటారు. ఎక్కువగా కనుక పీల్చుకుంటే ప్రాణాలకే ప్రమాదం. వెంటనే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడొచ్చు.

రూ.100 కోట్ల స్థలానికి ఎసరు!

- కోకాపేట్ హెచ్‌ఎండీఏ స్థలంలో అక్రమార్కుల పాగా
- అడ్డుకున్న హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేట్‌లో సుమారు రూ.100 కోట్ల విలువైన స్థలంలో పాగా వేసేందుకు కబ్జారాయుళ్లు పన్నిన పథకాన్ని హెచ్‌ఎండీఏ అధికారులు అడ్డుకున్నారు. కోకాపేట్‌లోని సర్వే నంబర్ 117లో ఉన్న 2.5 ఎకరాల హెచ్‌ఎండీఏ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా కంటైనర్లు, డబ్బాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టేట్ అధికారులు వాటిని గుర్తించి తొలగించారు. హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ జానకీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ఎస్టేట్ విభాగం ఉద్యోగులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ఇటీవల మియాపూర్‌లో హెచ్‌ఎండీఏ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాల పైన ఉక్కు పాదాన్ని మోపిన సంగతి తెలిసిందే. అక్కడ పెద్ద ఎత్తున రక్షణ చర్యలు చేపట్టారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మరోవైపు అన్ని ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ భూములను జియోఫెన్సింగ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



నోరో వర్రీ..!

ఓల్డ్ సిటీలోని పలు ప్రాంతాల్లో వైరస్ విజృంభణ

- కలుషిత నీరు తాగడం వల్లే అంటున్న డాక్టర్లు
- ఒళ్లు నొప్పులు, తీవ్ర జ్వరంతో ఆస్పత్రుల్లో చేరుతున్న పేషెంట్లు


సాక్షి, సిటీబ్యూరో: నగరాన్ని మరో వైరస్ భయం వెంటాడుతోంది. ఇప్పటికే సీజనల్ వ్యాధులతో అస్తవ్యస్తం అవుతున్న నగరవాసులను నోరో వైరస్ వెంటాడుతోంది. ముఖ్యంగా పాతబస్తీలోని డబీర్‌పురా, యాకుత్‌పురా, మలక్‌పేట తదితర ప్రాంతాల్లో చాలా మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. తీవ్ర జ్వరం, లో బీపీ, డీ హైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్యలతో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులకు భారీగా పోటెత్తుతున్నారు. గతంలో కూడా పలుసార్లు అక్కడక్కడా కేసులు నమోదైనా ప్రస్తుతం మాత్రం అధిక సంఖ్యలో కేసులు నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. కొందరిలో కిడ్నీ ఫెయిల్యూర్ కూడా అవుతుండటంతో ఐసీయూలో చేరి చికిత్స పొందుతున్నారు.

ప్రాథమిక అంచనా ఇలా..

ఒక్కో ఆస్పత్రిలో రోజుకు వంద మంది ఇలాంటి లక్షణాలతో చేరుతున్నారని పలువురు డాక్టర్లు చెబుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారి ఆహారపు అలవాట్లను అడిగి తెలుసుకుంటే..గత వారం రోజులుగా వారెవరూ బయటి ఆహారం తీసుకోలేదని వెల్లడిస్తున్నారు. అయితే చాలా మందికి కలుషిత నీరు తీసుకోవడం వల్లే ఈ వైరస్ సోకి ఉంటుందని ప్రాథమిక అంచనాకు వస్తున్నారు.

లక్షణాలు..

- తరచుగా విపరీతమైన వాంతులు, విరేచనాలు
- డీ హైడ్రేషన్ (తీవ్రమైన దాహం, మూత్రం తక్కువగా రావడం)



- తీవ్రమైన కడుపులో నొప్పి
- అధిక జ్వరం, కొన్నిసార్లు చలిజ్వరం
- ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు
- అలసిపోయినట్టు అనిపించడం

ఐదుగురు చిన్నారులకు 'డెంగీ' లక్షణాలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో డెంగీ విజృంభిస్తోంది. 60 శాతం మురికివాడలే ఉన్న ఈ ప్రాంతంలో మలేరియా, డయేరియా, విష జ్వరాలు ప్రబలుతున్నాయి. తాజాగా సోమవారం చింతల్ సాయినగర్‌కు చెందిన దేవాక్షి (5), చింతల్ శివానగర్‌కు చెందిన మోనిత్ (5), జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో ఉండే కీర్తన (1), కొంపల్లి గ్రామానికి చెందిన సుశ్రిత్ (12), పేట్ బషీరాబాద్ ప్రాంతానికి చెందిన సాయి చార్విక్ (15) జ్వరాలతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరారు. డెంగీ లక్షణాలు ఉన్నట్లు పరీక్షలు చేయగా నిర్ధారణ అయింది. వీరి ప్లేట్లెట్స్ పడిపోతూ ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. చింతల్, షాపూర్‌నగర్, కొంపల్లి, సుచిత్ర, పేట్ బషీరాబాద్‌లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇదే తరహాలో డెంగీ లక్షణాలు ఉన్న పలువురు చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఏసీబీ వలలో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్


దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడకు చెందిన సుదర్శన్‌కు సత్యనారాయణ అనే వ్యక్తితో భూవివాదం కొనసాగుతోంది. దీనిపై కోర్టులో సివిల్ కేసు విచారణలో ఉంది. ఇదిలా ఉండగా సుదర్శన్‌కు చెందిన భూమిలోకి వెళ్లేందుకు దారి లేకుండా సత్యనారాయణ ప్రహరీ నిర్మించాడు. అక్రమంగా నిర్మించిన ప్రహరీ ప్రభుత్వ భూమిలో ఉందని, దానిని తొలగించాలని సుదర్శన్ మున్సిపల్ కమిషనర్‌ను కోరగా ప్రహరీని కూల్చివేశారు. అయితే ఆ తర్వాత కోర్టు ఆదేశాలతో సత్యనారాయణ తిరిగి ప్రహరీ నిర్మించాడు. దీనిపై కోర్టులో కౌంటర్ ఫైల్ చేసిన సుదర్శన్ ప్రహరీని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను కోరగా అందుకు ఆయన రూ. 50 వేలు డిమాండ్ చేశాడు. ఒప్పందం ప్రకారం వారం రోజుల క్రితం రూ. 20 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చారు. సోమవారం మిగతా రూ. 30 వేలు ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని కోర్టులో హాజరుపరిచారు. కాగా ఏసీబీకి పట్టుబడిన రాజమల్లయ్య ఎన్నికల బదిలీల్లో భాగంగా జగిత్యాల జిల్లా, కోరుట్ల మునిసిపాలిటీ నుంచి దమ్మాయిగూడ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న
అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- 40 కేజీల పాపిస్ట్రా
- 10 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

అల్వాల్: మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సుధీర్‌బాబు సోమవారం వివరాలు వెల్లడించారు.. రాజస్థాన్‌కు చెందిన ఒమారామ్ అలియాస్ ఓం ప్రకాష్ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు, అతడి స్నేహితుడు సన్వాలా రాం నగరానికి వలస వచ్చి రెయిలింగ్ పని చేస్తున్నాడు. తద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో వారిరువురు పాపిస్ట్రా మత్తు మందు, ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకువచ్చి నగరంలో విక్రయించాలని పథకం పన్నారు. ఈ నేపథ్యంలో ఓంప్రకాష్ మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్ నుంచి 40 కేజీల పాపిస్ట్రా, 10 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి వాటిని సన్వాల్ రాంకు అప్పగించేందుకు నగరానికి వస్తున్నట్లు సమాచారం అందడంతో రాచకొండ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మల్కారం సమీపంలో వారిని అదుపులోకి తీసుకుని మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఓం ప్రకాష్ తన ఫోన్ నెంబర్ ఎవరూ గుర్తించకుండా వై-ఫై ద్వారా ఇంటర్నెట్ కాల్స్ ద్వారా ఈ దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతడి నుంచి వై-ఫై రౌటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరికి మత్తు పదార్థాలు సరఫరా చేసిన వికాస్ కోసం గాలింపు చేపట్టారు. కాగా వీరు గత రెండు నెలలుగా నగరానికి భారీ మొత్తంలో పాపిస్ట్రా మత్తు మందును తీసుకు వచ్చినట్లు విచారణలో వెల్లడైంది.

'ఆన్‌లైన్‌లో హాజరై వివరణ ఇవ్వండి '

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోని చెరువులు, కుంటల బఫర్ జోన్‌ను నోటిఫై చేసి నివేదిక అందజేయాలని ఆదేశాలిచ్చి ఏడాది కావొస్తున్నా ఇంకా ఎందుకు చేయలేదో స్పష్టం చేయాలని కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. బుధవారం జరిగే విచారణకు వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరై.. బఫర్ జోన్‌ను నిర్ణయించారా.. లేదా.. అన్నది చెప్పాలని తేల్చిచెప్పింది. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను 24కు వాయిదా వేసింది. నగరంలోని రామమ్మ కుంట ఎఫ్‌టీఎల్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మానవ హక్కుల, వినియోగదారుల పరిరక్షణ సెల్ ట్రస్ట్ 2023లో హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హెచ్ఎండీఏ కమిషనర్ వివరణ కోరుతూ విచారణ వాయిదా వేసింది.

800 ప్రమాదాలు | 123 మంది మృత్యువాత

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని ఐటీ జోన్ రోడ్డు ప్రమాదాల విషయంలో డేంజర్ జోన్‌గా మారిపోయింది. రాజధానిలోని మూడు కమిషనరేట్లతో పోలిస్తే... ఇక్కడి నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే అత్యధికంగా ప్రమాదాలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో గతేడాది మొత్తం 800 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 123 మంది మృత్యువాతపడగా, 685 మంది క్షతగాత్రులైనట్లు పోలీసు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాహనచోదకుల ఉల్లంఘనలు, నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అధికారులు పేర్కొంటున్నారు. మౌలికవసతుల లేమి సైతం దీనికి ప్రధాన కారణంగా మారింది.
–సాక్షి, సిటీబ్యూరో

- యాక్సిడెంట్ జోన్‌గా ఐటీ కారిడార్
- నాలుగు కీలక ఠాణాల పరిధిలోనే అత్యధిక ప్రమాదాలు
- ఓవర్ స్పీడింగ్, ర్యాష్ డ్రైవింగూ కారణాలే
- స్పష్టం చేస్తున్న గతేడాది గణాంకాలు



ఐటీ కారిడార్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు...

రాజధానిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 2023లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషించిన నేపథ్యంలో ఆందోళనకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మూడు కమిషనరేట్ల పరిధిలో 160 పోలీస్ స్టేషన్లు ఉండగా... ఐటీ జోన్ విస్తరించి ఉన్న నార్సింగి, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఠాణాలతో పాటు దీని చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రధానంగా రాజేంద్రనగర్, మియాపూర్, కూకట్‌పల్లి పీఎస్‌ల పరిధిలోని ప్రాంతాలు వాహనచోదకులకు నెలవుగా మారుతున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఐటీ జోన్‌లోని నాలుగు ఠాణాల పరిధిలో జరిగిన 800 రోడ్డు ప్రమాదాల్లో 123 మంది చనిపోగా... దాని చుట్టూ విస్తరించి ఉన్న మూడు పోలీసుస్టేషన్ల పరిధిలో 147, 126, 117 చొప్పున మరణాలు రికార్డయ్యాయి.

శివార్లలోనూ..

ప్రధాన నగరం, దానికి ఆనుకుని ఉన్న శివార్లతో పాటు బయట ఉన్న ప్రాంతాల్లోనూ కొన్ని రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయని పోలీసుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అటు ఇండస్ట్రియల్-కమర్షియల్, ఇటు రెసిడెన్షియల్ ఏరియాలో ఎక్కువగా ఉండే మేడ్చల్ పరిధిలోని ప్రాంతాల్లో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 64 మంది చనిపోగా... 126 మంది క్షతగాత్రులయ్యారు. ఇక్కడ ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 21 మంది చనిపోగా... 66 మంది క్షతగాత్రులయ్యారు. 2023 నాటి గణాంకాల ప్రకారం మొయినాబాద్ పరిధిలో జరిగిన యాక్సిడెంట్స్‌లో 47 మంది చనిపోగా, 77 మంది క్షతగాత్రులయ్యారు. దుండిగల్ పరిధిలో 44, ఆర్సీపురం పరిధిలో 41, శామీర్‌పేట పరిధిలో 40 మృతులతో కూడిన రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ పరిస్థితులకు కారణాలను అధ్యయనం చేస్తున్న పోలీసులు నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.



మౌలికవసతులూ కనిపించవు

రహదారులు, డివైడర్లు, ఫుట్‌పాత్‌ల వంటి అంశాల్లో నగరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఐటీ జోన్ అడ్వాన్స్‌లోనే ఉన్నప్పటికీ... పాదచారికి అవసరమైన కొన్ని మౌలిక వసతులు మాత్రం కనిపించట్లేదు. ప్రధానంగా రోడ్డు దాటడానికి ఉపకరించే ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌లు అవసరమైన స్థాయిలో లేవు. కొన్నిచోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ... లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరట్లేదు. ఈ కారణాల వల్ల పాదచారులు సైతం పెద్ద సంఖ్యలోనే ప్రమాదాల బారిన పడుతున్నారు. ఐటీ కారిడార్‌లో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరగడానికి ఇదీ ఓ కారణంగా మారుతోంది. ఈ ఏరియాలతో పాటు జాతీయ రహదారి నెం.65పై ఉన్న ఎల్బీనగర్-హయత్‌నగర్ మధ్య ప్రాంతంలోనూ గతేడాది రోడ్డు ప్రమాదాలు ఎక్కువగానే జరిగాయి. ఈ స్ట్రెచ్‌లో 400 యాక్సిడెంట్స్ నమోదు కావడానికి లారీలు, భారీ వాహనాలు కారణమని అధికారులు భావిస్తున్నారు. ఈ రహదారికి రెండు వైపులా రెసిడెన్షియల్ ఏరియాలు ఉన్నాయి. అక్కడ నివసించే వారు రాకపోకలు సాగించే సమయంలో లారీలు, భారీ వాహనాలు చేస్తున్న ఉల్లంఘనలకు బలవుతున్నారు.



ఆ మూడు కారణాలతోనే..

ఐటీ కారిడార్‌లోని నాలుగు పోలీసుస్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు డేంజర్ జోన్‌గా మారడానికి ప్రధానంగా మూడు కారణాలు గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అత్యధికులు ఐటీ ఉద్యోగులే. వీరితో పాటు సంపన్నులు కూడా పెద్ద సంఖ్యలోనే నివసిస్తున్నారు. వీరు వినియోగిస్తున్న వాహనాల్లో హైఎండ్ వాహనాలే ఎక్కువగా ఉంటున్నాయి. రహదారులు సైతం మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే విశాలంగా, భిన్నంగా ఉంటాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులతో పాటు తేలికపాటి వాహనాలు నడిపే వాళ్లు మితిమీరిన వేగంతో దూసుకుపోతుంటారు. ఈ ఓవర్ స్పీడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఐటీ కారిడార్లలోని రహదారుల్లో దాదాపు అన్నింటికీ మధ్య డివైడర్లు ఉన్నాయి. వీటి కారణంగా ఓ దిశలోని మార్గంలోని ప్రయాణిస్తున్న వాహనచోదకులు మరో దిశలోని మార్గంలోకి వెళ్లాలంటే 'యూ' టర్న్ కోసం దూరం వెళ్లాల్సి వస్తోంది. దీంతో చాలా మంది రాంగ్ రూట్‌ను ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

మేడ్చల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్ పోక్సో కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్వాల్, భూదేవి నగర్‌కు చెందిన బాలిక 8వ తరగతి చదువుతోంది. 2018లో రాజస్థాన్‌కు చెందిన రాకేష్ కునావత్ అనే యువకుడు తన స్నేహితుడు భరత్‌దినేష్‌తో కలిసి ఆమెను విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి అక్కడ హోటల్ గదిలో లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను నగరానికి తీసుకువచ్చి వదిలేశాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అల్వాల్ పోలీసులు నిందితులు రాకేష్ కునావత్, భరత్‌దినేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ చేపట్టిన మేడ్చల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి జంగా జీవన్‌కుమార్ నిందితుడు రాకేష్ కునావత్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

విమానం ఆలస్యం.. ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్: విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళన చేసిన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ఐదుగంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన విమానం సమయానికి బయలుదేరలేదు. ఉదయం 8 గంటల వరకు కూడా విమానం బయలుదేరకపోవడంతో ప్రయాణికులు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

జోరా పబ్‌లో ఆకస్మిక తనిఖీలు

15 మందికి పరీక్షలు
నలుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు గుర్తింపు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని జోరా పబ్‌లో ఆదివారం రాత్రి 'మూన్‌లైట్ పార్టీ' పేరుతో నిర్వహించిన ఓ ఈవెంట్‌లో డ్రగ్స్ తీసుకుంటున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో పాల్గొన్న 15 మందికి రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించగా ఇందులో నలుగురికి పాజిటివ్‌గా తేలింది. వీరందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే పార్టీ ఎవరు నిర్వహించారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు.. అన్న అంశాలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డ్రగ్స్ తీసుకున్న నలుగురి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులపై చర్యలు తీసుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

వరల్డ్ తైక్వాండో కల్చర్ ఎక్స్‌పోలో
భారత్‌కు ఏడు పతకాలు



సాక్షి, హైదరాబాద్: వరల్డ్ తైక్వాండో కల్చర్ ఎక్స్‌పోలో భారత ఆటగాళ్లు మెరిశారు. దక్షిణ కొరియాలోని ముజు గున్ - జియోన్‌బక్‌లో జరిగిన ఈ పోటీల్లో 27 దేశాలకు చెందిన ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో భారత్‌కు చెందిన తైక్వాండో అథ్లెట్లు ఏడు పతకాలు గెలుచుకోవడం విశేషం. మహిళల అండర్-15 కేటగిరీలో ఇరువజ్జుల వైశాలి ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. క్యోరుగి, పూమ్‌సే ఈవెంట్‌లలో ఆమె ఈ పతకాలు సాధించింది. అండర్-15 (పురుషుల) కేటగిరీలో నూతక్కి సాజిత్ కూడా రజతం (పూమ్‌సే), కాంస్యం (క్యోరుగి) గెలుచుకున్నాడు. అండర్-39 మహిళల విభాగంలో డోలి పవిత్ర స్వర్ణం (క్యోరుగి), కాంస్యం (పూమ్‌సే) అందుకోగా...మహిళల అండర్-50 కేటగిరీలో తిమ్మాయమోద వెంకటకుమారి (పూమ్‌సే అండ్ క్యోరుగి) పసిడి పతకం సాధించింది. అథ్లెట్లతో పాటు సహాయ సిబ్బంది హోదాలో గ్రాండ్‌మాస్టర్ మర్రిపాటి నాగూర్, శివరామ్ మక్వానా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

మద్యం తాగేందుకు రూ. 100 ఇవ్వలేదని..

వ్యక్తి ఆత్మహత్య

మేడిపల్లి: మద్యం తాగేందుకు రూ. 100 ఇవ్వలేదని మనస్తాపానికిలోనైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచవాని సింగారం గ్రామానికి చెందిన సంబోజు శ్రీకాంత్ చారి(37)కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన అతను ఆదివారం మద్యం తాగేందుకు డబ్బులు లేక పోవడంతో తల్లిని రూ.100 అడగాడు. అయితే ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో మనస్తాపానికి లోనైన శ్రీకాంత్ చారి సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నలుగురు నిందితులు... 401 కేసులు

- ఆన్‌లైన్ లోన్స్ పేరుతో మోసాలు
- ఢిల్లీకి చెందిన నలుగురి అరెస్ట్

హిమాయత్‌నగర్: ఆన్‌లైన్ యాప్‌లలో తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని మోసాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ కవిత దార కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బహదూర్‌పురాకి చెందిన ఓ వ్యక్తికి ధని ఇన్‌స్టాంట్ పర్సనల్ లోన్ రూ.2 లక్షలు మంజూరయ్యాయని ఫోన్ కాల్ వచ్చింది. దీంతో బాధితుడు లోన్ కోసం తన ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఇతర పత్రాలను అందించాడు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు, తదితర చార్జీల పేరుతో బాధితుడి నుంచి రూ.1.2 లక్షలు వసూలు చేసి మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ధని, ఇండియాబుల్ ఇతర కంపెనీల పేరుతో ఫోన్ కాల్స్, ఈమెయిల్, సోషల్ మీడియా ద్వారా ఢిల్లీ కేంద్రంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్న గుర్తించారు. అక్కడికి వెళ్లిన ప్రత్యేక బృందం బీహార్‌కు చెందిన మనీష్ కుమార్, ఆకాష్ కుమార్, కుందన్ కుమార్, వెంకటేష్ మణిజ్ రాథోడ్ లను అరెస్ట్ చేసి వారి నుంచి 11 మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశ వ్యాప్తంగా 401 కేసులు, తెలంగాణ రాష్ట్రంలో 24 కేసులు ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు.

ఏసీబీకి పట్టుబడిన సస్పెండెడ్ సీఐ

రూ.5 లక్షలు తీసుకుంటుండగా
రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

హఫీజ్‌పేట్ : సస్పెండైన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సంఘటన సోమవారం రాత్రి మియాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సంగారెడ్డి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన మట్టపర్తి సాయి వెంకట కిషోర్ (సస్పెండెడ్). 2023లో సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్‌కు చెందిన మేరుగు రవి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిని ఓ కేసు నుంచి తప్పించేందుకు రూ.1.50 కోట్లు డిమాండ్ చేశాడు. అయితే రూ.10 లక్షలు నగదు ఇచ్చేందుకు బాధితుడు అంగీకరించగా, మిగతా రూ.1.40 కోట్ల విలువైన మూడు ఆస్తులను తన పేరున రిజిస్టర్ చేయాలని సీఐ కోరాడు. రూ.5 లక్షలు ఇస్తానని చెప్పిన రవి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సాయంత్రం మియాపూర్‌లోని మయూరి మార్గ్‌లో సాయి వెంకటకిషోర్ రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసిన అధికారులు నిందితుడిని నాంపల్లిలోని అడిషనల్ స్పెషల్ జడ్జి ముందు హాజరుపరిచారు.

నెలలోగా ఖాళీలు భర్తీ చేయండి

కోఠి ఆసుపత్రిపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోఠి ప్రసూతి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను నెల రోజుల్లోగా భర్తీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 27కు వాయిదా వేసింది. కోఠి ప్రసూతి వైద్యశాలలో వసతులు లేవని, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని 2016లో హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై సీజే ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. అమికస్ క్యూరీ కిరణ్మయి హాజరై ప్రభుత్వం ఈ నెల 12న దాఖలు చేసిన నివేదిక ప్రకారం అన్నీ సక్రమంగానే ఉన్నాయని, అయితే లాబీలో రోగులు, వారితో వచ్చిన వారు కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం తరఫున జీపీ పీ.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పీడియాట్రిక్ సివిల్ సర్జన్ పోస్టు భర్తీ చేయాల్సి ఉందని, అత్యవసరంగా నియామకం చేపడతామని చెప్పారు. లాబీలో కూర్చునేందుకు ఏర్పాట్లు కూడా చేస్తామన్నారు. 'లంచం ఇవ్వకూడదని సాధారణ ప్రజలకూ తెలియజేసే డిస్‌ప్లే బోర్డులు పెట్టాం. అలా ఎవరన్నా అడిగితే చర్యలు తీసుకుంటామని కూడా చెప్పాం. ఒకవేళ ఎవరైనా లంచం అడిగితే ఎవరిని సంప్రదించాలో తెలుగు, ఇంగ్లిష్‌లో వివరాలు, ఫోన్ నంబర్లను పేర్కొన్నాం' అని జీపీ చెప్పారు.

ఫాస్టాగ్ సరి చూసుకోండి

- సరిగ్గా అతికించకపోతే టోల్ ఫీజు డబుల్
- ఓఆర్ఆర్ పై వాహనదారులకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుపైన వెళ్లే వాహనదారులు టోల్ ప్లాజాల వద్ద సాఫీగా ముందుకెళ్లేందుకు తమ వాహనాలకు ఫాస్టాగ్‌లకు సరిగ్గా అతికించుకోవాలని ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే సంస్థ సోమవారం ఓ ప్రకటనలో కోరింది. ఈ మేరకు ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్ఎంసీఎల్) సర్క్యులర్‌లో చేసిన సూచనలను ప్రస్తావించింది.158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో మొత్తం 21 టోల్ ప్లాజాలలో సరిగా అతికించని ఫాస్టాగ్‌లకు రెట్టింపు టోల్ ఫీజు వసూలు చేయడంతో పాటు అలాంటి ఫాస్టాగ్‌లను బ్లాక్‌లిస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే సంస్థ డైరెక్టర్ అమితాబ్ మురార్కా పేర్కొన్నారు. ఐహెచ్ఎంసీఎల్ సూచనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కోరారు. తద్వారా రెట్టింపు టోల్ ఫీజు భారాన్ని, ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్ వంటి ఇబ్బందుల బారినపడకుండా ప్రయాణం చేయవచ్చునన్నారు.అదనపు గాజు లేదా ఇతర మెటీరియల్ ఉపరితలాలపైన ఫాస్టాగ్‌ను అతికించడం, సెల్లో-టేప్ లేదా ఇతర ప్రామాణికం కాని జిగురులను ఉపయోగించడం వంటివి ఉల్లంఘనల కిందికి వస్తాయి. విండ్ షీల్డ్ పై అతికించడానికి బదులుగా వాహనదారులు చేత్తో ఫాస్టాగ్‌ను పట్టుకోవడం కూడా ఉల్లంఘనల్లో భాగమేనని ఆయన గుర్తు చేశారు. ఈ మేరకు ఫాస్టాగ్‌కు, వాహనానికి మధ్య ఏకీకృత, టాంపర్ ప్రూఫ్ సంబంధం ఉండేలా చూసుకోవాలన్నారు. వాహనానికి ముందు విండ్‌షీల్డ్ మీద లోపలివైపు నుంచి ఫాస్టాగ్‌ను సురక్షితంగా అతికించాలని సూచించారు.

బైక్ అదుపుతప్పి బీటెక్ విద్యార్థి దుర్మరణం

పోచారం: బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందాడు. పోచారం ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం... చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న తెరల బాలజీ(19) తన స్నేహితుడు పవన్‌కుమార్(20)తో కలిసి బైక్ మీద జోడిమెట్ల నుంచి చౌదరిగూడ వెళ్తున్నారు. చౌదరిగూడ హనుమాన్ గుడి వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బాలాజీ తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న పవన్‌కు గాయాలు తగలడంతో మేడిపల్లిలోని శ్రీకర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లోని భారతీయ విద్యా భవన్స్ ఆత్మకూరు రామారావు స్కూల్‌లో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు కనులపండువగా నిర్వహించారు. మహనీయుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ తవ్వి అక్రమ నిర్మాణాలు

- పబ్ నిర్వాహకులపై స్థానికుల ఫిర్యాదు



జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లో ఫుట్‌పాత్‌ను తవ్వి చేపట్టిన అక్రమ నిర్మాణాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లోని బాబీలాన్ పబ్ బిల్డింగ్‌పై అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ పబ్ నిర్వాహకులు జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానికంగా సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఫుట్‌పాత్ తవ్వి పెద్ద పెద్ద ఇనుప స్తంభాలను పబ్ చుట్టూ ఏర్పాటు చేశారని తెలిపారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి పబ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిల్లల సంరక్షణపై అప్రమత్తంగా ఉండాలి



చిన్నారులకు వడ్డిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: పిల్లల సంరక్షణ విషయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అప్రమత్తంగా ఉండాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వీడియో గల్లీ అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం కార్పొరేటర్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలకు వడ్డించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ భోజనం విషయంలో ఎలాంటి రాజీ పడాల్సిన పనిలేదని, ఏ రోజైనా నాణ్యత లేకుండా అంగన్‌వాడీ సెంటర్‌కు సప్లై చేసినట్టయితే అలాంటి దానిని నిలిపివేసి వెంటనే తిరిగి పంపాలని సూచించారు. ఈ విషయంపై అధికారులకు కూడా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతిరోజు టీచర్లు భోజనాన్ని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్యాంరావు, బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పూజారి బాల్‌రాజ్, పవన్ ముదిరాజ్, బాలురజక, యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లను కించపరుస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసిన చీకోటి ప్రవీణ్‌కుమార్

బంజారాహిల్స్: కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన కదిరె కృష్ణ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ప్రవీణ్‌కుమార్ సోమవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కదిరె కృష్ణ కొంతకాలంగా హిందూ దేవుళ్లను కించపరుస్తూ సోషల్ మీడియాలో వీడియోలను షేర్ చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల మతాల మధ్య చిచ్చురేగే ప్రమాదం ఉందని, సమాజంలో అశాంతిని రెచ్చగొట్టే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. కదిరె కృష్ణపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో ఈ వీడియో సర్క్యులేట్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలి: సీపీఎం



మూసివేసిన రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

వెంగళరావునగర్ : పనులు పూర్తయినప్పటికీ ఇంకా రోడ్డును మూసివేసి ఉంచడమేంటి.. ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో చెప్పాలని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్ అధికారులను ప్రశ్నించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ జానకమ్మతోట పక్కన ఉన్న రోడ్డును సోమవారం సీపీఎం నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ వాస్తవానికి రోడ్డు పనులు పూర్తయిన వారంలో ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలన్నారు. కానీ, ఇక్కడ పనులు పూర్తయి రెండు వారాలు దాటినా ఇంకా రాళ్ళు అడ్డుగా పెట్టి రాకపోకలను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. దాంతో కేవలం 20 మీటర్ల దూరంలో ఉన్న యూసుఫ్‌గూడ బస్తీకి 600 మీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్ళాల్సి వస్తోందన్నారు. తక్షణమే రోడ్డుకు అడ్డుగా ఉన్న రాళ్ళను తొలగించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు సీహెచ్ చంద్రశేఖర్‌రావు, వై.యాదగిరి, పి.కృష్ణ, పుల్లయ్య, రమణ, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లానీటిపై నజర్

- నాణ్యత, క్లోరిన్ శాతంపై తనిఖీలు
- వర్షాల నేపథ్యంలో జలమండలి సిబ్బంది అప్రమత్తం
- రోజూ పరిశీలించాలంటున్న అధికారులు



సింగాడకుంట బస్తీలో మంచినీటి సరఫరాను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయంకావడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని నల్లాల మంచినీటిపై జలమండలి అధికారులు దృష్టిపెట్టారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చూడటమే కాకుండా ర్యాండమ్‌గా కొన్ని బస్తీలను ఎంపిక చేసుకుని పలు ఇళ్లల్లో నీటినాణ్యతను తనిఖీలు చేస్తున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో 135 మురికివాడలు ఉండగా, ఈ ప్రాంతాల్లో గత కొద్దిరోజుల నుంచి నీటి సరఫరాను పరిశీలిస్తూనే సంబంధిత అధికారులు, సిబ్బంది నీటి నాణ్యతా పరీక్షలను నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో కలుషితనీరు సరఫరా కాకుండా చూడటంతో పాటు నీటి నాణ్యతాప్రమాణాలు పడిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కాచివడబోసి తాగాలి: హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్-6

వర్షాకాలంలో నల్లానీరు కొద్దిగా రంగుమారి వస్తుంటుంది. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దు. నదుల్లో కొత్తగా చేరుతున్న వరదనీటి కారణంగా రిజర్వాయర్లకు కూడా అదేనీరు వస్తుంది. అయితే ఫిల్టర్ చేసిన తరువాత కూడా కొంతవరకు రంగు నీళ్లు వస్తుంటాయి. అన్ని పరీక్షలు చేసిన తర్వాతనే నాణ్యమైన నీటినే నల్లాల్లోకి వదులుతుంటాం. ప్రతిరోజూ నాతోపాటు సెక్షన్ మేనేజర్లు, లైన్‌మేన్లు లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ నీటి నాణ్యతాపరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన సూచనలు ఇస్తున్నాం. ముఖ్యంగా వర్షాలు పడుతున్నప్పుడు ప్రజలు నీటిని కాచి వడబోసి తాగాలి. అలాగే మా లైన్‌మెన్లు వారికి అందజేసిన పరికరాలతో నీళ్లను పరీక్షిస్తూ నాణ్యతా యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. దీని వల్ల ఏయే ప్రాంతాల్లో క్లోరిన్ శాతం ఏ మేరకు ఉందో తెలుసుకోవడానికి వీలవుతుంది. ఒక్క దగ్గర కూడా కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లుగా ఫిర్యాదులు లేవు. నీటి సరఫరాలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా గడువు ప్రకారం నల్లాలు వదులుతున్నాం.

ప్రతి బస్తీలో వాటర్ సప్లై క్వాలిటీ ఇండికేటర్

వాటర్ సప్లై క్వాలిటీ ఇండికేటర్ ప్రతి బస్తీలోనూ తప్పనిసరిగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నారు. గత కొద్దిరోజుల నుంచి నల్లానీరు వచ్చే సమయాల్లో లైన్‌మేన్లు, సెక్షన్ మేనేజర్లు, జీఎంతోపాటు ఇతర ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి సూచనలు కూడా ఇస్తున్నారు. మంచినీటి అవసరాలకు సరిపోయేంత క్లోరిన్ శాతం ఉందో లేదో తెలుసుకుంటున్నారు. మనకు రోజూ వచ్చే మంచినీళ్లల్లో క్లోరిన్ శాతం 0.2 నుంచి 0.5 పీపీఎం (పార్ట్స్ ఫర్ మిలియన్) గా ఉండాలి. తక్కువ, ఎక్కువలు ఉంటే ఆ డోసేజ్‌కు అనుగుణంగా నీళ్లల్లో క్లోరిన్ శాతాన్ని మారుస్తున్నారు. ఒకవేళ క్లోరిన్ శాతం తక్కువగా ఉంటే అందుకు గల కారణాలను ఆరా తీస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పైప్‌లైన్లు తనిఖీలు చేయడం , నల్లాలను పరిశీలించడం వంటి చేపడుతున్నారు.

అమ్మవారి బోనానికి దారేది?

బాల్‌రెడ్డినగర్‌లో నాలుగు నెలలుగా తిప్పలు



ఇదీ ఫిలింనగర్ బాల్‌రెడ్డినగర్ బస్తీలో రోడ్డు పరిస్థితి

ఫిలింనగర్: ఆ బాటలో మామూలుగా నడవాలంటేనే అష్టకష్టాలు పడాలి. అలాంటిది బోనాల పండుగ వేళ అమ్మవారికి సమర్పించే బోనం కుండను నెత్తిన బెట్టుకొని ఎలా నడిచేది అంటూ బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీలో రోడ్డు పరిస్థితి భయంకరంగా ఉంది. నాలుగు నెలలుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఎవ్వరూ పట్టించుకోవడంలేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం మురుగునీటి కాల్వ మంజూరు కావడంతో రోడ్డును జలమండలి అధికారులు తవ్వి పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ఆ వెంటనే సీసీ రోడ్డు వేయాల్సి ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదనలు సకాలంలో రూపొందించలేదు. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయి. కొన్ని రోజుల క్రితం ఇక్కడ రోడ్డు వేయడానికి బడ్జెట్ లేదని అధికారులు చెప్పారు. ఇప్పుడు నిధులు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదంటూ సాకులు చెబుతున్నారని బస్తీవాసులు అధికారులపై మండిపడుతున్నారు. తవ్వేసిన రోడ్డు మధ్యలోనే అమ్మవారి ఆలయం ఉంది. ఈ రాళ్ల తేలిన రోడ్డు గుండా వచ్చి అమ్మవారికి బోనాలు ఎలా సమర్పించాలంటూ బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడికి రంగులు, ఇతర ఖర్చుల కోసం తాజాగా దేవాదాయ శాఖ నిధులు మంజూరు చేసింది. కానీ, రోడ్డు పనులు మాత్రం పూర్తికాలేదు.

వర్షం వస్తే వరదే...

ఈ బస్తీ దిగువ ప్రాంతంలో ఉండటంతో వర్షం వచ్చిన ప్రతీసారి ఎగువన ఉన్న వినాయకనగర్ దుర్గా భవానీనగర్, బాబు నాయుడునగర్ బస్తీల నుంచి పెద్దఎత్తు వరద నీరు ఈ బస్తీ గుండానే వెళ్తుంది. ఆ సమయంలో భారీ ఎత్తున వచ్చే వరదతో రోడ్డు మధ్యలో ఉన్న మట్టి, రాళ్ళు ఇళ్ళల్లోకి కొట్టుకువస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మహిళాజర్నలిస్ట్‌ను మోసగించిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: ప్రేమపేరుతో మహిళా జర్నలిస్ట్‌ను నమ్మించి నగదు, ఫోన్ కాజేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ... యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన యువతి స్థానిక మధురానగర్ కాలనీ హాస్టల్‌లో ఉంటూ ఓ మీడియా సంస్థలో జర్నలిస్ట్‌గా విధులు నిర్వహిస్తోంది. అడపాదడపా సినిమాల్లో కూడా చిన్న చిన్న క్యారెక్టర్స్ చేస్తూ ఉంటోంది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో ఆమెకు సత్య అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను సినిమా ఇండస్ట్రీకి చెందిన వాడినని పరిచయం చేసుకున్నాడు. ఇరువురి మధ్య స్నేహం కాస్త ప్రేమగా మారింది. కొన్ని నెల కిందట తనకు డబ్బు అవసరం ఉందని, తిరిగి త్వరలోనే ఇస్తానంటూ ఆమె వద్ద రూ.50 వేలు తీసుకున్నాడు. అంతేగాకుండా ఫోన్ కూడా ఆమె నుంచి తీసుకున్నాడు. కొన్ని రోజులు గడిచాక నగదు, ఫోన్ తిరిగి ఇవ్వాలని ఆమె అడుగుతుంటే మాయ మాటలు చెబుతూ తప్పించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆమె ఈనెల 19న అతనికి ఫోన్ కాల్ చేయగా మరో మహిళ లిఫ్ట్ చేసింది. సత్య తన భర్త అని, అతడికి ఎందుకు ఫోన్ కాల్ చేస్తున్నావంటూ దుర్భాషలాడింది. వారిరువురూ దిగిన ఫొటోలను కూడా ఆమె జర్నలిస్ట్‌కు పంపింది. తనను ప్రేమ పేరుతో మోసగించి ఫోన్, నగదు తీసుకున్న సత్యతోపాటుగా అకారణంగా దూషించిన సదరు మహిళపై కూడా చర్యలు తీసుకోవాలంటూ మహిళా జర్నలిస్ట్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మల్టీపర్పస్ మదర్సా ఏర్పాటుకు చర్యలు



సమావేశంలో మసీదు కమిటీ నిర్వాహకుడు ఫెరోజ్ ఖాన్ తదితరులు



మదర్సా నమూనా

రహమత్‌నగర్: డివిజన్‌లోని శ్రీరాంనగర్ మజీద్–ఏ–సయ్యదిన ఉమర్–ఏ– ఫారూఖ్(ఆర్‌జెడ్) కమిటీ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ ఉర్దూ మదర్సా నిర్మించనున్నారు. మదర్సా సయ్యదిన ఉమర్ ఫారూఖ్ రజీ అల్లాహు తాలా అన్హు పేరున మసీదు పక్కనే మదర్సా నిర్మించాలని నిర్ణయించారు. దీని కోసం భవననిర్మాణ నమూనా సైతం రూపొందించారు. 275 గజాల విస్తీర్ణంలో ఐదు అంతస్తులతో భవన నిర్మాణం చేపట్టనున్నారు. కంప్యూటర్ శిక్షణ, ఆంగ్ల బోధన కోసం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ నిర్వాహకుడు ఫెరోజ్ ఖాన్ మాట్లాడుతూ పేద పిల్లలకు విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఎక్కడాలేని విధంగా శ్రీరాంనగర్‌లో అన్ని హంగులతో మల్టీపర్పస్ మదర్సా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. మసీదు ఆవరణలో ఉన్న షెట్టర్లను నెలరోజుల్లోపు తొలగించి పనులు ప్రారంభించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో నగదు చోరీ

వెంగళరావునగర్: యూనియన్ బ్యాంక్ పేరుతో ఆన్‌లైన్‌లో మహిళ నుంచి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సిద్ధార్థనగర్ కాలనీలో నివసించే ఓ మహిళకు ఈ నెల 20న తన అకౌంట్ ఉన్న యూనియన్ బ్యాంక్ నుంచి చాలా ఓటీపీలు వచ్చాయి. వాటిని ఆమె తొలగించింది. 21న కూడా ఓటీపీ వచ్చింది. కొద్దిసేపటికే ఆమె అకౌంట్ నుంచి రూ.92,500 నగదు డెబిట్ అయినట్టుగా మెసేజ్ వచ్చింది. దాంతో ఆమె సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ విక్రయిస్తానని మోసం

వెంగళరావునగర్: ఫోన్ ఇస్తానని నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ప్రాంతానికి చెందిన బి.ఎస్. శ్రావణ్‌కుమార్ ఈ నెల 21న ఫోన్ కొనడానికి ఓఎల్‌ఎక్స్‌లో కిరణ్ అనే వ్యక్తిని సంప్రదించగా, రూ.16 వేలు పంపితే ఫోన్ ఇస్తానన్నాడు. ఫోన్ చెక్ చేయాలని శ్రావణ్ అడగ్గా తన స్నేహితుడు మోహన్‌తో పంపిస్తానని చెప్పాడు. కిరణ్ సూచన మేరకు శ్రీనివాసులు అనే వ్యక్తికి నగదు చెల్లించాడు. అయితే ఫోన్ ఇవ్వాలని అడగ్గా కిరణ్ తనకు స్నేహితుడు కాదని తప్పించుకున్నాడు. దీంతో కిరణ్‌కు శ్రావణ్ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దాంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసులో దర్యాప్తు ఉంది.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్టు

బంజారాహిల్స్: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు నిందితులు పోలీసులకు చిక్కారు. జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... ఒడిశాకు చెందిన ఆశీష్ సర్దార్(23) కొంపల్లిలోని జయభేరి కాలనీలో ఉంటూ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శ్రీకృష్ణానగర్ బీ–బ్లాక్‌లో ఓ ఇంట్లో ఎనిమిదిన్నర కిలోల గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడి చేశారు. ఆశీష్ సర్దార్‌తోపాటు పి.మణితేజ, వైనాల ముఖేష్, తన్నీరు వెంకటసాయి, బాపి సర్కార్, తన్మయి సర్కార్‌లను అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జయరాజ్‌కు పరామర్శ

ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉంది: వైద్యులు



జయరాజ్‌ను పరామర్శిస్తున్న లక్ష్మణరావు, జూలూరు

లక్డీకాపూల్: నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ కవి, గాయకుడు, కాళోజీ అవార్డు గ్రహీత జయరాజ్‌ను సోమవారం పలువురు పరామర్శించారు. గత రెండు రోజులుగా నిమ్స్ మెట్టు రంగారెడ్డి బ్లాక్‌లో చికిత్స పొందుతున్న జయరాజ్‌ను మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, కవి, గాయకుడు యశ్పాల్ పరామర్శించారు. కాగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు పేర్కొన్నారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనకు మరి కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు.

వీధికుక్కలకు స్టెరిలైజేషన్ చేయండి

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ 'వాక్ వే'లో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పర్యటించారు. 5.4 కిలోమీటర్ల చుట్టూ ఉన్న ఈ వాక్‌వేలో ప్రతి కిలోమీటరు ఒక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో వాకర్లు తాము ఎంతదూరం నడిచామో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. వీధికుక్కలకు వెంటనే స్టెరిలైజేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. అక్కడక్కడా ఉన్న కొలనులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సమస్య లేకుండా చూసుకోవాలన్నారు.



వాక్‌వేలో పర్యటించిన జెడ్సీ అనురాగ్ జయంతి

మహిళాఉద్యోగికి రూ.16.7 లక్షల టోకరా

అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ రెకమెండ్ పేరిట మోసం

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్‌లో అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ రెకమెండ్ చేస్తామంటూ, తద్వారా అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి ఓ ప్రైవేట్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందినే ఓ మహిళ ఉద్యోగి(46)కి వీఐపీ 53 గ్రో క్యాపిటల్ సెక్యూరిటీస్ గ్రూప్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అప్పర్ సర్క్యూట్ స్టాక్‌లతోపాటు ఐపీవోల వివరాలు అందిస్తామని చెప్పారు. అనంతరం ఆమెను సైబర్ నేరగాళ్లు సృష్టించిన గ్రూప్‌లో చేర్చారు. ప్రతిరోజు ఉదయం 11:00 గంటలకు వారు అప్పర్ సర్క్యూట్ స్టాక్‌లను సూచించి వాటిలో పెట్టుబడి పెట్టాలని సూచించేవారు. వారి మాటలు నమ్మిన బాధితురాలు విడతల వారీగా వారు చెప్పిన బ్యాంక్ ఖాతాలకు మొత్తం రూ.16.73 లక్షలు బదిలీ చేసింది. అనంతరం వారు స్పందించక పోవడంతో మోసపోయానని గ్రహించి నగర సైబర్ క్రైమ్ పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటారు..

'శ్రీసాయి సరస్వతి' విద్యార్థులకు అభినందన





విజేతలకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వెంగళరావునగర్: మార్షల్ ఆర్ట్స్‌లో యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 22 నుంచి రెండురోజులపాటు యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఫస్ట్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ –2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో 7, 8 క్లాసుల విద్యార్థులు ఎం.డానీ పునీత్‌రాజ్, పి.లోహిత్ శౌర్య బంగారు పతకాలను సాధించారు. 7వ తరగతి విద్యార్థి ఎ.చక్రీష్ కుమార్ రజత పతకం, 8వ తరగతి విద్యార్థి జి.కృష్ణవంశీ కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థి ఆర్.నిషితసాయి బంగారు పతకం, 7వ తరగతి విద్యార్థిని పి.యుతిక రజత పతకం, 7వ తరగతి విద్యార్థిని ఎస్.యశస్వి కాంస్య పతకం గెలుచుకున్నారు. వ్యక్తిగత విభాగం బ్లాక్‌బెల్ట్‌లో 6వ తరగతి విద్యార్థి ఎం .సాహితీ గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులు ఆయా విద్యార్థులను అభినందించారు.

ముగిసిన యూట్యూబర్ ప్రణీత్ పోలీస్ కస్టడీ

సిటీ, కోర్టులు: యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు పోలీసుకస్టడీ సోమవారం సాయంత్రం ముగిసింది. దీంతో అతన్ని తిరిగి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని నాంపల్లి కోర్టు పోలీసులకు సూచించింది. తండ్రీ, కూతురు సంబంధంపై అసభ్యకరమైన వ్యాఖ్యాలు చేయడమే కాకుండా, అశ్లీల చిత్రాలతో యూట్యూబ్, సోషల్ మీడియాలో చెడుగా ప్రచురించి, తండ్రీ, కూతుళ్ల మనోభావాలు దెబ్బతీసెలా ప్రణీత్ చిత్రీకరించిన సంగతి తెలిసిందే. అయితే రిమాండ్‌లో ఉన్న అతనికి పోలీసులు వైద్యపరీక్షలు చేయించగా డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. దీంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ప్రణీత్‌పై మరో కేసు నమోదు చేశారు. డ్రగ్స్‌పై పూర్తి వివరాలు సేకరించేందుకు మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని గత శుక్రవారం పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే సోమవారం సాయంత్రం కస్టడీ గడువు ముగియగా నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. పోలీసులు కొట్టారా..? అని న్యాయమూర్తి అడుగగా, లేదని సమాధానం ఇచ్చారు. అనంతరం తిరిగి అతన్ని జ్యుడీషియల్ రిమాండ్‌లోకి తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు.

నాట్యగురు అంజుబాబుకు అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్


ప్రముఖ కథక్ నాట్యగురు అంజుబాబు

చిక్కడపల్లి: ప్రముఖ కథక్ నాట్యగురు, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు ఎర్రంశెట్టి అంజుబాబుకు అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఐదు దశాబ్దాలుగా కథక్ నాట్యంలో చేస్తున్న విశేష సేవలను గుర్తించి అమెరికా మేరీల్యాండ్‌లోని సౌత్ వెస్టర్న్ అమెరికన్ యూనివర్సిటీ 2023వ సంవత్సరానికి భారతదేశం నుంచి అంజుబాబును ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ యూనివర్సిటీ ట్రస్టీ డాక్టర్ ఎల్విస్ విలియం నుంచి ఉత్తర్వులు అందినట్లు అంజుబాబు సోమవారం తెలిపారు. ఢిల్లీలో బుధవారం ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. గతేడాది ముంబైలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ప్రదానం చేశారు. ఉత్తరాది శాస్త్రీయ కథక్ నాట్యానికి దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాచుర్యం కల్పించిన తొలి నాట్యగురువుగా అంజుబాబు ప్రసిద్ధి పొందారు. 37 ఏళ్లుగా ప్రతి సంవత్సరం అంతర్జాతీయ నృత్య దినోత్సవం రోజున హైదరాబాద్‌లో జాతీయ స్థాయి కళాకారులతో నృత్యోత్సవాలు నిర్వహిస్తూ ఆయన గుర్తింపు పొందారు. అమెరికా యూనివర్సిటీ తనను గుర్తించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గౌడలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ పార్టీ గౌడలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పోతగాని ఐలన్‌గౌడ్ డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వృత్తిలో మరణించిన కల్లుగీత వృత్తిదారులకు రూ.5–10 లక్షల ఎక్స్‌గ్రేషియా, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరుతో జనగామ జిల్లా ఏర్పాటుకు గెజిట్ విడుదల చేయాలని, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, మద్యం షాపుల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, 50 సంవత్సరాలు పైబడిన గీత వృత్తిదారులకు రూ.4 వేల పింఛన్ తదితర హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ బదిలీలపై ఆరోపణలు అవాస్తవం


మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్

సుల్తాన్‌బజార్: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ బదిలీలపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ 3194 రాష్ట్ర సంఘం పేర్కొంది. ఈ మేరకు కోఠి డీఎంహెచ్‌ఎస్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగల వెంకటేశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌సుందర్ మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో తమ సంఘం గుర్తింపు సంఘంగా కొనసాగుతోందన్నారు. తమ సంఘానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక తెలంగాణ వైద్య ప్రజారోగ్య సంఘం అధ్యక్షులు కర్నాటి సాయిరెడ్డి వంటి వారు అవాస్తవ ఆరోపణలు చేస్తూ సంఘంతో పాటు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారన్నారు. అతడి అక్రమాలను బయటకు తీసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎప్పటి నుంచో వేచిచూస్తున్న ఉద్యోగుల బదిలీలు సజావుగా సాగేందుకు ప్రభుత్వం, అధికారులు కృషి చేస్తుంటే ఇలాంటి ఆరోపణలు తగదన్నారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి భోగ ప్రకాష్, రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీ గోవిందరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామేశ్వరి, రామలక్ష్మీ, జ్ఞానేశ్వర్ దేవిక, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు నటరాజన్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుండయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఫీజు’ విడుదల కోరుతూ పీడీఎస్‌యూ ర్యాలీ

హిమాయత్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) గ్రేటర్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నారాయణగూడలో పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థులతో కలిసి సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరేళ్లుగా విద్యార్థులకు ఫీజులు చెల్లించడం లేదన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకుపోయాయన్నారు. మొత్తం రూ.8,214.57 కోట్లు ఫీజుల రూపంలో బకాయి ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తయినా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో 80శాతం మంది విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను కొనసాగిస్తుంటే ప్రభుత్వం ఆ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ ఉన్న ఫీజు బకాయిలు మొత్తాన్ని చెల్లించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, నాయకులు మహేష్, సతీష్, చింటు, మురళి, శ్రీరామ్, మనోహర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో జీ స్పార్క్–2024 సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో హైదరాబాద్ వేదికగా జరగనున్న గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్, కంట్రోల్, యాంటీ మైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్(జీ స్పార్క్–2024) సదస్సుకు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మద్దతు పలికారు. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెంట్ వ్యాధులను తగ్గించడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. సదస్సుకు హాజరు కావాల్సిందిగా సదస్సు అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి బుర్రి, ఉపాధ్యక్షుడు గోవింధారి మంత్రిని కలిసి ఆహ్వానించారు. సదస్సుకు హాజరవుతానని ఆయన చెప్పినట్లు సదస్సు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 5వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది.

హైడ్రాకు దీటుగా స్కాడా!



33/11 కేవీ ఫీడర్లలో కరెంట్ సరఫరాపై నిఘా

- ప్రస్తుతం మెట్రో జోన్‌కే పరిమితమైన స్కాడా సేవలు
- గ్రేటర్ వ్యాప్తంగా విస్తరించేందుకు ప్లాన్
- రూ.25 కోట్లతో టెండర్లకు ఆహ్వానం

అంతరాయాలపై అప్రమత్తం

సాధారణంగా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఈదురుగాలులు, వర్షాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. గాలి తీవ్రతకు అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడటం, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలడం, ఇన్సులేటర్లు పగిలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఈ వర్షానికి తరచూ 350 నుంచి 400 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఏ ఫీడర్ పరిధిలో ఏ సమస్య కారణంగా సరఫరా నిలిచిపోయిందో గుర్తించడం అధికారులకు కష్టంగా మారుతోంది. గంటల తరబడి కరెంట్ లేకపోవడంతో వినియోగదారుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తోంది. ఎవరైనా స్థానికులు సమస్యను గుర్తించి, ఫిర్యాదు చేస్తేగానీ సరఫరాను పునరుద్ధరించలేని దుస్థితి. అదే ఫీడర్‌ను కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ స్కాడా సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించడం వల్ల సులువుగా తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది. స్కాడా సెంటర్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్/టీవీ స్క్రీన్లపై ఏ ఫీడర్ పరిధిలో పవర్ ఇన్ కమింగ్..? అవుట్ గోయింగ్ నిలిచిపోయిందో గుర్తించే అవకాశం లభిస్తుంది. ఈ లోపాలను గుర్తించి వెంటనే క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసే వెసులుబాటు అధికారులకు అందుబాటులోకి రాబోతోంది.

సాక్షి, సిటీబ్యూరో:

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తీసుకురాబోతున్న హైదరాబాద్ విపత్తుల స్పందన, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ(హైడ్రా)కు దీటుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా, కరెంట్ రాకపోకలను గుర్తించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్(స్కాడా) సేవలను విస్తరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. ఇప్పటి వరకు కేవలం మెట్రో జోన్‌కే పరిమితమైన ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇకపై అవుటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న అన్ని సర్కిళ్లకు విస్తరించాలని యోచిస్తోంది. ఇందుకోసం రూ.25 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది.



499 సబ్‌స్టేషన్లకు విస్తరణ

సాధారణంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి నేరుగా 400 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. అటు నుంచి 220 కేవీ, 132 కేవీ, 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు 33/11 కేవీ ఫీడర్ల ద్వారా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. గ్రేటర్‌లో తొమ్మిది సర్కిళ్లు ఉండగా, వీటి పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 499 వరకు ఉన్నాయి. వీటిలో రాజేంద్రనగర్ సర్కిల్‌లో 117, సరూర్‌నగర్‌లో 58, సైబర్‌సిటీలో 66, హబ్సిగూడలో 57, మేడ్చల్‌లో 62, సికింద్రాబాద్‌లో 31, బంజారాహిల్స్‌లో 38, హైదరాబాద్ సౌత్‌లో 37, హైదరాబాద్ సెంట్రల్‌లో 33 ఉన్నాయి. ఇటీవలే గ్రేటర్ పరిధిలోకి తీసుకొచ్చిన సంగారెడ్డి సర్కిల్‌లో మరో 150 వరకు ఉన్నాయి. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఎల్టీ లైన్స్ 56,950 కిలోమీటర్లు, 33కేవీ యూజీ కేబుల్స్ 1,279 కి.మీలు, 11 కేవీ యూజీ కేబుల్స్ 940 కి.మీ.లు విస్తరించి ఉన్నాయి. గ్రేటర్‌లో మొత్తం 62.10 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, గరిష్ట డిమాండ్ 4,352 మెగావాట్లు నమోదవుతోంది. మెట్రోజోన్‌కే పరిమితమైన ఈ సేవలను గ్రేటర్ వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఆరోగ్య సంరక్షణలో టెక్నాలజీ పాత్ర కీలకం

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

హిమాయత్‌నగర్: ప్రివెంటివ్ హెల్త్‌కేర్ రంగంలో ఆరోగ్య సంరక్షణలో టెక్నాలజీ పాత్ర పెరుగుతోందని, రోగులు ఆస్పత్రికి వెళ్లకుండానే ఇంట్లో నుంచే సమగ్ర మధుమేహ సంరక్షణ అందించడం కోసం టెక్నాలజీ సమన్వయం ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ‘డయాబెటిస్ అండ్ ఎండోక్రైనాలజీ’పై ఐడియా క్లినిక్స్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. డయాబెటిక్ వైద్యరంగంలో డేటా ఆధారిత అల్గోరిథంలను నిర్మించడం, పరిశోధనలో ముందంజలో ఉన్న ఐడియా క్లినిక్స్‌ను ఆయన ప్రశంసించారు. సదస్సులో 500 మందికి పైగా ప్రముఖ వైద్యులు, ప్రొఫెసర్లు, పరిశ్రమ నిపుణులు పాల్గొంటారని ఫౌండర్ డాక్టర్ శ్యామ్ కలవలపల్లి తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అసోసియేట్ డీన్ సారంగ దేవ్, నెఫ్రోప్లస్ స్థాపకుడు విక్రమ్ ఉప్పల, ఐసీఎంఆర్ డైరెక్టర్ డా.హేమలత, ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్ సహాయ్, మధుమేహ రంగంలో ప్రముఖ ప్రొఫెసర్లు, నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా హైదరాబాద్ అభివృద్ధి

సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: నగరాన్ని డ్రగ్‌ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సచివాలయంలో మంత్రి అధ్యక్షతన జిల్లా అభివృద్ధిపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని పాఠశాలల్లో పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. తద్వారా విద్యార్థులకు ఒక భరోసా ఇవ్వగలమని పేర్కొన్నారు. నగరంలో గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, స్కూళ్లలో ఎమ్మెల్యేలు, అధికారులు తనిఖీలు చేపట్టాలని కోరారు. పాఠశాలల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. కొన్ని మెడికల్ షాపుల్లో డ్రగ్స్ సంబంధిత ఔషధాలు బయటపడుతున్నాయని ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేయడంతో అలాంటి మెడికల్ షాపుల్ని వెంటనే సీజ్ చేయాలన్నారు. నగరానికి సంబంధించిన వివిధ అంశాలను క్రోడీకరించి హైదరాబాద్ అభివృద్ధిపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకొని నగర అభివృద్ధి, నియోజకవర్గాల్లోని సమస్యలు, బడ్జెట్‌లో నగరానికి కావాల్సిన నిధులు తదితరాలపై సమావేశంలో చర్చించారు.

త్వరలో సీఎంతో భేటీ..

శాసనసభ బడ్జెట్ సమావేశాల్లోపు రాజకీయాలకు అతీతంగా నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి నగర అభివృద్ధికి వివిధ శాఖల వారీగా చేయాల్సిన పనులు, పెండింగ్ బిల్లులు తదితర అంశాల గురించి వివరించనున్నట్లు చెప్పారు. నగరంలో డెంగీ కేసులు రాకుండా వైద్యాధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, నీటి నిల్వలు లేకుండా జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, శ్రీగణేష్, మహమ్మద్ ముబిన్, కౌసర్ మొహియుద్దీన్, అహ్మద్ బలాల, మాజిద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, ప్రభాకర్‌రావు, మీర్జా రియాజ్ ఉల్ హుస్సేన్, మీర్జా రహమాన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, సీడీపీసీఎల్ ఎండీ ముస్తఫా పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందం సందర్శించింది. సంపూర్ణ ఆరోగ్యం, శ్రేయస్సు కోసం, భారతదేశం–ఆఫ్రికా మిల్లెట్ల సంబంధాలను మరింత పెంపొందించడానికి ఈ బృందం సోమవారం పర్యటించింది.

దక్షిణాఫ్రికా దేశం డర్బన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ క్వాజులు–నాటల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(డీఎస్ఐ–ఎన్ఆర్ఎఫ్) సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇండిజినస్ నాలెడ్జ్ సిస్టమ్స్(సీఐకెఎస్) నుంచి ఈ బృందం వచ్చింది. ఐదుగురు ప్రతినిధి బృందంలో ప్రొఫెసర్ వివియన్ ఓజోంగ్, ప్రొఫెసర్ హసన్‌కయా, ప్రొఫెసర్ యోనా సెలేటి, డాక్టర్ మాయాశ్రీ చిన్నామి, మిస్టర్ తేజ్ మోతిబే ఉన్నారు. ఈ బృందానికి హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు స్వాగతం పలికారు. హెచ్‌సీయూ–క్వాజుల్–నాటల్ విశ్వవిద్యాలయం మధ్య మరింత పరస్పర సహకారం పెంపొందించుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రొఫెసర్ కయా మాట్లాడుతూ మిల్లెట్ రైతుల ఆర్థిక వృద్ధి, సామాజిక అభ్యున్నతికి దోహదపడేలా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారం పరిశోధన, అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు.


దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందంతో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు

ఫిర్యాదులకు స్పందన తప్పనిసరి

జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

- కస్టమర్ కేర్ సెంటర్ ఆకస్మిక తనిఖీ
- వినియోగదారుల కాల్స్ రికార్డింగ్‌పై ఆరా

జూన్‌లో జలమండలి కస్టమర్ కేర్‌కు ఫిర్యాదులు ఇలా

విభాగం	ఫిర్యాదుల సంఖ్య	పరిష్కారం
సీవరేజ్ ఓవర్ ఫ్లో	38,051	38,040
రోడ్డుపై సిల్ట్	7,824	7,824
కస్టమర్ల ఇంటి వద్ద లీకేజీ	17,206	17,196
సీవరేజ్ మ్యాన్‌హోల్స్ డ్యామేజ్	3,190	3,175
పైపులైన్ లీకేజీ	1,770	1,763
కలుషిత నీరు	1,669	1,656
నో వాటర్, లో ప్రెషర్	5,732	5,730
వాటర్ మ్యాన్‌హోల్స్ డ్యామేజ్	113	112


కస్టమర్ కేర్‌ను తనిఖీ చేస్తున్న అశోక్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ ఫిర్యాదులపై ఎండీ అశోక్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఫిర్యాదులపై స్పందన తప్పనిసరిగా ఉండే విధంగా చర్యలకు ఉపక్రమించారు. కస్టమర్ కేర్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వినియోగదారుల నుంచి వస్తున్న కాల్స్, స్పందనను పరిశీలించారు. కాల్ రికార్డింగ్స్ విన్నారు. సీవరేజి ఓవర్ ఫ్లో, మ్యాన్‌హోల్స్, నో వాటర్, లో ప్రెషర్ ఫిర్యాదులపై ఆరా తీశారు. అందుకోసం స్వయంగా కొందరు వినియోగదారులతో మాట్లాడి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. మొత్తం 5,514 ఫీడ్‌బ్యాక్ కాల్స్ తీసుకోగా.. అందులో 3 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకుండానే.. పరిష్కారమైనట్లు చెబుతున్నారని 14 శాతం ఫీడ్‌బ్యాక్ వచ్చింది. అలాంటి వాటి విషయంలో.. క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు వాటిని నేరుగా సందర్శించి పరిష్కారమయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు. వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంతో పాటు కస్టమర్ కేర్ సేవా కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని సూచించారు. సమస్య పరిష్కారమైన తర్వాత వినియోగదారులకు కచ్చితంగా సమాచారం అందించాలని ఆయన ఆదేశించారు. జూన్ నెలలో మొత్తం 75,555 ఫిర్యాదులు రాగా.. అందులో 75,496 సమస్యల్ని పరిష్కరించారు. కార్యక్రమంలో ఐటీ సీజీఎం టీవీ శ్రీధర్, ఐటీ సెల్ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఉండాలి

ఆర్ఈఎస్ఎల్ సీఈఓ మసూద్ మాలిక్



సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ వంటి వాటికి కూడా తగిన ప్రాధాన్యత ఉండాలని రీసస్టైయినబిలిటీ లిమిటెడ్(ఆర్ఈఎస్ఎల్) సీఈవో మసూద్ మాలిక్ కోరారు. కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో ప్రతిపాదించిన గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్‌ను ఉదాహరిస్తూ దాంతో పాటు వనరుల వినియోగాన్ని, వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించుకునేందుకు వీలుగా సర్క్యులర్ ఎకానమీ విధానాలను పాటించే సంస్థలకు ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రభుత్వ విధానాలుంటే పర్యావరణానికి మేలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం బడ్జెట్‌ను ప్రవేశ పెడుతుండటాన్ని పురస్కరించుకొని పర్యావరణానికి సంబంధించి తమ సంస్థ అభిప్రాయాలను వెల్లడించారు. హరిత ఇంధనం వైపు పరివర్తన అనేది అవసరమే అయినా అదొక్కటే సరిపోదని, కర్బన ఉద్గారాల్లో 40–45 శాతం ఉండే మెటీరియల్స్ డీకార్బనైజేషన్‌పై కూడా వ్యూహాత్మక చర్యలుండాలని పేర్కొన్నారు. ఇతరత్రా సంప్రదాయ మెటీరియల్స్‌తో పోలిస్తే తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేసే రీసైకిల్డ్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్, రీసైకిల్డ్ ప్లాస్టిక్స్, కంపోస్టబుల్ మెటీరియల్స్ వంటి మెటీరియల్స్ వినియోగాన్ని ప్రోత్సహించే విధానాలను అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. డిస్పోజల్ అండ్ రీసైక్లింగ్ సహా తమ ఉత్పత్తుల ఎండ్–ఆఫ్–లైఫ్ మేనేజ్‌మెంట్‌కు ఉత్పత్తిదారులు బాధ్యత వహించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని అభిప్రాయపడ్డారు.

వరద సమస్యకు ‘సంపు’లతో చెక్


లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ఎదుట వరద నీటి సంపుల నిర్మాణం

ప్రారంభమైన నిర్మాణ పనులు

- రూ.10 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మాణం
- సంపుల నుంచి సమీప కాల్వల్లోకి పంపింగ్

బంజారాహిల్స్: వరద నీటి సమస్యలకు చెక్ పెట్టేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా దీర్ఘకాలికంగా వేధిస్తోన్న వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాజ్‌భవన్ రోడ్డులోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ ఎదుట సంప్ నిర్మాణం సోమవారం చేపట్టారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలోని మైత్రీవనం హర్షమెస్, లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్, కేసీపీ మెర్క్యూరీ హోటల్ జంక్షన్, అమీర్‌పేట ఇమేజ్ ఆస్పత్రి బాటాషోరూం, ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ తదితర ఆరుచోట్ల 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో కూడిన సంప్‌లను నిర్మించనున్నారు. ఒక్కో సంప్ నిర్మాణానికి రూ.కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చుకానుంది. సంప్ నిర్మాణం కోసం నిధులు కూడా మంజూరయ్యాయి. దాదాపు 3 నెలల కాల వ్యవధిలో వీటి నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సంపుల్లోకి వరద నీటిని మళ్లించిన తర్వాత తిరిగి సంపుల నుంచి నీటిని పైపుల ద్వారా వరద నీటి కాల్వల్లోకి మళ్లించనున్నారు. వీటి నిర్మాణం పూర్తయితే కీలకమైన కూడళ్లలో వరదనీటి సమస్య పరిష్కారం పూర్తవడమే కాకుండా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయాలు వెల్లడించడంతో యుద్ధ ప్రాతిపదికన అధికారులు వీటిని అమలుచేస్తున్నారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం సమన్వయ పర్యటన చేపట్టి సంపుల నిర్మాణ సమయంలో నీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు అడ్డుగా ఉంటే వాటిని షిఫ్టు చేసి పనులు పూర్తయిన తర్వాత రీలొకేట్ చేయాలని నిర్ణయించారు. సంపుల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా జలమండలి తగిన సహకారం అందించేలా నిర్ణయం తీసుకున్నారు. ఆరుచోట్ల సంపుల నిర్మాణం పూర్తయిన తర్వాత ఇటు ట్రాఫిక్ సమస్యకు, అటు వరదనీటి సమస్య నుంచి విముక్తి లభించనుంది. సర్కిల్–17 ఈఈ ఇందిరాబాయి సంపు నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు.

నగరంలో నేడు..

- జాంబాగ్ బాలానంద సంఘం 60వ వార్షికోత్సవ వేడుకలు ఉదయం 10 గంటల నుంచి రవీంద్రభారతిలో జరుగుతాయి. చిన్నారులు పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కట్ట మైసమ్మ అమ్మవారికి బోనాల జాతర జరుగుతుంది. ఉదయం 10.30గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారు.

డబుల్ ఇళ్లు కేటాయించేది కలెక్టర్

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణికి వచ్చిన విన్నపాలను పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ విజ్ఞప్తులను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. కొందరు అర్జీదారులు తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరగా, జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత మాత్రమే తమదని, వాటిని లబ్ధిదారులకు కేటాయించేది జిల్లా కలెక్టర్ అని ఆమె వారికి తెలిపారు.

ఎస్సీ వర్గీకరణలో కేంద్రం నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మాదిగల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి లేఖ రాయడంతో పాటు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై తొలితరం తెలంగాణ ఉద్యమ నాయకురాలు సదాలక్ష్మమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువసేన అధ్యక్షుడు రమేష్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరి వెంకట్, నాయకులు వరిగడ్డి చందు, రాజేష్ కన్నా, శ్రీకాంత్, ఎల్.నాగరాజ్, సందీప్, కార్తీక్, ఫణీంద్ర, బోడ మణి తదితరులు పాల్గొన్నారు.

'రామ కథా యాత్ర'పై డాక్యుమెంటరీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రఖ్యాత ఆధ్యాత్మిక వేత్త మొరారి బాపు ఇటీవల తాను చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ రామకథా యాత్రపై ఒక డాక్యుమెంటరీని విడుదల చేశారు. రెండు రైళ్లలో ఒకదానిలో ప్రయాణించిన బాపు, ఆయన బృందం దీనిని చిత్రీకరించిందనీ, మంచు కప్పేసిన హిమాలయ శిఖరాల మీదుగా పచ్చని లోయలు విశాలమైన సముద్ర తీరాల వరకూ సాగిన ఈ యాత్రలో అనేక ఆధ్యాత్మిక విశేషాలను వీక్షించవచ్చని రూపకర్తలు తెలిపారు. అదే విధంగా బాపు రచించిన జర్నీ విత్ యాన్ ఇన్విజబుల్ పవర్, సాక్రెడ్ స్టోరీస్ ఫ్రమ్ ది 12 జ్యోతిర్లింగాస్ పుస్తకాలు అమెజాన్ ఇండియాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు.



25, 26న స్టైల్ పితార ఫ్యాషన్ ఎగ్జిబిషన్

సుల్తాన్‌బజార్: మహిళా సాధికారత కోసం గత 8 ఏళ్లుగా క్రియేటీవ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో స్టైల్ పితార ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు రమారాటి, వైశాలి ఇనాని, మీనల్ శారద, వినిత బల్దువలు పేర్కొన్నారు. కోఠిలోని కార్యాలయంలో సోమవారం స్టైల్ పితార పోస్టర్‌ను ఆవిష్కరించారు. గృహిణులు వారి ప్రతిభతో తయారు చేసిన ఉత్పత్తులను వారే స్వయంగా స్టాళ్లలో ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా క్రియేటివ్ ఆర్ట్స్ చారిటీ సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు రామ్‌కోఠిలోని కచ్చిభవన్‌లో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సంఘ సేవకురాలు భగవతి మహేష్ బలద్వా, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్వేత అగర్వాల్ ప్రారంభిస్తారన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు ఫ్యాషన్ డిజైనింగ్, పేపర్ స్టాల్స్, ఫుడ్‌స్టాల్స్, గేమ్స్, జువెలరీ, హ్యాండీ క్రాఫ్ట్, ఫుడ్ ఐటమ్స్ 100కుపైగా స్టాళ్లలో ఏర్పాటు చేయనున్నారు.





2 నుంచి దీప్ మేళా..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ వేదికగా ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్ ప్రీమియర్ షాపింగ్ మహోత్సవం – దీప్ మేళా 2024ను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం నిర్వాహక 'దీప్‌శిఖ మహిళా క్లబ్' ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ క్లబ్ 60 సంవత్సరాల వారసత్వంతో మహిళా దాతృత్వ సాంఘిక సంక్షేమ సంస్థగా నిరుపేద మహిళలకు, పేద పిల్లలకు తోడ్పాటునందిస్తుంది. గత 3 దశాబ్దాలుగా వార్షిక నిధుల సేకరణ కోసం ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తుంది. ఎలైట్ జ్యువెలరీ, డిజైనర్ వేర్, హస్తకళలు, జీవనశైలి కళాఖండాలు, గృహోపకరణాలు, చర్మ సంరక్షణ–సౌందర్య ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి.



సెరిమోనియల్ ఒలింపియన్స్...

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ ఫ్యాషన్ రాజధానిగా భావించే ప్యారిస్ వేదికగా భారతీయ సాంప్రదాయ దుస్తులతో మన ఒలింపియన్స్ అలరించనున్నారు. ప్యారిస్ ఒలింపిక్స్ 2024 పోటీల్లో పాల్గొంటున్న భారత క్రీడాకారుల కోసం ఆదిత్య బిర్లా ఆధ్వర్యంలోని 'తస్వా' ఆకర్షణీయమైన సెరిమోనియల్ దుస్తులను రూపొందించారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని.. ఈ దుస్తులకు సంప్రదాయ హంగులద్దేలా రూపకల్పన చేశారు. ఒలింపిక్స్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఈ దుస్తులను యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఆవిష్కరించారు. దేశ సంస్కృతికి ప్రేరణగా.. కుంకుమ, ఆకుపచ్చ, తెలుపు వర్ణాల సమ్మిళితంతో త్రివర్ణ పతాకాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ అందమైన దుస్తులను భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పీటీ ఉష ప్రత్యేకంగా అభినందించారు. టీమ్ ఇండియా జెండా బేరర్ శరత్ కమల్ ఈ దుస్తులను ధరించడం మంచి అనుభూతి అని సంతోషాన్ని వ్యక్తం చేశారు.





వాహ్.. ప్రవల్లిక..

వారాసిగూడ టు అమెరికా

సాఫ్ట్ బాల్ క్రీడ ఆమె జీవితాన్నే మార్చేసింది. నాల్గో తరగతి నుంచే సాఫ్ట్ బాల్ పట్ల మక్కువ పెంచుకున్న ఆమె అంతటితో ఆగిపోలేదు.. నిరంతర సాధనతో ఆ క్రీడపై పట్టు సాధించారు. అంతేకాదు పదో తరగతిలోపే నాలుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. దీంతోపాటు బాల క్రీడాకారుల కోటాలో అంతర్జాతీయ విజ్ఞాన పర్యటనలకు ఎంపికయ్యారు. 2017లో అంతర్జాతీయ విమానం ఎక్కే అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. 20 రోజులు అమెరికాలో పర్యటించే భాగ్యాన్ని దక్కించుకున్నారు. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధన కేంద్రం (నాసా)ను సందర్శించారు సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన ప్రవల్లిక. 15 జాతీయ, రెండు అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆమె కనబరిచిన ప్రతిభ ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని చేజిక్కించుకున్నారు. సాఫ్ట్‌బాల్ వరల్డ్ కప్‌లో గోల్డ్ మెడల్ సాధించడం, సివిల్ సర్వీసెస్‌లో చేరడం వంటి లక్ష్యాలతో కసరత్తు చేస్తున్న ప్రవల్లిక 'సాక్షి'తో పంచుకున్న పలు విశేషాలు...

– సికింద్రాబాద్



- 14 ఏళ్లకే 'నాసా' సందర్శన
- 20 ఏళ్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
- సాఫ్ట్ బాల్‌లో అత్యుత్తమ ప్రతిభ
- 25 జాతీయ, 3 అంతర్జాతీయ పోటీల్లో రికార్డులు

సికింద్రాబాద్ వారాసిగూడలోని ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన నవీన్‌గౌడ్, కవిత దంపతుల కుమార్తె ప్రవల్లిక. నాల్గో తరగతి చదువుతున్న సమయంలోనే క్రీడల పట్ల ప్రవల్లిక ఆసక్తి చూపేది. కుమార్తె ఆసక్తికి తగ్గట్టుగా ప్రోత్సహించిన తల్లిదండ్రులు బాల్యం నుంచే సాఫ్ట్ బాల్ క్రీడలో శిక్షణ ఇప్పించారు. శిక్షణలో చేరింది మొదలు అకుంఠిత దీక్షతో సాధన చేసిన ఆమె క్రమేణ ఉన్నత శిఖరాలు అధిరోహించారు. తను చదువుతున్న సికింద్రాబాద్ సెయింటాన్స్ స్కూల్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణిగా అండర్–17 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రీడాకారిణిగా ఎదిగారు. తెలంగాణ జట్టు తరపున మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో జరిగిన సాఫ్ట్ బాల్ జాతీయ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇప్పటి వరకూ వరుసగా 15 జాతీయ స్థాయి పోటీల్లో దక్షిణ భారత దేశం తరపున పాల్గొని పలు పతకాలు గెలుచుకున్నారు. ఇండోనేషియా, సౌత్ కొరియా దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో భారత్ నుంచి పాల్గొని వెండి పతకాన్ని సాధించారు.



లవ్లీ యూనివర్శిటీ తోడ్పాటు..

నగరంలో ఇంటర్మీడియట్ పూర్తిచేసి దక్షిణాది రాష్ట్రాల నుంచి సాఫ్ట్‌బాల్‌లో రాణిస్తున్న తనను పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ చేరదీసింది. స్పోర్ట్స్ కోటాలో తనకు అన్ని వసతులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే అవకాశాన్ని కల్పించిందని ప్రవల్లిక తెలిపారు. అంతేకాదు తను అక్కడకు వెళ్లిన తర్వాత యూనివర్శిటీ తరపున ఇండోనేషియా, దక్షిణ కొరియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాన్నీ కల్పించారు. ప్రస్తుతం ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు శిక్షణతోపాటు సివిల్స్ పోటీ పరీక్షలకు కోచింగ్ కూడా లవ్లీ యూనివర్శిటీ యాజమాన్యమే ఇప్పిస్తుండడం గమనార్హం.

14 ఏళ్లకే నాసా సందర్శన..

అతి తక్కువ మందికి లభించే అరుదైన నాసా సందర్శన అవకాశం ప్రవల్లికకు 14 ఏళ్ల ప్రాయంలోనే అందివచ్చింది. దేశంలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచే బాలలకు విజ్ఞాన పర్యటనలు ఉంటాయి. ఏ రంగానికి చెందిన బాలలైనా విజ్ఞాన పర్యటనల జాబితాలో చేరడం కోసం రాత పరీక్ష రాయాల్సిందే. ఆ పరీక్షను నెగ్గిన ప్రవల్లిక యూఎస్ఏ ఫ్లోరిడాలోని నాసాను సందర్శించారు. 2017లో అంతర్జాతీయ విమానం ఎక్కి ఏకంగా 20 రోజుల పాటు అమెరికాను చుట్టి వచ్చారు.. నాసా పరిశోధకులు, వ్యోమగాములతో కరచాలనాలు, సంభాషణలు చేసే అరుదైన అవకాశం దక్కడం జీవితంలో గొప్ప అనుభూతి అని ఆమె చెబుతున్నారు.

సివిల్స్, వరల్డ్ కప్ సాధించాలి..

సాఫ్ట్‌బాల్ క్రీడలో ఇప్పటికీ నిరంతర సాధన చేస్తున్నాను. ఉత్తమ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకుంటున్నాను. భారత్ తరపున ప్రపంచ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ కప్ సాధించాలన్నదే లక్ష్యం. కొద్ది నెలల క్రితమే వచ్చిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే.. మరోవైపు సివిల్స్‌కి కూడా ప్రిపేర్ అవుతున్నాను. సివిల్స్ సాధించడం మరో లక్ష్యం. బాల్యంలోనే అమెరికా పర్యటన అవకాశం రావడం నా అదృష్టం. నన్ను ప్రోత్సహించిన అప్పటి రాష్ట్ర మాజీ క్రీడాశాఖ మంత్రి టీ.పద్మారావు గౌడ్, తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కే.శోభన్ బాబు, నవీన్ కుమార్, ఇండియన్ కోచ్ చిన్నాకృష్ణ సహకారంతో ఈ స్థాయికి ఎదిగాను.

–ప్రవల్లిక, సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి



నవంబర్‌లో సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ సీజన్-2

సాక్షి, సిటీబ్యూరో: సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ సీజన్–2 నవంబరు 15, 16 తేదీల్లో నిర్వహించనున్నామని టీసీఏ ఫౌండర్ సాయికృష్ణ తెలిపారు. సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్, అశ్విన్ బాబు, సుశాంత్, ఆది సాయికుమార్, సమ్రాట్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ద రాయల్ చిల్డ్రన్స్ హాస్పిటల్ మెల్బోర్న్ కోసం చారిటీ మ్యాచ్‌లు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీజన్ –1 విజయవంతమైంది. సీజన్–2కి సిద్ధమవుతున్నామని హీరోలు తెలిపారు. చారిటీకి సాయం అందిస్తున్నందుకు అందరికీ సాయి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

బ్యూటీ టెక్‌దే భవిష్యత్తు..

సాక్షి, సిటీబ్యూరో: సౌందర్య పోషణ రంగంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని గ్రూమ్ ఇండియా ప్రముఖ సెలూన్ గ్రూప్ నేచురల్స్ వ్యవస్థాపకులు సీఎండీ సీకే.కుమార్‌వేల్ జోస్యం చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూమ్ ఇండియా సెలూన్ అండ్ స్పాకు నూతన సీఈఓగా సంజయ్ ఎనిశెట్టిని నియమించినట్టు ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. సెలూన్ల భవిష్యత్తును టెక్నాలజీ నిర్దేశించనుందని, కృత్రిమ మేధ రంగప్రవేశంతో ఆవిష్కరణలు పెరిగాయని, బ్యూటీ టెక్ ద్వారా సృజనాత్మక సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ పదవిని చేపట్టక ముందు పలు పేరున్న సంస్థలతో పాటు, హైదరాబాద్ టీ హబ్‌లో సలహాదారుగా సంజయ్ విధులు నిర్వర్తించారు.

హెయిర్ ఫాల్..

- మహిళలను వేధిస్తున్న జుట్టు రాలిపోయే సమస్య
- 71 శాతం మందిలో ఇదే బాధ
- ఒత్తిడి, చుండ్రు, శక్తిహీనత, తదితర కారణాలు
- ట్రాయా సర్వేలో వెల్లడి

వేగంగా మారుతున్న లైఫ్ స్టైల్, మనం తినే ఆహారపు అలవాట్లు, నీరు, వాయు కాలుష్యం, ఉద్యోగం, వ్యాపారం, ఇతర పనుల్లో ఒత్తిడి, నిద్రలేమి, చుండ్రు, పీసీఓఎస్, మాతృత్వం, ఇలా ఎన్నో కారణాల వల్ల పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా జుట్టు రాలిపోవడం సర్వసాధారణంగా కనిపిస్తోంది. ఇటీవల ట్రాయా అనే సంస్థ చేపట్టిన సర్వే ప్రకారం ప్రతి పది మందిలో ఏడెనిమిది మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తేలింది. ఆ వివరాలను పరిశీలిస్తే..

– సాక్షి, సిటీబ్యూరో

జుట్టు రాలడంపై ట్రాయా సంస్థ దేశంలో మొత్తం 2.8 లక్షల మంది మహిళల అభిప్రాయాలు సేకరించింది. అందులో మొత్తం 71.19 శాతం మహిళలు జుట్టు రాలిపోతుందని తెలిపారు. దీనికి గల కారణాలను, వారి అనుభవాలను సైతం పంచుకున్నారు. 36 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసు గల మహిళల్లో 51 శాతం మంది ఈ సమస్యను అనుభవిస్తున్నామన్నారు. దాదాపు ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరికి కేశ సంపద పోతుందని తేలింది. అయితే మహిళలు జుట్టు రాలిపోవడంపై బహిరంగంగా మాట్లాడటానికి సిద్ధంగా లేరని సర్వేలో స్పష్టమైంది.

అనేక కారణాలు

కురులు రాలిపోవడానికి ప్రధానంగా పని ఒత్తిడి, ఆరోగ్యం పరంగా బలహీనంగా ఉండటం, హార్మోన్ హెచ్చుతగ్గులు వంటి కారణాలుగా కనిపిస్తున్నాయి. జుట్టు రాలిపోయే సమస్య ఉన్న మహిళల్లో ఏకంగా 88.6 శాతం మంది తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని స్పష్టమైంది. ఒత్తిడి, అధికంగా ఆందోళన వంటి అంశాలు జుట్టు రాలిపోవడానికి అధికంగా దోహదపడతాయని స్పష్టమయ్యింది. ఈ సమస్య ఎదుర్కొంటున్న వారిలో 48.14 శాతం స్త్రీలు నిద్రలేమితో బాధపడుతున్నారట. కురులు రాలిపోవడానికి చుండ్రు కారణమని 70 శాతం మంది చెబుతున్నారు. అంతే కాకుండా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసు గల మహిళల్లో పీసీఓఎస్ హెచ్చుతగ్గులు కారణంగా కనిపిస్తోంది.

పరిష్కార దిశగా..

'జుట్టు రాలడం అనేది ప్రధానంగా పురుషులు మాత్రమే ఎదుర్కొనే సమస్యగా కాదు. చాలా మంది మహిళలు శిరోజాలు రాలడాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యకు గల కారణాలను తెలుసుకోవడం, సమర్థవంతంగా పరిష్కరించడంలో మా అధ్యయనం సహాయపడాలన్నది లక్ష్యం. – సలోనీఆనంద్, ట్రాయా సహ వ్యవస్థాపకురాలు

సరైన ఆహారం తీసుకోవాలి


జుట్టు రాలిపోవడం ఈ రోజుల్లో సర్వసాధారణం. పోషకాహార లేమి, హార్మోన్లలో మార్పులు, ఒత్తిడితో జుట్టు రాలిపోతోంది. దీర్ఘకాలిక సమస్యలకు వాడే మందులూ దీనికి కారణమే. సరైన డైట్ పాటించి.. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం, పండ్లు తీసుకోవడం ద్వారా సమస్యను అధిగమించవచ్చు. ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ధ్యానం వంటివి మంచిది. – డాక్టర్ గంగా హరీశ్, డెర్మటాలజిస్టు





జుట్టు రాలడానికి ప్రధాన కారణాలు

ఒత్తిడి	23.8 శాతం
చుండ్రు	13.8 శాతం
ప్రసవానంతరం	13 శాతం
పీసీఓఎస్	11.2 శాతం
అజీర్ణం	7.2 శాతం
రక్తహీనత	6.9 శాతం
ఇతర కారణాలు	23.8 శాతం





ఏ వయసు వారిలో ఎందుకు జుట్టు రాలిపోతోంది..

- 18 నుంచి 30 ఏళ్ల వయసు వారిలో ఒత్తిడి, పీసీఓఎస్, చుండ్రు
- 31 నుంచి 40 ఏళ్ల వయసు వారిలో ఒత్తిడి, పీసీఓఎస్, ప్రసవానంతరం
- 40 ఏళ్లు పైబడిన వారిలో ఒత్తిడి, మోనోపాజ్, థైరాయిడ్

ఆయుష్.. నొప్పులు మాయం

నిమ్స్‌లో సహజ వైద్య చికిత్సలు

- మెరుగైన జీవనశైలికి ప్రకృతి వైద్యం
- అలోపతి చికిత్సల చెంతనే
- నిమ్స్‌లో ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు
- ప్రకృతి వైద్యనిపుణురాలు డా.నాగలక్ష్మి

లక్డీకాపూల్: జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులతో నగర ప్రజలు వివిధ రకాల నొప్పులతో సతమతమవుతున్నారు. అవే పెద్ద సమస్యలుగా భావించి చాలా మంది కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. తలనొప్పి, కండరాల, మోకాళ్ల నొప్పులు, మానసిక ఒత్తిడి, విటమిన్స్ లోపం, అధిక బరువు వంటి సాధారణ సమస్యలను కూడా చాలా మంది పెద్ద జబ్బులుగా భావిస్తున్నారు. దీంతో రిఫరల్ ఆస్పత్రి అయిన నిమ్స్ సైతం రోగులతో కిటకిటలాడుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతోనే సహజ సిద్ధమైన వైద్య చికిత్సలతో నొప్పులకు ఉపశమనం కల్పించాలన్న కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ నిమ్స్‌లో ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలోపతి వైద్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం చేస్తూనే.. దేశీయ వైద్యానికి సైతం పెద్దపీట వేస్తున్నారు. సంప్రదాయ వైద్యమైన ఆయుష్ సేవలకు ప్రాచుర్యం కల్పించేందుకు దృష్టిని కేంద్రీకరించింది.



అలోపతికి సమాంతరంగా...

అలోపతి వైద్యానికి సమాంతరంగా ఆయుష్ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు, సీజనల్, ప్రసూతి సమస్యలు, కీళ్ల నొప్పులు తదితర అన్ని రకాల సమస్యలకూ ప్రకృతి వైద్య చికిత్స అందుబాటులో ఉండడమే కాకుండా వ్యాధి మూలాలపై పనిచేసి, పునరావృతం కాకుండా చేయడమే సహజ వైద్య చికిత్సల లక్ష్యమని నిపుణులు పేర్కొంటున్నారు. నగరంలో పెరుగుతున్న కాలుష్యం, ఒత్తిడి స్థాయిలు, ఆందోళన మొదలైన పర్యావరణ మార్పులకు దారితీసింది. అటువంటి సమస్యలను ఎదుర్కోవటానికి ఏకైక మార్గం ప్రకృతి వైద్య చికిత్సలు. సాధారణ నొప్పులతో పాటు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి తక్కువ ఖర్చుకే సహజమైన పద్ధతిలో మెరుగైన సేవలు అందిస్తున్నారు. అలోపతి వైద్య పద్ధతిలో లొంగని వ్యాధులకు సైతం ఆయుష్ ఉపశమనం కల్పిస్తుంది. దీంతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం ఈ సహజ వైద్య చికిత్సల పట్ల ఆసక్తి చూపుతున్నారు.

లోపించిన శారీరకశ్రమ..

మనిషి కూర్చునే భంగిమని బట్టి కూడా ఈ నొప్పులు చోటుచేకుంటాయి. వాస్తవానికి ఇటీవల కాలంలో శారీరశ్రమ లోపించింది. చెప్పాలంటే.. శరీరాన్ని సరిగ్గా ఉపయోగించుకోవడం లేదు. విటమిన్ల లోపం వల్ల కొంత మంది ఇబ్బంది పడుతుంటే పోషకాహార లోపం వల్ల మరికొంత మంది అనారోగ్యం పాలవుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ప్రకృతి వైద్యం పట్ల అవగాన కల్పిస్తూ.. భవిష్యత్తులో వారు ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురికాకుండా చూసేందుకే ఈ ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్ కృషి చేస్తుంది.

– డా.నాగలక్ష్మి, ప్రకృతి వైద్యనిపుణురాలు



నామమాత్రపు రుసుము..

పంచకర్మ చికిత్సల్లో భాగంగా స్నేహకర్మ, నదిస్వేదం, పిండి స్వేదం, కతివస్తి, జనువస్తి, నాశ్యకర్మ, శిరోధార, డెటాక్స్ థెరపీ, బరువు నియంత్రణ, మానసిక ఒత్తిడి నిర్మూలన, బాడీ మసాజ్, మైగ్రేన్ వంటి సేవలతో పాటు ప్రకృతి వైద్య సేవల్లో భాగంగా జనరల్ మసాజ్, స్టీమ్‌బాత్, డైట్ కౌన్సిలింగ్, కోల్డ్ బ్లాంకెట్ ప్యాక్, తల, కండరాలు, నడుం, భుజాలు, మోకాళ్ల నొప్పులకు చికిత్సలు అందిస్తుంది. ఆక్యుపంక్చర్, యోగ వంటి సేవలను కూడా అందుబాటులో ఉంచింది. రోగులు ఎదుర్కొంటున్న సమస్యను బట్టి చికిత్సను అందిస్తుంది. ఎంపిక చేసుకున్న చికిత్స, సేవలు, సిట్టింగ్ ఆధారంగా నామమాత్రపు రుసుమును వసూలు చేస్తున్నారు. చికిత్స పొందాలంటే ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలి. వాస్తవానికి సహజ వైద్య చికిత్సలను ప్రణాళికబద్ధంగా అనుసరించాల్సిందే. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఒక స్లాట్‌గా, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదున్నర గంటల వరకూ మరో స్లాట్‌గా నిర్ణయించారు.

పోలీసుల అతిపై జగన్ ఆగ్రహం

- హత్యా రాజకీయాలను నిరసిస్తూ నల్ల కండువాలతో అసెంబ్లీ వరకు వైఎస్సార్‌సీపీ సభ్యుల నిరసన ర్యాలీ
- గేటు వద్ద విపక్ష సభ్యులను అడ్డుకుని ప్లకార్డులు చించేసిన పోలీసులు
- మీకు ఆ అధికారం ఎవరు ఇచ్చారంటూ నిలదీసిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: శాసనసభ గేటు వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని పోలీసులు ప్లకార్డులు లాక్కుని చించి వేయడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలని అడ్డుకునే అధికారం మీకు ఎవరిచ్చారు? ప్లకార్డులు లాక్కుని చించేసే అధికారం ఎవరు ఇచ్చారు? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, శాంతి భద్రతలు మచ్చుకైనా కనిపించడం లేదని ధ్వజమెత్తారు. చట్టప్రకారం పని చేసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పోలీసులకు సూచించారు. పోలీసుల జులుం ఎల్లకాలం చెల్లబోదని, ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. 'మీ టోపీపై మూడు సింహాలు ఉన్నది అధికారంలో ఉన్న వారికి సెల్యూట్ కొట్టడానికి కాదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి..' అని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ప్లకార్డులు లాక్కుని చించి వేసిన పోలీసు అధికారినుద్దేశించి పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఇంతలో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయం ఆసన్నమవడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులను అసెంబ్లీ ప్రాంగణంలోకి పోలీసులు అనుమతించారు. చివరిలో వైఎస్ జగన్ అసెంబ్లీ ప్రాంగణంలోకి అడుగుపెట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగిస్తున్న హత్యా రాజకీయాలు, అరాచకపాలన, దారుణకాండను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిసి మెడలో నల్ల కండువా ధరించి అసెంబ్లీ వరకూ వైఎస్ జగన్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను వినుకొండలో నడిరోడ్డుపై టీడీపీ కార్యకర్త హత్య చేసిన ఫొటోలతోపాటు రాష్ట్రంలో టీడీపీ కూటమి అరాచకాలను ప్రతిబింబించే ఫొటోలతో ప్లకార్డులను ప్రదర్శించారు. 'సేవ్ డెమోక్రసీ.. హత్యా రాజకీయాలు నశించాలి.. వి వాంట్ జస్టిస్' అని నినాదాలు చేస్తూ ర్యాలీగా అసెంబ్లీ గేటు వద్దకు చేరుకున్నారు.

రేపు ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ ధర్నా

రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న ఆటవిక పాలనను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంసిద్ధమైంది. ఇందులో భాగంగా.. ఈనెల 24న ఢిల్లీ వేదికగా ధర్నా నిర్వహించి రాష్ట్రంలో సాగుతున్న అరాచకాలపై గళమెత్తాలని పార్టీ నిర్ణయించింది. ఇదిలా ఉంటే.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉ.9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి ఢిల్లీ వెళ్తారు. మూడ్రోజులపాటు అక్కడే ఉంటారు. ఈనెల 24న ధర్నాలో పాల్గొంటారు. ఇక ఈ ధర్నాకు అన్ని రాజకీయ పార్టీలను కూడా ఆహ్వానించారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

హత్యా రాజకీయాలకు నిరసనగా సభ నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్


నల్ల కండువాలు ధరించి వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిసి అసెంబ్లీకి ర్యాలీగా వస్తున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కూటమి సర్కారు హత్యా రాజకీయాలపై శాసనసభ సాక్షిగా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నిగ్గదీసింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సోమవారం అసెంబ్లీ వేదిక నిరసన గళం విప్పింది. ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తింది. దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలు నశించాలని ఎలుగెత్తింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో యథేచ్ఛగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాత్మక ఘటనలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళన నిర్వహించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల దారుణ వైఫల్యానికి నిరసనగా మెడలో నల్ల కండువాలు ధరించి ఉభయ సభల సంయుక్త సమావేశానికి హాజరయ్యారు. టీడీపీ మూకల హింసకు నిదర్శనంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీగా ఉదయం అసెంబ్లీలోకి ప్రవేశించారు.

హత్యా రాజకీయాలకు నిరసనగా వాకౌట్

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగాన్ని ప్రారంభిస్తున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి స్థానాల్లో నిలుచుని ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, సేవ్ డెమోక్రసీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరి నిరసనల మధ్యనే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. అనంతరం విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లారు. పోడియం ముందు ఫ్లోర్ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ హత్యా రాజకీయాలకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

రెడ్ బుక్‌దే రాజ్యం..

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రదర్శించిన ప్లకార్డులు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులకు అద్దం పట్టాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేత మొదలుకుని హత్యలు, అత్యాచారాలు, వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తుల విధ్వంసం తదితర హింసాత్మక ఘటనలకు సంబంధించిన ఫొటోలను ప్లకార్డుల్లో ప్రదర్శించారు. వినుకొండలో నడి రోడ్డుమీద వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీకి చెందిన జిలాని అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటనకు సీఎం చంద్రబాబుదే బాధ్యతని ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రంలో రాజ్యాంగం కనిపించడం లేదని, రెడ్ బుక్ రాజ్యమేలుతోందని నినదించారు.

ప్రముఖ కాలేజీల్లో గుట్టుగా గంజాయి

- తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రకటన
- పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డట్లు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 15 మంది విద్యార్థులతోపాటు కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియాకు చెందిన నలుగురు, సీబీఐటీలో ఒకరు, బాసర ట్రిపుల్ ఐటీకి చెందిన కొందరు, జేఎన్‌టీయూ (జోగిపేట్)లో ముగ్గురు, సింబయోసిస్ కాలేజీకి చెందిన 25 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. అలాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ఆరుగురు జూనియర్ డాక్టర్లు గంజాయి తాగుతూ పట్టుబడ్డారని.. వారిపై చర్యలు తీసుకోవాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాశామన్నారు. ఇండస్ స్కూల్ విద్యార్థులకు కోడ్ పేర్లతో ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న అహ్మద్, జాఫర్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా వారి వివరాలు వెల్లడించలేకపోతున్నామని పేర్కొన్నారు. ఆయా విద్యార్థులను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. సాంకేతిక సహకారం, నిఘా వర్గాల నుంచి సేకరిస్తున్న సమచారంతో విజయవంతంగా మత్తుపదార్థాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిఘా పెంచాం..

రాష్ట్రంలోని పబ్బుల్లో మత్తుపదార్థాల వాడకంపై నిఘా పెంచినట్లు టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఇటీవలే హెచ్ఐసీసీ నోవాటెల్‌లోని ఆర్బిస్ట్రీ పబ్‌లో డ్రగ్స్ సేవిస్తున్న ముగ్గురు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కేవ్ పబ్‌లో ఫారెస్ట్ ఆల్‌కెమీ పేరిట నిర్వహించిన పార్టీలో పాల్గొన్న 52 మందికి పరీక్షలు నిర్వహించగా 33 మంది గంజాయి, కొకైన్, ఎండీఎంఏ వాడినట్లు నిర్ధారణ అయిందన్నారు. హైదరాబాద్‌లో తరచూ ఈవెంట్లు నిర్వహిస్తున్న డీజేల వివరాలను సేకరించినట్లు సందీప్ శాండిల్య తెలిపారు. పబ్బుల్లో 21



ఏళ్లలోపు యువతకు మద్యం సరఫరా చేస్తున్నారా లేదా అనే దానిపైనా నిఘా పెట్టాలని, ఆధార్ కార్డులను తనిఖీ చేసి వయసు నిర్ధారించాలని యూనిట్ అధికారులకు సూచిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్ వాడకాన్ని నిరోధించేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ విద్యాసంస్థలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నామని తెలిపారు. మత్తుపదార్థాలకు బానిసలైన వారిని అందులోంచి బయటపడేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

80 శాతం గంజాయి ఒడిశా నుంచే..!

ఏపీ, తెలంగాణలోకి రవాణా అవుతున్న గంజాయిలో 80 శాతం వరకు ఒడిశా నుంచే వస్తోంది. ఒడిశాలో సాగుచేసి రవాణా చేస్తున్న గంజాయి ప్రధానంగా ఖమ్మం జిల్లా సరిహద్దు నుంచే తెలంగాణలోకి వస్తున్నట్లు వెల్లడించాయి. డ్రగ్స్, గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం ఆదేశించడంతో రాష్ట్ర సరిహద్దులో మరింత నిఘా పెంచామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

రుణమాఫీ సభకు అతిథిగా రండి

- రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్ ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన వాగ్దానం మేరకు రాష్ట్రంలో రుణమాఫీని అమలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ పెద్దలకు తెలిపారు. తొలిదఫాలో రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేయగా మిగతా రుణాల మాఫీని ఆగస్టు 15లోగా చేయనున్నట్లు వివరించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న దృష్ట్యా వరంగల్‌లో కృతజ్ఞత సభను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి.. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రులతో, పార్టీకి సంబంధించిన అంశాలపై హై కమాండ్ పెద్దలతో చర్చించేందుకు సీఎం ఆదివారం ఢిల్లీకి వచ్చిన సంగతి తెలిసిందే. కాగా సోమవారం భట్టి, ఉత్తమ్‌తో కలిసి రాహుల్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, ప్రియాంక గాంధీలతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో రుణమాఫీ తొలి విడతలో 11.5 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా సుమారు రూ.7వేల కోట్లు వారి ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. మరో రూ.24 వేల కోట్లు ఆగస్టు 15 లోగా రైతుల ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రధాన హామీలన్నింటినీ ఇప్పటికే అమల్లో పెట్టామని, రుణమాఫీ హామీని నిలబెట్టుకోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసం పెరిగిందని తెలిపారు. కాగా వీరి ఆహ్వానంపై స్పందించిన రాహుల్‌గాంధీ.. పార్లమెంటు సమావేశాల దృష్ట్యా వీలు చేసుకుని వస్తానని, లేనిపక్షంలో ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే ఎవరైనా ఒకరు హాజరవుతారని చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా కేంద్ర మంత్రులు, అధిష్టానం పెద్దలతో భేటీ అనంతరం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు మీడియాతో మాట్లాడారు.

తెలంగాణకు రావాలని కోరాం: భట్టి

రాహుల్, ప్రియాంక గాంధీలను రాష్ట్రానికి రావాల్సిందిగా కోరినట్లు భట్టి తెలిపారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ, గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్తు, రైతు రుణ మాఫీ గురించి వివరించామన్నారు.

రాజకీయ అంశాలపై చర్చించాం: ఉత్తమ్

రాష్ట్రానికి సంబంధించిన రాజకీయ పరమైన అంశాలపై అధిష్టానం పెద్దలతో చర్చించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర నుంచి రావాల్సిన నిధుల విడుదలకు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశామని చెప్పారు.

కేసులో సీఎం ఉంటే బదిలీ చేయాలా?

ఓటుకు కోట్లు కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నంత మాత్రాన ఆ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సాక్షులను ప్రభావం చేయడం, కేసు ప్రభావితం కావడం వంటివి లేనప్పుడు బదిలీ ఎలా కోరతారని ప్రశ్నించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసులో నిందితుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ఈ నేపథ్యంలో దర్యాప్తును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలంటూ బీఆర్‌ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు ప్రారంభిస్తూ రిజాయిండర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని కోరారు. ఈ సమయంలో జస్టిస్ బీఆర్ గవాయి జోక్యం చేసుకొని 'కేసులో ముఖ్యమంత్రి ఉంటే బదిలీ చేయాలా? భారత దేశంలో ప్రాపర్టీకి సంబంధించి సమస్య ఉంటే పాకిస్తాన్‌కు బదిలీ చేయమని అడుగుతారా? న్యాయ వ్యవస్థకు బలం లేదనుకుంటున్నారా? ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు?' అని చెప్పారు. అనంతరం పిటిషనర్ల విజ్ఞప్తి మేరకు రిజాయిండర్ దాఖలుకు రెండు వారాలు గడువునిస్తూ ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

17,877 ఖాతాలకు రుణమాఫీ జరగలేదు

- సాంకేతిక కారణాలతోనే ఈ పరిస్థితి: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: మొదటి విడత రుణమాఫీ సందర్భంగా కొన్ని సాంకేతిక కారణాలతో 17,877 ఖాతాలకు చెందిన రూ. 84.94 కోట్లు రైతుల అకౌంట్లలో జమ కాలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ సూచించిన వివరాల ప్రకారం ఆయా రైతుల ఖాతాల్లో సాంకేతిక సమస్యలను సరిచేసి, ఆర్‌బీఐ నుంచి నిధులు వెనక్కి రాగానే తిరిగి ఆయా ఖాతాలకు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. రుణమాఫీలో మొదటి విడతగా రూ.లక్ష లోపు రుణాలకు సంబంధించి 11.50 లక్షల కుటుంబాలకు రూ. 6,098.94 కోట్లు విడుదల చేశామన్నారు. వీటిలో ఆర్‌బీఐ నుంచి అందిన సమాచారం మేరకు 11.32 లక్షల కుటుంబాలకు రూ. 6,014 కోట్లు జమ అయిందన్నారు. వాణిజ్య బ్యాంకులకు అనుసంధానం చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సీడెడ్ సంఘాలు)కు సంబంధించి మిగిలిన కొన్ని రుణ ఖాతాల (15,781) తనిఖీ సోమవారంతో పూర్తవుతుందని, పూర్తయిన వెంటనే ఆ ఖాతాలకు కూడా రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని తెలిపారు. రెండో విడత రుణమాఫీని సాధ్యమైనంత త్వరగా అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రూ.500 కోట్లతో తెలంగాణ ఫ్యూచరిస్టిక్ కేంద్రం: శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఫ్యూచరిస్టిక్ ఎక్స్‌పీరియన్స్ కేంద్రం ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రాధాన్యత అంశంగా పరిశీలిస్తోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. దీని ఆవిష్కరణకు ఖర్చయ్యే రూ.500 కోట్ల నిధులను సమకూర్చేందుకు ఏదైనా వాణిజ్య సంస్థ ముందుకొస్తే ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వపరంగా నిధుల సమీకరణను కూడా పరిశీలిస్తామని చెప్పారు. సోమవారం సచివాలయంలో ఫ్యూచరిస్టిక్ కేంద్రంపై కొందరు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి ఆసక్తిగా తిలకించారు. భారీ మాల్ తరహాలో ఉండే ఈ కేంద్రంలో సమావేశ మందిరాలు, సినిమా ప్రదర్శన ఏర్పాట్లతో పాటు తెలంగాణ ఘన చరిత్ర, సాధించిన అభివృద్ధి, భవిష్యత్తు గమ్యాల గురించిన అవగాహన కల్పించే విభాగాలు ఉంటాయని శ్రీధర్‌బాబు వెల్లడించారు. పర్యాటకులను కూడా ఈ కేంద్రం విశేషంగా ఆకర్షిస్తుందని ఆయన తెలిపారు. ప్రెజెంటేషన్ కార్యక్రమంలో సీఎస్ఆర్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీరంగారావు, సుమన్ వల్లపురెడ్డి, హన్మంతరెడ్డి, పునీత్, శ్రీకాంత్ పరమాత్ముని, సునీల్ లడ్డా తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్షలు ఆవిరి!

- ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికిప్పుడు అమలు చేయలేం
- ఉభయసభలను ఉద్దేశించి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం



సాక్షి, అమరావతి: "రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆకాంక్షలతో ఎన్డీఏ కూటమికి బలమైన తీర్పునిచ్చారు. కానీ ఇప్పటికిప్పుడు వారి ఆకాంక్షలు (హామీలు) నెరవేర్చే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు. ఉద్యోగులు, పింఛన్‌దారులకు బకాయిల చెల్లింపులతో పాటు రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సాయం అందించాలి. లేకుంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో వనరుల సమీకరణ, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం చాలా కష్టం, సంక్లిష్టం. సంక్షోభాన్ని అధిగమించే మార్గాలను అన్వేషించాల్సి ఉంది. మేధావులు, విద్యావేత్తలతో విస్తృతమైన చర్చలు జరపాలి. అందుకే అర్థవంతమైన చర్చల తర్వాతే పూర్తి స్థాయి బడ్జెట్‌కు వెళ్లాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలి" అని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీ హాలులో ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు.

హామీలపై నిలదీస్తారనే పూర్తిస్థాయి బడ్జెట్‌పై 'భయం'

ఈ ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనిపిస్తోంది: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి సర్కారు పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అడుగడుగునా భయంతో సీఎం చంద్రబాబు విల విలలాడిపోతున్నారని చెప్పారు. ఆ భయాన్ని పోగొట్టుకోవడానికి, ప్రజల్లో భయోత్పాతం సృష్టించేందుకు హింసాకాండను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, అందుకే ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనబడుతోందని చెప్పా రు. ప్రజల దృష్టి మళ్లించేందుకు అరాచకాలను ప్రో త్సహిస్తూ భయానక వాతావరణాన్ని కల్పిస్తున్నార ని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఎక్కువ రో జులు మనుగడ సాగించేలా కనపడటం లేదన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే..

హామీలపై నిలదీస్తారనే భయంతో...

కేవలం 50 రోజుల్లోనే ఈ ప్రభుత్వం అన్నిటా వైఫల్యం చెందింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ అరాచక పాలనపట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. అందుకే ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనబడుతోంది. ఈ ప్ర భుత్వం ఎంతగా భయపడుతోందంటే.. ఈ ఏడాది కనీసం పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేక పోతోంది. దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్రం ఏడాదిలో 7 నెలలు ఓట్ ఆన్ అక్కౌంట్ మీదే నడుస్తుందంటే ప్రభుత్వానికి ఎంత భయం ఉందో అర్థమవు తోంది. ఎన్నికల ముందు ప్రజలను మోసం చేసి మభ్యపుచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే చంద్రబాబు ఎంతగా భయపడుతున్నారంటే.. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఆ హామీలను అమలు చేయ లేమన్న గుట్టు బయట పడుతుందన్న భయం నెల కొంది. ఎన్నికల్లో ఇచ్చిన మోసపూరిత హామీలను అమలు చేయని పరిస్థితిలో ప్రజలు ఎక్కడ ప్రశ్ని స్తారో అన్న భయం ఆయన్ను ఆవరించింది. అందు కే ప్రజల దృష్టిని మళ్లించి అరాచకాలను ప్రోత్సహించడం ద్వారా భయానక పరిస్థితులు కల్పిస్తున్నారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసం.. వీటన్నింటి ద్వారా ఎవరూ తనను ప్రశ్నించే సాహసం చేయకూడదనే పరిస్థితి సృష్టిస్తున్నారు.

అసెంబ్లీలో హక్కుగా మైక్ ఇస్తే..: ప్రస్తుతం అసెంబ్లీలో రెండే పక్షాలున్నాయి. ఒకటి అధికార పక్షం. మరొకటి ప్రతిపక్షం. ప్రతిపక్షంగా ఒకే పార్టీ ఉంది కాబట్టి ఆ పార్టీనే విపక్షంగా గుర్తించాలి. ఆ పార్టీ నాయకుడినే ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించాలి. అయితే ఆ పని చేస్తే అసెంబ్లీలో కూడా ప్రశ్నిస్తారన్న భయంతో చంద్రబాబు ఉన్నారు. ప్రతి పక్ష పార్టీని, ప్రతిపక్ష నేతను చట్టబద్ధంగా గుర్తిస్తే ప్రజా సమస్యలు ప్రస్తావించేందుకు అసెంబ్లీలో ఒక హక్కుగా మైక్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అసెంబ్లీలో హక్కుగా మైక్ ఇస్తే ప్రజల తరఫున సభలో చంద్రబాబు ప్రభుత్వాన్ని విపక్షనేత ఎండగడతారని, వారి నిజ స్వరూపం ప్రజలకు తెలుస్తుందన్న భయంతో ఈ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నాయకుడిని గుర్తించడం లేదు.

ఢిల్లీ వేదికగా అరాచకాలను ఎండగడతాం..: ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా చంద్రబాబు ఇన్ని భయాలతో పరిపాలన చేస్తున్నాడు. అచ్చం శిశుపాలుడి పాపాల మాదిరిగా చంద్రబాబు నాయుడి పాపాలు కూడా వేగంగా పండే రోజు దగ్గ ర్లోనే ఉంది. నాతోపాటు మా పార్టీకి చెందిన ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు ఢిల్లీ వేదిక గా ఈ అరాచకాలను ఎండగడతాం. రాష్ట్రంలో జరు గుతున్న అరాచక పాలన, హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడిని 24వ తేదీన ఫోటో గ్యాలరీ, నిరసన కార్యక్రమాల ద్వారా వివిధ పార్టీ నాయకు ల దృష్టికి, దేశం దృష్టికి తీసుకొస్తాం. ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరాన్ని, పరి స్థితులను వివరిస్తాం. ఈ కార్యక్రమంలో మాతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకొని పోరాటం కొనసాగిస్తాం.


మూడు నెలల్లో ఆరులేన్ల విస్తరణ పనులు: కోమటిరెడ్డి


అనురాగ్‌జైన్‌తో కోమటిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్- విజయవాడ ఆరులేన్ల రహదారి విస్తరణ పనులు మూడు నెలల్లో ప్రారంభమవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే భూసేకరణ పూర్తయిందన్నారు. రహదారి నిర్మాణానికి సంబంధించి జీఎంఆర్ సంస్థ కాంట్రాక్ట్ రద్దు అయ్యిందని, కొత్త కంపెనీకి రెండు నెలల్లో టెండర్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఏడాదిన్నరలోనే ఈ ఆరులేన్ల రహదారి పనులు పూర్తవుతాయన్నారు. సోమవారం జాతీయరోడ్లు, రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో కోమటిరెడ్డి భేటీ అయ్యారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్‌కు సంబంధించి మిగిలిన 50శాతం భూసేకరణ వచ్చే మూడునెలల్లో పూర్తిచేసి, పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 16 ప్రధానమైన రహదారులను జాతీయ రహదారులుగా మార్చే ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. హైదరాబాద్-విజయవాడ రహదారిని ఆరులేన్ల రహదారిగా మార్చాలనేది తన కృషేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు.. ఆ రహదారి విషయంపై చర్చించారని, ఆయన దీనిని తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా తెలుస్తోందన్నారు.

తెలంగాణ సంపదను దోచుకునేందుకు బాబు, రేవంత్ కుట్ర

అడ్డుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల పిలుపు


గాదె ఇన్నయ్య

పంజగుట్ట (హైదరాబాద్): చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు కలిసి మరోమారు తెలంగాణ సంపదను దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని, యావత్ తెలంగాణ సమాజం ఏకమై వీరి కుట్రలను అడ్డుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో 'విభజన ఒప్పంద చట్టం.. కుట్ర- ఆధిపత్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక ప్రతినిధులు గాదె ఇన్నయ్య, పాశం యాదగిరి, తెలంగాణ విఠల్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పలు ప్రజా, కుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాదె ఇన్నయ్య మాట్లాడుతూ, విభజన ఒప్పంద హామీల పేరుతో గురుశిష్యులు ప్రజాభవన్‌లో కలుసుకున్నారని.. కానీ వారు విభజన చట్టంలోని 9, 10వ షెడ్యూల్డ్‌లోని ఏ అంశాలు ప్రస్తావించలేదని పేర్కొన్నారు. ఢిల్లీలో మాదిరి హైదరాబాద్‌లో కూడా ఆంధ్రప్రదేశ్ భవన్‌కు స్థలం కేటాయించాలని బాబు అడగడం, రేవంత్ ఒప్పుకోవడం జరిగిందని, తెలంగాణ ఎవరబ్బ జాగీరని స్థలాలు కేటాయిస్తారని ప్రశ్నించారు. పాశం యాదగిరి మాట్లాడుతూ.. అక్కడ సీఎం, ఇక్కడ సీఎం ఇద్దరూ ఓటుకు నోటు కేసులో ఏ వన్, ఏ టూ ముద్దాయిలే అని అన్నారు. బెల్లిలలిత లాంటి తెలంగాణ ఉద్యమకారులను చంపించింది, గద్దర్‌పై కాల్పులు జరిపించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.

విన్నపాలు వినవలె

'మూసీ అభివృద్ధి'కి రూ.10 వేల కోట్లు కేటాయించండి

- ఈసారైనా జల్ జీవన్ మిషన్ నిధులు ఇవ్వండి
- గ్యాస్ సబ్సిడీని ముందుగానే చెల్లించే అవకాశం కల్పించండి
- పౌరసరఫరాల శాఖ బకాయిలు వెంటనే విడుదల చేయండి
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి


ఢిల్లీలో సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో వేర్వేరుగా భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి సహా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. నిధులు విడుదల చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్‌దీప్ సింగ్ పూరి, ప్రల్హాద్ జోషిలతో సీఎం సమావేశమయ్యారు.

మూసీ సుందరీకరణపై రాష్ట్ర సర్కారు దృష్టి

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద మొత్తం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని దేశంలో మరెక్కడా లేని విధంగా తీర్చిదిద్దడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని తెలిపారు. మూసీ సుందరీకరణతో పాటు దానిలో చేరే మురికినీటి శుద్ధికి, వరద నీటి కాల్వల నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు, గోదావరి జలాలతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను నింపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ రెండు చెరువులను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు తీరడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి తోడ్పడుతుందని వివరించారు.

నల్లా కనెక్షన్లకు రూ.16,100 కోట్లు అవసరం

జల్ జీవన్ మిషన్ కింద తెలంగాణకు నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. 2019 లెక్కల ప్రకారం జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్రంలో 77.60 శాతం ఇళ్లకు నల్లా నీరు అందుతోందని, అయితే ఇటీవల తాము చేపట్టిన సర్వేలో 7.85 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని తేలిందని వివరించారు. ఆ ఇళ్లతో పాటు పీఎంఏవై అర్బన్, రూరల్ కింద చేపట్టే ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, ఇందుకు మొత్తం రూ.16,100 కోట్లు అవసరమని తెలిపారు. జల్ జీవన్ మిషన్ 2019లోనే ప్రారంభించినా నేటి వరకు రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, ఈ ఏడాది నుంచైనా నిధులు విడుదల చేయాలని కోరారు.

సిలిండర్‌కు రూ.500 చెల్లించేలా చూడండి

తెలంగాణలో రూ.500కే గ్యాస్ సరఫరాకు సంబంధించిన సబ్సిడీని ముందుగానే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీ) చెల్లించే సదుపాయాన్ని కల్పించాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీని సీఎం కోరారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా తమ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తోందని తెలిపారు. అయితే వినియోగదారులు సిలిండర్‌కు పూర్తిగా డబ్బులు చెల్లించిన తర్వాత సబ్సిడీ అందుతుండడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. కాబట్టి సబ్సిడీని ముందుగానే ఓఎంసీలకు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అప్పుడు వినియోగదారులు రూ.500 మాత్రమే చెల్లించి సిలిండర్ తీసుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. ఒకవేళ అలా వీలుకాని పక్షంలో 48 గంటల్లోపు సబ్సిడీ మొత్తం వినియోగదారులకు అందేలా చూడాలని కోరారు.

బియ్యం బకాయిలు విడుదల చేయండి

ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రల్హాద్‌జోషిని రేవంత్‌ కోరారు. 2014–15 ఖరీఫ్ కాలంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ.1,468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని చెప్పారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987.730 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లు విడుదల చేయాలని కోరారు. అలాగే 2021 మే నుంచి 2022 మార్చి వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు కూడా వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, సురేష్ షెట్కార్, అనిల్‌కుమార్ యాదవ్, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

కోరినన్ని వర్షాలు కురుస్తాయి..



భవిష్యవాణి వినిపిస్తున్న స్వర్ణలత. చిత్రంలో మంత్రి పొన్నం

స్వర్ణలత భవిష్యవాణి..

ప్రజలందరినీ బాగా చూసుకుంటా

పంటలకు రసాయనాలు తగ్గించుకోండి

ముగిసిన ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్(హైదరాబాద్): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు సోమవారంతో అంగరంగ వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో రెండో ఘట్టమైన రంగం కార్యక్రమంలో భాగంగా ఉదయం 9.55 గంటల సమయంలో అమ్మవారి గర్భగుడికి ఎదురుగా ఉండే మాతంగేశ్వరి గుడి ముందు పచ్చికుండపై నిలబడి స్వర్ణలత భవిష్య వాణి వినిపించారు. 'ఈ ఏడాది భక్తులు సమర్పించిన బోనాలు, సాక, పూజలు నాకు ఆనందాన్నిచ్చాయి. కోరినన్ని వర్షాలు కురుస్తాయి. నా ప్రజలందరినీ బాగా చూసుకుంటా, నన్ను నమ్ముకున్న వారిని నేను కాపా డుకుంటా. నా రూపాన్ని పెట్టాలనే సంకల్పాన్ని నెరవేర్చుకుంటా. నాకు శాశ్వత రూపం పెట్టాలని చూస్తున్నారు అది చేయండి, నాకు రక్తబలిని ఇవ్వడం లేదు. మీకు నచ్చింది ఇస్తున్నారు. దాంతోనే నేను సంతోషంగా ఉన్నాను. అదే చాలు. 5 వారాలపాటు పప్పు, బెల్లంతో సాక పెట్టండి. పంటల్లో ఎక్కువ రసాయనాలు వాడుతున్నారు, వాటితో రోగాలు పెరిగిపోతున్నాయి, వాటిని తగ్గించుకోండి. పిల్లలు, గర్భిణీలకు ఏ ఇబ్బంది రానివ్వను. అంద రినీ సంతోషంగా ఉండేలా చూసుకుంటా ను'అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమి షనర్ హన్మంతరావు, కలెక్టర్ అనుదీప్ దురి శెట్టి, ఈవో మనోహర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారికి సాగనంపు..: బోనాలు, రంగం అనంతరం అమ్మవారి సాగనంపు కార్యక్రమాన్ని ఘనంగా చేప ట్టారు. అమ్మవారిని అంబారీపై ఉంచి, అమ్మవారి ఘటంతో సాగనంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనితో జాతర ముగిసింది.

కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లు భారీగా కోరుతున్న సర్కారు

ఈ రెండూ అటూ ఇటూ అయితే రాష్ట్ర బడ్జెట్ అంచనాలు తారుమారు!

ట్రిపుల్ ఆర్, పాలమూరు–రంగారెడ్డి, మూసీ సుందరీకరణ తదితర అంశాల్లో కేంద్ర వైఖరి ఎలా ఉంటుందోనన్న చర్చ

ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ లాంటి భారాల నుంచి ఉపశమనానికి సాయం అవసరమంటున్న ఆర్థిక శాఖ వర్గాలు



కేంద్ర పద్దుపై కోటి ఆశలు..

తెలుగింటి కోడలు 'పదేళ్ల పెండింగ్' పట్టించుకుంటారా?

రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో ఉత్కంఠ

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను (2024–25) కేంద్రం మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. కారణాలేవైనా గత పదేళ్లుగా తెలంగాణ అవసరాలు, అభ్యర్థనలను పెడచెవిన పెట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఈసారి బడ్జెట్‌లోనైనా రాష్ట్రానికి వరాలు కురిపిస్తుందని ఆశిస్తోంది. కేంద్ర ప్రభుత్వంతో సమాఖ్య స్ఫూర్తితో వ్యవహరిస్తామని చెపుతున్న తమకు ఏ మేరకు సాయమందుతుందోననే ఉత్కంఠ రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, రీజనల్ రింగు రోడ్డు, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, ఐటీఐల ఆధునీకర ణకు ప్రత్యేక ఆర్థిక సాయం, నికర అప్పుపై సీలింగ్, ఆఫ్ బడ్జెట్ (బడ్జెటే తర) రుణాలపై పరిమితులు, మూసీ సుందరీకరణకు నిధులు, సెస్ తగ్గింపు, ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణ లాంటి కీలక అంశాల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఈసారి ఎలా ఉంటుందోనన్న చర్చ రాష్ట్ర ఆర్థిక శాఖ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్రంలో అమలు పర్చాల్సిన ఆరు గ్యారంటీలకు తోడు రైతు రుణమాఫీ లాంటి అదనపు భారాల నుంచి ఉపశమనం పొందాలంటే కేంద్రం నుంచి సాయం అవసరమని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రుణ సమీకరణకు కేంద్రం చేయూత అవసరమవు తుందని, ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడి అప్పులను తీసుకునేందుకు గాను ఆఫ్ బడ్జెట్ రుణాల విషయంలో వెసులుబాటు ఇవ్వాలని కోరుతున్నాయి.

ఆ రెండిటిపై గంపెడాశలు..

→ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రెండు పద్దులపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆశలు పెట్టుకుంది. కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లు ఏ మేరకు వస్తాయోనని రాష్ట్ర ఆర్థిక శాఖ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. వీటిని బట్టే రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలు కూడా ఉంటాయని, ఈ రెండు పద్దుల్లో కేటాయింపులు అటూ ఇటు జరిగితే మొత్తం బడ్జెట్ అంచనాలే తారుమారవుతాయని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ ఏడాది ఫిబ్రవరి 10న ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పన్నుల్లో వాటా కింద రూ.26 వేల కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు కింద రూ.21 వేల కోట్ల పైచిలుకు నిధులను ప్రతిపాదించింది. ఇవి రెండూ కలిపి మొత్తం బడ్జెట్‌లో 17 శాతం కావడం గమనార్హం. కాగా కేంద్ర పన్నుల వాటాలో ఈసారి పెరుగుదల కనిపిస్తుందని ఆశిస్తున్నామని, అలాగే గత కొన్నేళ్లుగా ఆశించిన మేర ఇవ్వని గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులను ఈసారైనా అవసరం మేరకు కేటాయించాల్సి ఉందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

నికర అప్పు సీలింగ్‌పై తేల్చండి


→ జాతీయ రహదారుల నిర్మాణానికి, ఉపాధి హామీకి, వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు, ఆర్థిక సంఘం సిఫారసుల అమలుకు బడ్జెట్ కేటాయింపు, మహిళా శిశు సంక్షేమ పద్దులను పెంచడం ద్వారా పరోక్షంగానైనా రాష్ట్ర ప్రభుత్వానికి చేయూతనిస్తారా లేదా అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. నికర అప్పుపై సీలింగ్‌ను కూడా బడ్జెట్ ప్రతిపాదనల సమయంలోనే వెల్లడించాలని, తద్వారా తాము అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించుకునే వెసులుబాటు ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ప్రభుత్వ పాఠశాలల నిర్మాణంపై ఎలాంటి జీఎస్టీ విధించకూడదని, ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ)ను జీఎస్టీ పరిధి నుంచి తప్పించాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కేంద్రానికి సూచించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ ప్రాజెక్టుకు జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు.



ఈసారి బడ్జెట్‌లో తెలంగాణ ఆశిస్తున్నవివే..

→ ఐటీఐఆర్ ప్రాజెక్టు పునరుద్ధరణ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.10వేల కోట్లు, ఆఫ్‌బడ్జెట్ రుణాల విషయంలో కేంద్ర వైఖరిలో మార్పు, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీ లకు నిధులు, వెనుకబడిన జిల్లాలకు గ్రాంట్ల మంజూరు మరో ఐదేళ్ల పొడిగింపు, సర్‌చార్జీల వాటా 10 శాతం మించకుండా పన్నుల ప్రతిపాదన, స్కిల్స్ యూనివర్సిటీకి సహకారం, మూలధన వ్యయం కోసం ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీలో తెలంగాణకు నిధుల పెంపు, సింగరేణి కాలరీస్‌కు కొత్త బ్లాక్‌ల కేటాయింపు, స్మార్ట్ సిటీ మిషన్, సర్వేలు పూర్తయి ఉన్న 30 రైల్వే లైన్లకు నిధులు, గృహజ్యోతి పథకాన్ని ముఫ్త్ బిజిలీ యోజనకు అనుసంధానం, కొత్త నవోదయ పాఠశాలలు, నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటు.

నష్టాలకు తోడు బకాయిలు..!



→ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల విషయంలో అనుసరించిన ఆర్థిక వైఖరి కారణంగా తెలంగాణ ప్రభుత్వం గత పదేళ్లలో చాలా నష్టపో యింది. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు పేరుకు పోయాయి. పన్నుల్లో వాటా తగ్గింపు కారణంగా రూ. 33,712 కోట్ల రెవెన్యూ నష్టం జరిగిందని, నీతి ఆయోగ్ మిషన్ భగీరథ సిఫారసుల మేరకు రావాల్సిన రూ.19,205 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పించాల్సిన విద్యుత్ బకాయిలు రూ.17,828 కోట్లు ఇంకా రాలేదని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. 2021–26 వరకు 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన గ్రాంట్ల నుంచి రూ.5,374 కోట్లు ఇంకా అలాగే ఉన్నాయని, వెనుకబడిన జిల్లాలకు నిధుల కింద రూ.2,250 కోట్లు, 14వ ఆర్థిక సంఘం సిఫారసులు రూ.817 కోట్లు, 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన ప్రత్యేక నిధులు రూ.723 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు పొరపాటుగా బదిలీ అయిన సీసీఎస్ పథకాల నిధులు రూ.495 కోట్లు ఇప్పించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఈ విజ్ఞప్తులు, సూచనలపై తెలుగింటి కోడలు, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.



మేకలు కాస్తున్న మధులత

ఐఐటీకి వెళ్లలేక.. మేకలకాపరిగా

రూ. 3లక్షల కోసం గిరిజన విద్యార్థిని ఎదురుచూపు

వీర్నపల్లి(సిరిసిల్ల): ఐఐటీలో చదవాలన్న ఆశ ఉన్నా.. ఆర్థికపరిస్థితి బాగాలేదు. ఎంతో కష్టపడి జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చాటి మంచి ర్యాంకు సాధించినా, కాలేజీ ఫీజు చెల్లించలేని దుస్థితిలో మేకల కాపరిగా మారింది. విద్యాభిమానులు, దాతల సహకారం కోసం ఆ విద్యార్థిని ఎదురు చూస్తోంది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గోనేనాయక్ తండాకు చెందిన బదావత్ రాములు–సరోజ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు అమ్మాయిలు డిగ్రీ వరకు చదువుకొని తల్లిదండ్రులకు వ్యవ సాయ పనుల్లో సాయపడుతున్నారు. మూడో కూతురు మధులత జేఈఈ మెయిన్‌లో ప్రతిభ కనబరిచి ఎస్టీ కేటగిరీలో 824వ ర్యాంక్ సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు వచ్చింది. అయితే రూ.3లక్షల ఫీజు చెల్లించలేని స్థితిలో మేకల వద్దకు వెళుతోంది. ఈనెల 27వ తేదీలోపు ఈ ఫీజు చెల్లించాల్సి ఉంది. దాతలు సాయం చేస్తే గిరిజనబిడ్డకు ఉన్నతవిద్య అభ్యసించే అవకాశం దక్కుతుంది.

ఫోన్‌పే చేయాల్సిన నంబర్లు

భూక్యా లింగంనాయక్	99494 15677
బదావత్ శిరీష్	72074 61506
గుగులోత్ రవిలాల్‌నాయక్	94409 70154

ప్రభుత్వ భూముల్లో ఈత వనాల పెంపకం

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. • నాగర్‌కర్నూల్‌లో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

సాక్షి, నాగర్‌కర్నూల్: అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని సాధించిన యోధుడు సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈత వనాల పెంపకం కోసం గౌడ సొసైటీలకు ప్రభుత్వ భూములు కేటాయిస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విరివిగా ఈత వనాలను పెంచనున్నట్టు చెప్పారు. అలాగే సాగునీటి కాల్వల గట్లపై కూడా ఈత వనాలను పెంచుతామన్నారు. వైన్‌షాపుల కేటాయింపులో ప్రస్తుతం అమలులో ఉన్న 15 శాతం రిజర్వేషన్‌ను సొసైటీ సభ్యులకు వర్తింపజేసేలా కృషి చేస్తామని చెప్పారు. ఏళ్లుగా దాగి ఉన్న



నాగర్‌కర్నూల్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి. చిత్రంలో మధుయాష్కీ, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సర్వాయి పాపన్నగౌడ్ చరిత్రను బయటకి తెచ్చామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గీత కార్మికులకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గౌడ కార్మికులకు రక్షణ కిట్లను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ నేత మధుయాష్కిగౌడ్, బీసీ సంఘాల నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ మెంటల్‌గా అన్‌ఫిట్

- ఏఐఎస్ సర్వీసుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు ఎందుకన్న ఆమె వ్యాఖ్యలపై మండిపడ్డ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ బాలలత
- 24 గంటల్లోగా ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేకపోతే జైపాల్‌రెడ్డి స్ఫూర్తి స్థల్ వద్ద నిరసన చేస్తామని హెచ్చరిక
- స్మితపై చర్యలు తీసుకోవాలన్న పలు దివ్యాంగుల సంఘాల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలలత

పంజగుట్ట/సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అఖిల భారత సర్వీసు (ఏఐఎస్)ల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు ఎందుకంటూ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ప్రశ్నించిన ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మల్లవరపు బాలలత తీవ్రంగా ఖండించారు. బ్యూరోక్రాట్లకు శారీరక ఫిట్‌నెస్‌కన్నా మానసిక ఫిట్‌నెస్ ఉండాలని.. కానీ స్మిత ఫిజికల్‌గా ఫిట్‌గా ఉన్నారేమో కానీ మెంటల్‌గా ఫిట్‌గా లేరని మండి పడ్డారు. తన లాంటి దివ్యాంగులను ఉద్దే శించి ఆమె చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే దివ్యాంగులను దూరంగా పెట్టాలని సమాజానికి సంకేతం ఇస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలలత మాట్లాడారు. స్మిత వ్యాఖ్యలు వ్యక్తిగత మైనవా లేక ప్రభుత్వ ప్రతినిధిగా చేసినవో ఆమె వివరణ ఇవ్వాలన్నారు. ఆమెపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం వెంటనే చర్యలు తీసుకోవాలని.. 24గంటల్లోగా ఆమె చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించు కొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే దివంగత కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి సమాధి స్ఫూర్తిస్థల్ వద్ద దివ్యాంగ సమాజమంతా శాంతియుత నిరసన తెలుపుతామన్నారు.

ప్రతిపక్షాలు, మీడియా, సమాజం స్పందించాలి..

జైపాల్‌రెడ్డి లాంటి పెద్ద నేత రెండు కాళ్లు పనిచేయకపోయినా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారని బాలలత గుర్తు చేశారు. స్మితా సబర్వాల్ పదవికి రాజీనామా చేసి తనతోపాటే మళ్లీ సివిల్స్ రాసి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. ఈ విషయమై మిగిలిన బ్యూరోక్రాట్లు, ప్రతిపక్ష పార్టీలు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మీడియా కూడా స్పందించాలని కోరారు. కాగా, స్మిత వ్యాఖ్యలు దేశంలోని 4 శాతం దివ్యాంగుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని అఖిల భారత దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు విమర్శించారు. రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన ఒక ఐఏఎస్ అధికారి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పీవోడబ్ల్యూ సంధ్య వ్యాఖ్యానించారు. మరోవైపు స్మితా సబర్వాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో–కన్వీనర్ కాటమోనీ వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

వరుస ఫిర్యాదులు

సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ సోమవారం జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా మరికొందరు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ)కు ఫిర్యాదు చేశారు. మరోవైపు శాంతి దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు శ్రీగిరి రజిని ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో స్మితపై కంప్లయింట్ ఇచ్చారు. అలాగే చదువుకోని వారంతా వికలాంగులతో సమానం అంటూ సినీ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి వ్యాఖ్యానించారని ఆరోపిస్తూ ఆయనపైనా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్షేత్రస్థాయిలో తిరుగుతున్న ఐఏఎస్‌లు ఎందరు?: మురళి

ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై 'ఎక్స్' వేదికగా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి తీవ్ర విమర్శలు చేశారు. ఇలాంటి అహంకారపూరిత, రాజ్యాంగాన్ని గౌరవించని వాళ్లు మన విధాన రూపకర్తలని మండిపడ్డారు. 'దివ్యాంగుల చట్టం–1995 చట్టం ప్రకారమే ఉద్యోగాల్లో రిజర్వేషన్స్ వచ్చాయని ఆవిడకు తెలియదా లేక పార్లమెంటునే కించపరిచేలా గర్వం తలకెక్కిందా?' అని దుయ్యబట్టారు. కలెక్టర్లు, జేసీలుగా పని చేస్తున్నప్పుడు మినహా అసలు ఎంత మంది ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ అండతో దేశంలోనే హెలికాప్టర్లలో తిరిగిన ఏకైక ఐఏఎస్ అధికారి కదా.. ఆ మాత్రం తలబిరుసు ఉంటుందేమోనని విమర్శించారు.

ఐపీఎస్, ఐఎఫ్ఓఎస్‌లలో దివ్యాంగ కోటా లేదేం?

హక్కుల కార్యకర్తలకు స్మితా సబర్వాల్ ప్రశ్న

ఐఏఎస్ కొలువులు కూడా అలాంటివేనని మాత్రమే చెప్పదలుచుకున్నట్లు వివరణ

సాక్షి, హైదరాబాద్: 'నా 'ఎక్స్' ఖాతా టైమ్‌లైన్‌లో ఆగ్రహాన్ని చూడండి. ఎవరూ చర్చించడానికి ఇష్టపడని సమస్య గురించి మాట్లాడినప్పుడు ఇలాంటి స్పందనే వస్తుంది. ఐపీఎస్, ఐఎఫ్ఓఎస్ (ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) వంటి ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఎందుకు కోటాను అమలు చేయడం లేదనే అంశాన్ని సైతం హక్కుల కార్యకర్తలు పరిశీలించాలి.' అని ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ పేర్కొన్నారు. ఐఏఎస్ కొలువులు కూడా ఇలాంటివేననే అంశాన్ని మాత్రమే తాను చెప్పదలుచు కున్నానని ఆమె స్పష్టం చేశారు. సమ్మిళిత సమా జంలో జీవించడం అనేది అందరి కలగా పేర్కొన్న స్మిత.. తన మనసులో కాఠిన్యా నికి ఏమాత్రం చోటులేదంటూ చెప్పుకొచ్చారు. శారీరక దృఢత్వం అవసరమైన అఖిల భారత సేవల ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లను అమలు చేయడాన్ని ప్రశ్నిస్తూ ఆమె 'ఎక్స్'లో చేసిన పోస్టుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో సోమవారం ఈ మేరకు వివరణ ఇచ్చారు.

కుక్కల కోసం షెల్టర్ హోమ్స్

- పైలట్ ప్రాజెక్టు కింద చేపడతాం: ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దానకిషోర్
- వీధి కుక్కల బెడద నివారణకు కార్యాచరణ ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: వీధికుక్కల బెడద నివారించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ అన్నారు. కుక్కల జనన నియంత్రణపై పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఆశించిన ఫలితాలు సాధించడంలేదని చెప్పారు. భారతీయ జంతు సంక్షేమ మండలి ఆదేశానుసారం పైలట్ ప్రాజెక్టు క్రింద ఒక కుక్కల షెల్టర్ హోమ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. షెల్టర్ హోమ్‌లపై కొన్ని ఎన్‌జీవోలకు అపనమ్మకాలు ఉన్నాయని, వీటిలో కుక్కలను చంపి నివారించే పద్ధతులను చేపట్టబోమని హామీ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధికుక్కల స్వైరవిహారం, చిన్నారులపై దాడులను హైకోర్టు సుమోటోగా తీసుకొని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పిల్లలపై కుక్కల దాడిని తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి జంతు జనన నియంత్రణ, అమలు, పర్యవేక్షణ కమిటీ ఏర్పాటైంది. దానకిషోర్ ఆధ్వర్యంలో ఈ కమిటీ సమావేశం కాగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, బ్లూక్రాస్ నుంచి సినీనటి అమల అక్కినేని, న్యాయవాది మామిడి వేణుమాధవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను అమలు చేస్తున్నందుకు, ఒక్కో కుక్కకు రూ.1,650 ఇవ్వాలని భారతీయ జంతు సంక్షేమ మండలి నిర్ణయించిందని చెప్పారు.

ఆరోగ్యశ్రీ ప్యాకేజీ ధరల సవరణ

1,672 ప్యాకేజీలలో 1,375 రేట్లను సవరించాలని సర్కారు నిర్ణయం

2013 తర్వాత మొదటిసారి రేట్లను సవరించిన ప్రభుత్వం

సగటున 20–25 శాతం వరకు ధరలను పెంచామన్న మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద నెట్‌వర్క్ ఆసుపత్రులలో రోగులకు అందించే చికిత్సల రేట్లను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. 2013 తర్వాత కొత్త ధరలను ప్రకటించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేట్ల సవరణపై అధ్యయనం కోసం ప్రభుత్వం వేసిన కమిటీ.. గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ప్రైవేట్ ఆసుపత్రుల లోని మెడికల్, సర్జికల్ విభాగాల నిపుణులతో చర్చించి మొత్తం 1,672 ప్యాకేజీలలో 1,375 ప్యాకేజీ రేట్లను సవరించాలని నిర్ణయించింది. మిగి లిన ప్యాకేజీ ధరలు మారవని తెలిపింది. 2013 నుంచి 2024 వరకు ధరల సవరణపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకో లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామో దర రాజనర్సింహ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సగటున 20–25 శాతం రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా 163 కొత్త చికిత్సలు: ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రస్తుతం ఉన్న వ్యాధులకు అదనంగా 163 కొత్త ప్రొసీజర్లను చేర్చారు. ఈ మేరకు మరో ఉత్తర్వు విడుదల చేశారు. దీంతో మొత్తం ప్రొసీజర్ల సంఖ్య 1,835కి పెరిగింది. కొత్త ప్రొసీజర్స్‌తో మరో లక్షన్నర కుటుంబాలను ఆదుకోబోతున్నామని మంత్రి దామోదర తెలిపారు. 79 లక్షల కుటుంబాలను ఆరోగ్యపరంగా ప్రభుత్వం అదుకుంటుందని చెప్పారు. 2007లో నాటి సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని.. ఆ సందర్భంగా 120 ఆసుపత్రుల్లో 533 వ్యాధులకు చికిత్సలను అందుబాటు లోకి తెచ్చారని దామోదర గుర్తుచేశారు. 2022లో 830 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయన్నారు. 90.10 లక్షల మంది ఆరోగ్యశ్రీకి అర్హులుగా ఉన్నారన్నారు. 1,356 ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చాయని మంత్రి తెలిపారు. ఆరోగ్యశ్రీలో కొత్తగా 163 ప్రొసీజర్లను ప్రవేశపెట్టిన నేపథ్యంలో వాటి వివరాలను ప్రభుత్వం జీవోలో పొందుపరిచింది. అందులో ప్రధానంగా టైప్–1 డయాబెటీస్‌కు ఇన్సులిన్ పంప్స్ ప్యాకేజీ కింద ఏడాదికి ఒక రోగికి రూ. 2 లక్షల వరకు కేటాయించారు.

కార్బన్ మోనాక్సైడే కొంప ముంచిందా?

బాత్‌రూమ్‌లో మృతదేహాల కేసులో ప్రాథమికంగా నిర్ధారించిన డాక్టర్లు?

సనత్‌నగర్: జెక్‌కాలనీలో బాత్‌రూంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడటం వెనుక కార్బన్ మోనాక్సైడ్ విష వాయువే కారణంగా తెలుస్తోంది. దీనిని పీల్చిన ఐదు నిమిషాలకే వారు స్పృహ తప్పిపడిపోయి ప్రాణాలు విడిచినట్లుగా డాక్టర్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. సనత్‌నగర్ జెక్‌కాలనీ ఆకృతి ప్రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్–204లో నివసించే ఆర్.వెంకటేశ్, భార్య మాధవి, కుమారుడు హరికృష్ణలు బాత్‌రూమ్‌లో విగతజీవులుగా పడి ఉండటం కలకలం సృష్టించింది. అసలు మృతికి కారణం ఏమై ఉంటుందో ఎవరికీ అంతుచిక్కలేదు. అక్కడ కేవలం గ్యాస్ ఆధారిత గీజర్ ఉండటంతో వారు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారనుకోవడానికి ఏమాత్రం ఆస్కారం లేదన్న వాదనలు వినిపించాయి. మానసిక స్థితి సరిగా లేని కుమారుడు హరికృష్ణకు ఎప్పటిలాగానే స్నానం చేయించేందుకు అక్కడి గీజర్‌ను ఆన్ చేశారు. ఆన్‌చేసిన కొద్దిసేపటికి హరికృష్ణను బాత్‌రూంలోకి తీసుకువెళ్లిన దంపతులు అప్పటికే విడుదలైన కార్బన్‌మోనాక్సైడ్‌ను తెలియకుండానే పీల్చి ఉంటారని, ఆ ప్రభావంతో స్పృహ తప్పి కిందపడిపోయిన ముగ్గురూ మృతి చెంది ఉంటారని డాక్టర్లు ప్రాథమికంగా తేల్చినట్లు తెలుస్తోంది. రంగు, రుచి, వాసన లేని కార్బన్‌మోనాక్సైడ్ విష వాయువును పీలుస్తున్నట్లుగా కూడా తెలియదు. ఈ నేపథ్యంలోనే మరణాలు సంభవించి ఉంటాయని భావిస్తున్నారు.

బ్యూటిప్స్



- ఆపిల్ ముక్కతో ముఖమంతా మృదువుగా రబ్ చేసి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ముఖంలోని అదనపు జిడ్డు తొలగిపోవడంతో మొటిమలు తగ్గి చర్మం తాజాగా కనిపిస్తుంది.
- కీరా రసంలో రోజ్‌వాటర్, నిమ్మరసం కలపాలి. రాత్రి పడుకోబోయే ముందు ఈ మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని ముఖానికి రాసుకోవాలి. మరుసటి రోజు ఉదయాన్నే శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు తగ్గడమే కాకుండా ముఖం తాజాగా కనిపిస్తుంది.



● సిద్దిపేట స్టీల్ బ్యాంక్

ప్రతి ఊరికి కావాలి ఇలాంటి స్టీల్ బ్యాంక్

పెళ్లయినా శుభకార్యమైనా పార్టీ మీటింగ్ అయినా ప్రభుత్వ హెల్త్ క్యాంప్‌లైనా భోజనాల దగ్గర ప్లాస్టిక్ వాడకం ఉంటుంది. చెత్త పేరుకు పోతుంది. డబ్బు కూడా వృథా. అదే స్టీల్ గిన్నెలు ఉంటే? ఒకసారి కొంటే ప్రతిసారి ఉపయోగించుకోవచ్చు. ఈ ఆలోచనతో 2020లో తెలంగాణాలోని సిద్దిపేటలో ఏర్పడిన స్టీల్ బ్యాంక్ 'ఎకానమిక్ సర్వే 2023-24 బుక్'లో తాజాగా చోటు సంపాదించుకుంది. ఇది మహిళా నిర్వహణకు వారి పర్యావరణ దృష్టికి దక్కిన విజయం.

ఇది మహిళల విజయం. జాతీయంగా దక్కిన గుర్తింపు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలో ఎకనామిక్ సర్వే రిపోర్ట్‌ను విడుదల చేస్తారు. సోమవారం విడుదల చేసిన రిపోర్ట్ 12వ చాప్టర్‌లో మౌలిక సదుపాయాలు, వృద్ధిలో భాగంగా సిద్దిపేట స్టీల్ బ్యాంక్ వలన జరిగిన ఉపయోగం గురించి వివరించారు. దీనితో స్టీల్ బ్యాంక్ నిర్వాకులైన మహిళలతో పాటు సిద్దిపేట ఎం.ఎల్.ఏ. హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వద్దనుకుని

2022లో సిద్దిపేట మున్సిపాలిటీలో 'కంటి వెలుగు కార్యక్రమం'లో భాగంగా వైద్య సిబ్బందికి ఆయా గ్రామ పంచాయతీలు భోజన ఏర్పాట్లు చేశాయి. వైద్య సిబ్బంది భోజనం చేసేందుకు ప్లాస్టిక్‌ను వినియోగించాల్సి వచ్చింది. ఇది ఊళ్లో అనవసర చెత్తను పోగు చేస్తోంది. అదే సమయంలో పర్యావరణానికి హాని కూడా. ఈ పారేసిన ప్లాస్టిక్‌ని పశువులు తింటే ప్రమాదం. అందుకే డీపీఓ దేవకీదేవి ప్లాస్టిక్‌కు బదులు స్టీలు వాడాలని నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ సేకరించి స్టీల్ ప్లేట్‌లు, గ్లాసులు, స్పూన్‌లు, వాటర్ బాటిల్‌లను కొనుగోలు చేశారు. ఇలా ఏ గ్రామానికి ఆ గ్రామం కొని జిల్లాలోని 499 గ్రామ పంచాయతీల్లో వినియోగించారు. దీంతో రోజుకు 6 కిలోల నుంచి 8 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగించకుండా నిర్మూలించారు.

సంతోషంగా ఉంది...



ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయించాం. మనం పాటించి తర్వాత ప్రజలు పాటించాలన్న స్ఫూర్తితో బ్యాంక్‌ల ఏర్పాటు. కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సిబ్బందికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేశాం. వీరికి స్టీల్ ప్లేట్, గ్లాసులు, వాటర్ బాటిల్‌ల ద్వారానే అందించాం. మా కృషికి గుర్తింపు దొరకడం సంతోషంగా ఉంది

– **దేవకీదేవి**, డీపీఓ

కిరాయి రేట్లు ఇవీ... ● స్టీల్ ప్లేట్ - రూ1.25 ● టిఫిన్ ప్లేట్ - రూ1.00 ● వాటర్ గ్లాస్ - రూ 0.25 ● టీ గ్లాస్ - రూ 0.25 ● చెంచాలు - రూ 0.25

సంఘం మహిళలు

'మాది సిద్దిపేటలోని వెన్నెల సమైక్య మహిళా సంఘం. శ్రీసాయితేజ సమైక్య మహిళా సంఘంకు చెందిన గడ్డమీది నవ్య ఇద్దరం కలిసి గత నాలుగేళ్లుగా స్టీల్ బ్యాంక్‌ను కొనసాగిస్తున్నాం. మా ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 34 వార్డుల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. 29, ఫిబ్రవరి 2020న మా స్టీల్ బ్యాంక్ ప్రారంభించారు. మా వార్డు పరిధిలో వివాహాలు, ఇతర శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు జరిగితే ముందుగానే సామాగ్రి కోసం సమాచారం ఇస్తారు. వారు ఎంత మందితో కార్యక్రమం నిర్వహిస్తున్నారో చెబితే వారికి సరిపడా సామాగ్రిని అందజేస్తాం. వీటిని ప్రత్యేక సంచిలో వేసి ఇస్తాం. వారి కార్యక్రమం అయిపోయిన తర్వాత క్లీన్ చేసి తీసుకువస్తారు. ఏదైనా వస్తువులు మిస్ అయితే వాటికి డబ్బులు తీసుకుంటాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్‌లు, గ్లాసులు, కప్‌లు ధర కంటే తక్కువ అద్దెకే కిరాయికి ఇస్తున్నాం. ప్లాస్టిక్ నిర్మూలిస్తున్నామనే సంతోషంతో పాటు మాకు ఆర్థికంగా సైతం దోహదపడుతుంది. మా కమిషనర్ ప్రసన్న రాణి, చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల, కౌన్సిలర్ దీప్తిల సహకారంతో ముందుకు వెళ్తున్నాం. పెళ్లిళ్ల సీజన్ అయితే ఎక్కువ మంది తాకిడి ఉంటుంది. మా దగ్గర అన్ని కిరాయికి పోతే మా పక్క వార్డులో ఉంటే తీసుకుని వారికి అద్దెను చెల్లిస్తాం. ప్రజల నుంచి బాగా స్పందన వస్తోంది.



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి రేపటి తరాలకు మంచి పర్యావరణాన్ని బహుమతిగా ఇవ్వాలనే లక్ష్యంతో వీటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నాం.

– **బాలగోని దీప్తి**, వెన్నెల సమైక్య మహిళా సంఘం.

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 34 స్టీల్ బ్యాంక్‌లో ఉన్న పాత్రల వివరాలు

భోజనం ప్లేట్లు 25,500, అల్పాహార ప్లేట్లు 8,500, వాటర్ గ్లాసులు 25,500, టీ గ్లాసులు 8,500, చెంచాలు 25,500, చిన్న గిన్నెలు 25,500, స్టీల్ ట్రేలు 612, బకెట్లు 272, ఇతరములు 3వేలు వస్తువులున్నాయి.

- గజవెల్లి షణ్ముఖ రాజు, సిద్దిపేట, సాక్షి

- ఫొటోలు: **కె. సతీష్ కుమార్**



● రేస్‌లో పాల్గొన్న అతికా మీర్

ఫస్ట్ టైమ్

తొమ్మిదేళ్ల రేసర్

'రోటాక్స్ మ్యాక్స్ ఛాలెంజ్' ప్రతి ఏటా జరిగే అంతర్జాతీయ స్థాయి గోకార్ట్ రేసింగ్. 7 నుంచి 15 ఏళ్ల లోపు వయసు పిల్లలు అనేక దేశాల నుంచి పాల్గొంటారు. 9 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లల 'మైక్రో మ్యాక్స్' రేస్‌లో ఈసారి విజేతగా నిలిచింది మన కశ్మీర్ చిన్నారి అతికా మీర్. దాదాపు గంటకు 65 కిలోమీటర్ల వేగంతో గోకార్ట్ నడుపుతూ డ్రైవింగ్ మెళకువలు ప్రదర్శిస్తూ ఈ విజయం సాధించింది. మోటర్‌స్పోర్ట్స్ చరిత్రలో గోకార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో రేస్ గెలిచిన ఫస్ట్-ఫిమేల్ రేసర్‌గా చరిత్ర సృష్టించింది అతికా మీర్....



ప్రతిష్ఠాత్మకమైన రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్(ఆర్ఎంసీ) ఇంటర్నేషనల్ ట్రోఫీలో మైక్రో మాక్స్ కేటగిరీ రేస్ 2లో అతికా మీర్ విజయం సాధించింది. గోకార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్(ఫ్రాన్స్)లో పాల్గొనడం మీర్‌కు ఇదే తొలిసారి. ముందస్తు ప్రాక్టీస్ లేకపోయినప్పటికీ కొత్త బ్రాండ్ కార్ట్‌ను వేగంగా ఎడాప్ట్ చేసుకొని తన ప్రతిభ చాటుకుంది. రోటాక్స్ మాక్స్ చాలెంజ్ ప్రతిష్ఠాత్మకమైన రేస్. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులైన కార్ట్ డ్రైవర్స్‌కు వేదిక. రేస్ 2లో అతికా విజయాన్ని 'స్పీడ్ అండ్ స్ట్రాటజీ'కి సంబంధించి మాస్టర్‌క్లాస్ అంటున్నారు విశ్లేషకులు.

'రేస్ విన్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. యూరప్‌లో ఇది నా తొలి విజయం. ఈ విజయం కోసం చాలా శ్రమ పడ్డాను. నా టీమ్ ఎంతో సహకారాన్ని అందించింది. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం నాకెంతో బలం' అంటుంది అతికా మీర్.

దుబాయ్‌లోని మాల్స్‌లో మీర్ సరదాగా ఎలక్ట్రిక్ కార్లు నడిపేది. మీర్ డ్రైవింగ్ స్కిల్స్‌ను చూసి తండ్రితో సహా మాల్‌లో ఉన్న వాళ్లు ముక్కున వేలేసుకునేవారు. మీర్ తండ్రి ఆసిఫ్ నజీర్ మీర్ మన దేశ తొలి నేషనల్ కార్టింగ్ ఛాంపియన్. డ్రైవింగ్‌కు సంబంధించి తండ్రి ఇచ్చిన రకరకాల టైమ్ చాలెంజ్‌లను బీట్ చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తేది మీర్.

'ఇక టైమ్ వృథా చేయవద్దు. మీర్‌ను కార్టింగ్ ప్రపంచంలోకి తీసుకురావాల్సిందే' అనుకున్నాడు ఆసిఫ్ నజీర్.

ఇక ఆరోజు నుంచి మీర్‌లో కార్టింగ్‌పై మొదలైన ఇష్టం అంతకంతకూ పెరుగుతూ పోయింది. ఫిట్‌నెస్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఫార్ములా వన్‌లో విజయకేతనం ఎగరేసి చరిత్ర సృష్టించాలని కల కనేలా చేసింది.

ఆరు సంవత్సరాల వయసులో ఎఫ్ఐఏ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకున్న ఫస్ట్ అండ్ యంగెస్ట్ ఫిమేల్ డ్రైవర్‌గా రికార్డ్ సృష్టించింది. మీర్ తొలి ఫుల్ సీజన్ రేసింగ్ యూఏఇలో జరిగిన మినీ ఆర్ కేటగిరితో మొదలైంది. ఈ రేస్‌లో వైస్-చాంపియన్ టైటిల్ గెలుచుకుంది.

వచ్చే ఆగస్ట్‌లో మీర్ యూకేలోని వరల్డ్-ఫేమస్ 'కార్ట్‌మాస్టర్స్'లో డ్రైవింగ్ చేయనుంది. ఇటలీలోని ఐరన్ డేమ్స్ యంగ్ టాలెంట్ ఈవెంట్‌కు కూడా ఎంపికైంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీకి ఎంపికైన 11 మంది బాలికలలో ఆసియా నుంచి ఎంపికైన ఏకైక బాలిక మీర్.

'రేస్‌కు ముందు నెర్వస్‌గా ఉంటాను. కారులో కూర్చున్న తరువాత మాత్రం పరిస్థితి మరోలా ఉంటుంది. ఎలాగైనా ఈ రేస్‌లో గెలవాల్సిందే అనే పట్టుదల పెరుగుతుంది. భయాలు కొట్టుకుపోతాయి' అంటుంది మెరిసే కళ్లతో అతికా మీర్.

ఈ చిన్నారి భవిష్యత్‌లో ఎన్నెన్ని మెరుపులు మెరిపించనుందో వేచిచూద్దాం!

సాగుబడి
పుష్యమి కార్తె: జూలై 20 నుంచి

కృత్రిమ మేధతో 'గులాబీ'కి స్మార్ట్ వల!



దేశవ్యాప్తంగా పత్తి పంటకు పెనునష్టం కలిగిస్తున్న గులాబీ పురుగును సమర్థంగా అరికట్టే కృషిలో నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ (ఐసిఎఆర్-సిఐసిఆర్) పెద్ద ముందడుగు వేసింది. కృత్రిమ మేధ (ఎఐ)తో నడిచే హైటెక్ ఫెరమోన్ ట్రాప్‌లను పంజాబ్ రైతులకు ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చింది. పంటలపై పురుగుల నియంత్రణలో కృత్రిమ మేధ సాంకేతికతను దేశంలోనే మొట్టమొదటి సారిగా వాడిన ఘనతను సిఐసిఆర్ దక్కించుకుంది.

- ఎఐతో నడిచే సోలార్ స్మార్ట్ ఫెరమోన్ ట్రాప్‌కు సిఐసిఆర్ రూపుకల్పన..
- పంజాబ్‌లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- పురుగుల తీవ్రతపై గంటకోసారి మొబైల్‌కు క్షేత్రస్థాయి సమాచారం..
- సకాలంలో స్పందించి గులాబీ పురుగు నష్టాలను తగ్గించుకుంటున్న రైతులు





● సీఐసీఆర్ రూపొందించిన ఏఐ స్మార్ట్ ట్రాప్‌తో పంజాబ్ రైతు జగదేవ్ సింగ్

సంప్రదాయ లింగాకర్షక బుట్టలతో పోల్చితే ఈ అత్యాధునిక సాంకేతికతతో కూడిన ట్రాప్‌లు చాలా మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయని పంజాబ్ పత్తి రైతులు సంతోషిస్తున్నారు. పురుగుల తీవ్రతపై ప్రతి గంటకు రైతుల మొబైల్‌కు, కంప్యూటర్‌కు సమాచారం అందించటం ఈ ఎఐ ఫెరమోన్ ట్రాప్ ప్రత్యేకత. దీని ప్రకారం వ్యవసాయ విస్తరణాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు వెంటనే నియంత్రణ చర్యలు సూచిస్తున్నారు. అదే రోజు ఆ చర్యలను రైతులు అమలు చేస్తుండటం వల్ల గులాబీ పురుగు వల్ల నష్టం జరగకుండా కాపాడుకోగలుగుతున్నానని పంజాబ్ రైతు జగదేవ్‌సింగ్ చెప్పారు. 2021 నుంచి వరుసగా మూడేళ్లుగా ఉగ్రరూపం దాల్చిన గులాబీ పురుగు బారిన పడి పంటను తీవ్రంగా నష్టపోయిన రైతుల్లో ఈయన ఒకరు. ఎకరంన్నరలో బీజీ2 పత్తి సాగు చేస్తున్నారు. మూడు జిల్లాల్లో మరో 17 మంది రైతులు సిఐసిఆర్ పైలట్ ప్రాజెక్టు వల్ల ఈ ఏడాది పత్తి పంటపై దిగులు లేకుండా గడుపుతున్నారు.

పత్తి పంటలో గులాబీ పురుగు తీవ్రతను గుర్తించడానికి హెక్టారుకు 5 చొప్పున లింగాకర్షక బుట్టలు పొలంలో వేలాడగడతారు. గాసిప్లూర్ అనే రసాయనిక ల్యూర్‌ను ఈ బుట్టలో పెడతారు. అది ఆడ పురుగుల వాసనగా పొరపడి ఆకర్షితులై వచ్చే మగ పురుగులు ఆ బుట్టలో చిక్కుకుంటాయి. వీటి సంఖ్యను బట్టి గులాబీ పురుగు తీవ్రతను అంచనా వేసి, క్రిమిసంహారకాలు చల్లుతారు.

స్మార్ట్ ట్రాప్ ఎలా పనిచేస్తుంది?

డిజిటలీకరించిన ఈ స్మార్ట్ ట్రాప్ సోలార్ విద్యుత్‌తో నడుస్తుంది. ఈ స్మార్ట్ ట్రాప్ వ్యవస్థలో సింగిల్ బోర్డ్ కంప్యూటర్, కెమెరా మాడ్యూల్, వాతావరణ సెన్సార్, సోలార్‌తో నడిచే జీఎస్ఎం ట్రాన్స్‌మిటర్, రీచార్జిబుల్ బ్యాటరీ ఉంటాయి. ట్రాప్‌లోకి వచ్చి అతుక్కుపోయిన పురుగులను నిరంతరం ఈ కెమెరా ఫొటోలు తీసి, క్లౌడ్‌లోని రిమోట్ సర్వర్‌కు ఎప్పటికప్పుడు పంపుతుంది. ఆ ఫొటోలను మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌ను ఉపయోగించి ఏయే రకాల పురుగులన్న విశ్లేషణ జరుగుతుంది. గులాబీ పురుగునకు చెందిన రెక్కల పురుగులు ఎన్ని అనే విషయం ఇలా నిర్ధారణ అవుతుంది. ఈ సమాచారంతో పాటు వాతావరణ వివరాలు స్మార్ట్ ట్రాప్‌కు అనుసంధానించిన మొబైల్/కంప్యూటర్లకు సంక్షిప్త సందేశాల రూపంలో చేరుకుంటాయి. ఈ విధంగా రైతులు సకాలంలో పురుగు తీవ్రతను గుర్తించి, క్రిమిసంహారాలు వాడి పత్తిని గులాబీ పురుగు నుంచి రక్షించుకుంటున్నారు.

'గతంలో సాధారణ లింగార్షక బుట్టలను పత్తి పొలంలో పెట్టి, ప్రతి 3 రోజులకోసారి స్వయంగా పొలానికి వెళ్లి చూసేవాడిని. నేను వెళ్లి చూసినప్పుడు పురుగులు పెద్దగా లేకపోవచ్చు. కానీ, తర్వాత రెండు రోజులు అటు వెళ్లను. ఆ తర్వాత రోజు వెళ్లేటప్పటికే పురుగు ఉధృతితో పంటకు తీవ్ర నష్టం జరిగిపోతూ ఉండేది. ఏ రోజు, ఏయే వేళలో పురుగు ఎక్కువ పంటను ఆశించిందీ మాకు తెలిసేది కాదు. కానీ, ఇప్పుడు ఆ సమస్యల్లేవు. ప్రతి గంటకు మెసేజ్ వస్తుంది. అవసరమనిపిస్తే వెంటనే స్పందించి పిచికారీలు చేసి పంటను కాపాడుకుంటున్నాం..' అన్నారు రైతు జగదేవ్‌సింగ్.

సకాలంలో గులాబీ పురుగుకు చెక్

పత్తి పొలంలోని లింగాకర్షక బుట్టల్లో వరుసగా 3 రోజులు రోజుకు 8 చొప్పున గులాబీ రెక్కల పురుగులు కనిపిస్తే.. పంట దిగుబడిని భారీగా నష్టపరిచే స్థాయిలో పురుగు ఉందని అర్థం. అయితే, సాధారణ లింగాకర్షక బుట్టలను రైతులు పొలంలో పెట్టుకున్నప్పటికీ.. వాటిలో ఎన్ని పురుగులు పడుతున్నాయో గమనించే రైతులను మేం గతంలో చాలా అరుదుగా చూశాం. ఎందుకంటే, ఆ పని చేయటానికి వారికి చాలా సమయం అవసరం పడుతుంది. రైతులు పత్తితో పాటు ఇతర పంటల పనులు కూడా చూసుకోవాల్సి ఉంటుంది కదా. ఈ కొత్త వ్యవస్థ వారి సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతుంది. ఫోన్‌లోకి వచ్చే సమాచారంతో పత్తి రైతులు గులాబీ పురుగు ఉనికిని సకాలంలో గుర్తించగలుగుతారు. తగిన సమయంలో క్రిమిసంహారకాలను చల్లి, పంట నష్టాన్ని సమర్థవంతంగా తగ్గించుకుంటున్నారు. కృత్రిమ మేధతో రూపొందించిన ఈ స్మార్ట్ ఫెరమోన్ ట్రాప్ తక్కువ ఖర్చుతోనే గులాబీ పురుగును సమర్థవంతంగా అరికడుతోంది. ఇవి రైతులు స్వయంగా పొలాల్లో ఏర్పాటు చేసుకోవటానికి ఉద్దేశించి రూపొందించినవి కాదు. తహసిల్ స్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు పురుగు తీవ్రతను సకాలంలో గుర్తించి, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వటానికి డిజిటల్ సాధనాలుగా వాడుకోవడానికి స్మార్ట్ ట్రాప్స్ ఉపయోగపడుతాయి. తక్కువ సాంద్ర గ్రిడ్ పద్ధతిలో రైతుల పొలాల్లో ప్రభుత్వం ఈ స్మార్ట్ ట్రాప్‌లను ఏర్పాటు చేయవచ్చు.



- డా. వై.జి. ప్రసాద్, డైరెక్టర్, కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ, నాగపూర్

భూమి హీరో!



సిద్ధేశ్ సాకోర్ (28)... ఒక మారుమూల గ్రామంలో ఓ పేద రైతు కుటుంబంలో పుట్టారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చదివారు. అయినప్పటికీ, తన తండ్రి వంటి చిన్న, సన్నకారు మెట్ట రైతుల ఆదాయాలు పెంచటం కోసం స్వగ్రామంలోనే ఉంటూ తన వంతుగా ఏదైనా చెయ్యాలన్నదే తపనంతా! ఈ తపనకు తోడైన ఆచరణే సిద్ధేశ్‌కి గత నెలలో ఓ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది! దాని పేరే.. భూమి హీరో!

ఐక్యరాజ్య సమితికి చెందిన కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ గత నెల 17న బ్రెజిల్‌లో భూమి పరిరక్షణ కృషిలో క్రియాశీలపాత్ర నిర్వహిస్తున్న పది మంది యువతకు భూమి హీరో పురస్కారాలు అందించింది. ఈ పురస్కార విజేతల్లో సిద్ధేశ్ ఒకరు. మన దేశం నుంచి ఈయనొక్కరికే ఈ గుర్తింపు దక్కింది. ఆయన ప్రయాణం ఆసక్తిదాయకం.. స్ఫూర్తిదాయకం..

అతనిది మహారాష్ట్ర పుణే జిల్లా షిరూర్ తాలూకా ధామరి గ్రామం. పేద వ్యవసాయ కుటుంబంలో పెరిగిన సిద్ధేశ్ కరువు పీడిత మెట్ట ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాడు. తాను వ్యవసాయం చేసి మార్పు తేవాలనుకున్నాడు. కొడుకు వ్యవసాయం చేయటం తండ్రికి ఇష్టం లేదు. కుటుంబ పొలాన్ని ఇవ్వనన్నాడు తండ్రి. మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ చదవమన్నాడు. ఆ ప్రకారంగానే డిగ్రీ చదివిన సిద్ధేశ్ ఆ తర్వాత తమ జిల్లాలోనే గల విజ్ఞానాశ్రమంలో చేరి అనేక చిన్న యంత్రాలను ఆవిష్కరించాడు. వంటింటి వ్యర్థాలతో తక్కువ సమయంలో కంపోస్టు ఎరువు తయారు చేసే యంత్రాలను రూపొందించి శభాష్ అనిపించుకున్నాడు. ఈలోగా కరోనాతో తండ్రి చనిపోయారు. అప్పటికి తండ్రి బ్యాంకు ఖాతాలో రూ. 3వేలు నిల్వ ఉందని చెబుతూ.. ఇదీ చిన్న రైతుల దుస్థితి అంటారాయన.

భూములను సారవంతం చేసుకుంటూ రైతుల ఆదాయం పెంచే పునరుజ్జీవన సేంద్రియ వ్యవసాయంతో రైతుల తలరాత మార్చవచ్చని సిద్ధేశ్ బలంగా నమ్మాడు.

ఐదెకరాల్లోపు వర్షాధార వ్యవసాయం చేసే రైతులు తగినంత ఆదాయం లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల పాలవుతున్నారు. ఆదాయం ఎందుకు రావటం లేదు? వారి భూములు అతిగా రసాయనాలు వాడటం వల్ల నిస్సారమైపోతున్నాయి. సేంద్రియ కర్బనం 0.5% కన్నా తక్కువగానే ఉంది. ఆ నేలల్లో అరకొర దిగుబడులు రావటం, గిట్టుబాటు ధర రాకపోవటం వల్ల బడుగు రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. ఈ వెతలన్నిటికీ మూలం సాగు భూమి అతిగా నిస్సారమైపోవటం అని గ్రహించిన సిద్ధేశ్ స్వగ్రామంలోనే ఉండి, వారసత్వ చిన్నకమతంలో పునరుజ్జీవన సేంద్రియ వ్యవసాయం చేస్తూ.. తోటి రైతులను కూడా ఆ దిశగా నడిపించే పనిని ప్రారంభించారు. 'ఆగ్రో రేంజర్స్' అనే లాభాపేక్ష లేని సంస్థను ఐదేళ్ల క్రితం స్థాపించాడు.

సీజనల్ పంటలపైనే ఆధారపడకుండా చిన్న కమతాల రైతులు కూడా కొంత మేరకు పండ్ల తోటలు పండించుకుంటూ.. రసాయన వ్యవసాయం నుంచి స్థిరమైన సేంద్రియ వ్యవసాయానికి మారడానికి ఆగ్రో రేంజర్స్ రైతులకు మద్దతు ఇస్తోంది.

బహుళ పంటలు పండించే పండ్ల చెట్ల ఆధారిత ఆగ్రో ఫారెస్ట్రీ నమూనాను ఆగ్రో రేంజర్స్ అభివృద్ధి చేసింది. ఇది రైతులకు స్థిరంగా ఆదాయం వచ్చేలా చేస్తుంది. అదే సమయంలో నేల నాణ్యతను మెరుగుపరుస్తుంది.

గత 5 సంవత్సరాలుగా సిద్ధేశ్ బృందం 1,200 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. 23 గ్రామాల్లో వందకు పైగా ఎకరాల్లో రీజనరేటివ్ ఆగ్రో ఫారెస్ట్రీ నమూనాను క్షేత్రస్థాయిలో అమల్లోకి తేగలిగారు. రెండు, మూడు సంస్థల్లో నైపుణ్య శిక్షణ పొందటం ద్వారా, అనేక సంస్థల ఆర్థిక తోడ్పాటుతో ఆగ్రోరేంజర్స్ బృందం లోపాలను సరిదిద్దుకొని పురోగమిస్తోంది.

రైతులు శిక్షణ తీసుకున్నప్పటికీ సాగు పద్ధతి మార్చుకోవటానికి ముందుకు రాకపోవటాన్ని గమనించి.. పండ్ల మొక్కలను, డ్రిప్ లేటరల్స్‌తో పాటు నాణ్యమైన శిక్షణ ఇవ్వటంతో మార్పు క్రమంగా వస్తోందని సిద్ధేశ్ తెలిపారు. వారికి ఎప్పుడు ఏమి అవసరమైతే అది చెబుతూ ముందుకు తీసుకువెళ్తే ఒక్కసారి ఈ పద్ధతి వల్ల ఆదాయం పెరిగితే ఇక వారికి నమ్మకం కుదురుతుంది. నేల క్షీణతను, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనే దిశగా పునరుజ్జీవ ఆగ్రో ఫారెస్ట్రీ నమూనా సాగు పద్ధతిని చిన్న, సన్నకారు రైతులకు అందించే కృషిలో గ్రామీణ యువతను విరివిగా భాగస్వామ్యం చేయాలని సిద్ధేశ్ ఆశిస్తున్నారు.

పుణేలోని లఖేవాడికి చెందిన రైతు జలంధర్ చేమాజీ మాఘ్లే మాటల్లో చెప్పాలంటే.. 'భూతాపం పెరిగిపోవటం అనే సమస్యను ఎదుర్కోవడానికి, సాధ్యమైనంత ఎక్కువ చెట్లను పెంచటం ఉత్తమం. అందువల్ల, పండ్ల మొక్కలు, బిందు సేద్యం, విలువైన పాఠాలతో నాకు సహాయం చేసిన ఆగ్రో రేంజర్స్ బృందంతో నేను కనెక్ట్ అయ్యాను. ఇది వాతావరణ మార్పుపై పోరాటంలో మాత్రమే కాదు. నాకు స్థిరమైన ఆదాయం కూడా వస్తోంది. రెండు ఎకరాల భూమి గతంలో పండ్ల మొక్కలు నాటాను. ఈ సంవత్సరం మరో మూడు ఎకరాల భూమి కోసం ప్లాన్ చేస్తున్నాను'.

https://agrorangers.org/



అమెరికా బృందం పతాకధారిగా లెబ్రాన్ జేమ్స్

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొనే అమెరికా క్రీడాకారుల బృందానికి పతాకధారిగా బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ వ్యవహరిస్తాడు. 39 ఏళ్ల లెబ్రాన్ నాలుగోసారి ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడనున్నాడు. 6 అడుగుల 9 అంగుళాల ఎత్తున్న లెబ్రాన్ 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్యం... 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన అమెరికా జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. లండన్ గేమ్స్ తర్వాత లెబ్రాన్ రియో, టోక్యో ఒలింపిక్స్‌కు దూరంగా ఉన్నాడు. ఎన్‌బీఏ లీగ్ చరిత్రలో అత్యధిక పాయింట్లు (48,177) సాధించిన ప్లేయర్‌గా లెబ్రాన్ రికార్డు నెలకొల్పాడు.

చమరి అటపట్టు సూపర్ సెంచరీ

ఆసియా కప్ మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా దంబుల్లాలో సోమవారం మలేసియాతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 144 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా శ్రీలంక 20 ఓవర్లలో 4 వికెట్లకు 184 పరుగులు చేసింది. కెప్టెన్ చమరి అటపట్టు (69 బంతుల్లో 119 నాటౌట్; 14 ఫోర్లు, 7 సిక్స్‌లు) తన టి20 కెరీర్‌లో మూడో సెంచరీ సాధించింది. మలేసియా 19.5 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలింది.



సీనియర్లు అన్ని మ్యాచ్‌లు ఆడాల్సిందే

భారత కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టీకరణ

సూటిగా, మొహమాటానికి తావు లేకుండా... భారత క్రికెట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ తనదైన శైలిలో భవిష్యత్తు గురించి తన ఆలోచనలేమిటో చెప్పేశాడు. సీనియర్ ఆటగాళ్లయినా సరే తమకు నచ్చినట్లుగా సిరీస్‌లు ఆడతామంటే కుదరదని స్పష్టం చేశాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వచ్చే 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలని కోరుకుంటున్నాను అని చెబుతూ ఫిట్‌నెస్ ఉంటేనే అంటూ అది సాధ్యమవుతుందని పరోక్షంగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఆటగాళ్లపై ఒత్తిడి పెంచకుండా పూర్తి స్వేచ్ఛనిచ్చే ఫలితాలు రాబడతానన్న గంభీర్... విరాట్ కోహ్లితో తనకు ఎలాంటి విభేదాలు లేవని పునరుద్ఘాటించాడు.



గంభీర్
అగార్కర్

న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా కొత్త ప్రయాణం మొదలు పెట్టాడు. శనివారం నుంచి శ్రీలంకతో జరిగే సిరీస్‌లో అతను బాధ్యతలు చేపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గంభీర్ తొలిసారి మీడియాతో అన్ని విషయాలపై మాట్లాడాడు. టీమిండియా భవిష్యత్తు, తన ప్రణాళికల గురించి వివరించాడు. విశేషాలు అతని మాటల్లోనే...

కోచ్‌గా తన ఆలోచనలపై...

నేను ఒక విజయవంతమైన జట్టు బాధ్యతలు తీసుకుంటున్నాను. టి20 వరల్డ్ చాంపియన్, వన్డేలు, టెస్టుల్లో రన్నరప్ టీమ్ ఇది. అనూహ్య మార్పులతో నేను పరిస్థితిని చెడగొట్టను. ఒక హెడ్ కోచ్, ఆటగాడి మధ్య ఉండే బంధం తరహాలో కాకుండా వారికి స్వేచ్ఛనివ్వడం చాలా ముఖ్యం. పరస్పర నమ్మకంతోనే ఫలితాలు వస్తాయి. నేను అన్ని సమయాల్లో ఆటగాళ్లకు అండగా నిలుస్తా. ఏం చేసినా జట్టు గెలుపే లక్ష్యం కావాలి. వేరే మాటకు తావు లేదు. ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలను ప్రదర్శించాలి. విజయాలు లభిస్తేనే డ్రెస్సింగ్ రూమ్ మొత్తం సంతోషంగా ఉంటుంది. నేను అడిగిన సహాయక సిబ్బందిని ఇచ్చిన బోర్డుకు కృతజ్ఞతలు.

ఆటగాళ్లు సిరీస్‌లు ఎంచుకోవడంపై...

నా దృష్టిలో బుమ్రాలాంటి బౌలర్లకు మాత్రమే విశ్రాంతి అవసరం. ప్రతీ ఒక్కరు జట్టులో ఉండాలనుకునే బుమ్రా ఒక అరుదైన బౌలర్. కాబట్టి అతడిని, ఇతర పేసర్లకు కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. అంతే గానీ బ్యాటర్లకు పని భారం అనేది ఉండదు. నిలకడగా ఆడుతూ ఫామ్‌లో ఉంటే అన్ని మ్యాచ్‌లు ఆడవచ్చు. రోహిత్, కోహ్లి ఇప్పుడు రెండు ఫార్మాట్లే ఆడుతున్నారు కాబట్టి వారు అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండవచ్చు. ఆటగాళ్లు తమకు నచ్చినట్లుగా ఒక సిరీస్‌లో ఆడతామని, మరో సిరీస్‌లో ఆడమని అంటే కుదరదు.



రోహిత్, కోహ్లి వన్డే భవిష్యత్తుపై...

వారిద్దరిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని నా భావన. వారు జట్టుకు ఎంత విలువైన ఆటగాళ్లో అందరికీ తెలుసు. ఏ జట్టయినా తమకు అలాంటి ఆటగాళ్లు కావాలని కోరుకుంటుంది. ఫిట్‌గా ఉంటే మాత్రం రోహిత్, కోహ్లి 2027 వన్డే వరల్డ్ కప్‌లో కూడా ఆడవచ్చు. జట్టుకు ఉపయోగపడగలమనే భావన వారిలో ఉంటే ఎప్పటి వరకు ఆడగలరనేది వారి వ్యక్తిగత నిర్ణయం. ఎందుకంటే చివరికి ఏదైనా జట్టు కోసమే.

కోహ్లితో విభేదాలపై...

నాకు, విరాట్‌కు మధ్య ఎలాంటి బంధం ఉందనేది మా ఇద్దరికీ బాగా తెలుసు. ఇది జనం ముందు చూపించేది కాదు. టీఆర్‌పీ రేటింగ్స్ కోసం ఏదైనా చెప్పుకోవచ్చు. మైదానంలో తన జట్టు కోసం పోరాడే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. కానీ ఇప్పుడు మేం భారత్‌కు ప్రాతినిధ్యం వహించబోతున్నాం. జట్టు గెలుపు కోసమే ప్రయత్నిస్తాం. అది మా బాధ్యత. నేను కోచ్‌గా ఎంపికయ్యాక, అంతకుముందు కూడా చాలా మాట్లాడుకున్నాం. అత్యుత్తమ ఆటగాడైన కోహ్లి అంటే నాకు ఎంతో గౌరవం ఉంది.

'సూర్యను అందుకే కెప్టెన్‌ను చేశాం'

భారత టి20 కెప్టెన్‌గా అయ్యే అర్హత అతనికి అన్ని విధాలా ఉంది. ఈ ఫార్మాట్‌లో ప్రస్తుతం అత్యుత్తమ బ్యాటర్. గత ఏడాది కాలంగా అతని గురించి, నాయకత్వ లక్షణాల గురించి డ్రెస్సింగ్ రూమ్ సహచరులు కూడా గొప్పగా చెప్పారు. జట్టు సారథి అన్ని మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటాం. హార్దిక్ పాండ్యా జట్టులో కీలక ఆటగాడే. ఆల్‌రౌండర్‌గా అతని సామర్థ్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ఫిట్‌నెస్ సమస్యలే ప్రధాన బలహీనత. గత కొంత కాలంగా అతను వీటిని ఎదుర్కొంటున్నాడు. మూడు ఫార్మాట్‌లు ఆడే నైపుణ్యంతో పాటు శుబ్‌మన్ గిల్‌కు నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. అందుకే వైస్ కెప్టెన్‌ను చేశాం. అతను మరింత నేర్చుకుంటాడు. అక్షర్‌కు వన్డేల్లో మరిన్ని అవకాశాలు ఇవ్వడం కోసమే జడేజాకు విరామం ఇచ్చాం తప్ప అతడిని తప్పించలేదు. పంత్, రాహుల్ ఉన్నాక మరో కీపర్ అవసరం లేదు కాబట్టి సామ్సన్‌ను పక్కన పెట్టక తప్పలేదు. రెండేళ్ల తర్వాత జరిగే టి20 వరల్డ్ కప్ కోణంలో కొన్ని ప్రయోగాలతో కొత్తగా ప్రయత్నిస్తున్నాం. ఫలితాలు ఎలా వస్తాయో చూడాలి.

–అజిత్ అగార్కర్, సెలక్షన్ కమిటీ చైర్మన్

భారత్‌తో బంధం... మరో దేశానికి ప్రాతినిధ్యం

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు భారత సంతతి క్రీడాకారులు

ప్రతి క్రీడాకారుడి జీవితాశయం ఒలింపిక్స్‌లో పోటీపడటం, దేశానికి పతకం సాధించడం. అయితే ఈ విశ్వ క్రీడల్లో పాల్గొనాలంటే కొన్ని దేశాల్లో తీవ్రమైన పోటీ ఉంటుంది. చాలా మందికి జాతీయ జట్టుకు ఆడే అవకాశం దక్కదు. ఫలితంగా సత్తా ఉన్న వాళ్లు వేరే దేశాలకు వలస వెళ్లి అక్కడే స్థిరపడి మరో మార్గంలో ఒలింపిక్స్‌లో పాల్గొనాలనే తమ కలను నిజం చేసుకుంటారు. మరికొందరేమో తల్లిదండ్రుల వృత్తిరీత్యా స్వదేశాన్ని వీడి వేరే దేశంలో స్థిరపడతారు. వారి పిల్లలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకొని ఒలింపిక్స్ స్థాయికి వెళతారు. మరో మూడు రోజుల్లో ఆరంభమయ్యే పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌తో బంధం ఉన్నా వేరే దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉన్నారు. వారి వివరాలు క్లుప్తంగా...



మరో 3 రోజుల్లో...



రాజీవ్ రామ్ (టెన్నిస్; అమెరికా): రాజీవ్ రామ్ తల్లిదండ్రులు రాఘవ్, సుష్మా బెంగళూరు నుంచి చాలా ఏళ్ల క్రితం అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. రాజీవ్ అమెరికాలోని డెన్వర్‌లో పుట్టి పెరిగాడు. ఆ తర్వాత టెన్నిస్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. 40 ఏళ్ల రాజీవ్ ఐదు గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్ సాధించాడు. వీనస్ విలియమ్స్‌తో కలిసి రాజీవ్ రామ్ 2016 రియో ఒలింపిక్స్‌లో అమెరికాకు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రజత పతకం అందించాడు. పారిస్‌లో రాజీవ్ పురుషుల డబుల్స్‌లో పోటీపడనున్నాడు.




ప్రీతిక పవాడే (టేబుల్ టెన్నిస్; ఫ్రాన్స్): ప్రీతిక తల్లిదండ్రులు విజయన్, సుగుణ పుదుచ్చేరిలో జన్మించారు. 2003లో విజయన్ ఫ్రాన్స్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 2004లో ప్రీతిక పారిస్‌లో జన్మించింది. 16 ఏళ్లకే ప్రీతిక ఫ్రాన్స్ తరఫున టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడింది. స్వదేశంలో జరగనున్న ఒలింపిక్స్‌లో 19 ఏళ్ల ప్రీతిక మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్‌గా బరిలోకి దిగనుంది. మహిళల డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ఆమె తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది.



శాంతి పెరీరా (అథ్లెటిక్స్; సింగపూర్): సింగపూర్ 'స్ప్రింట్ క్వీన్'గా పేరొందిన వెరోనికా శాంతి పెరీరా పూర్వీకులది కేరళ. సింగపూర్‌లో వాళ్ల తాతకు ఉద్యోగం రావడంతో తిరువంతనపురం నుంచి సింగపూర్‌కు వచ్చి స్థిరపడ్డారు. గత ఏడాది హాంగ్జౌ ఆసియా క్రీడల్లో శాంతి 100 మీటర్ల విభాగంలో రజత పతకం గెలిచి 49 ఏళ్ల తర్వాత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సింగపూర్‌కు తొలి పతకాన్ని అందించింది. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో సింగపూర్ బృందానికి శాంతి పతాకధారిగా వ్యవహరించనుంది.



కనక్ ఝా (టేబుల్ టెన్నిస్; అమెరికా): ఇప్పటికే రియో, టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్న కనక్ ఝా నాలుగుసార్లు టేబుల్ టెన్నిస్‌లో అమెరికా జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. కనక్ తల్లి సుగుణ స్వస్థలం ముంబైకాగా.. తండ్రి అరుణ్ కోల్‌కతా, ప్రయాగ్‌రాజ్‌లలో పెరిగారు. వీరిద్దరు ఐటీ ప్రొఫెషనల్స్. వృత్తిరీత్యా అమెరికాకు వెళ్లి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. 24 ఏళ్ల కనక్ 2018 యూత్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచాడు.



అమర్ ధేసి (రెజ్లింగ్; కెనడా): అమర్‌వీర్ తండ్రి బల్బీర్ జాతీయ గ్రీకో రోమన్ చాంపియన్. పంజాబ్ పోలీసులో కొంత కాలం పనిచేశాక బల్బీర్ 1979లో కెనడాకు వచ్చి స్థిరపడ్డారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కెనడాకు ప్రాతినిధ్యం వహించిన అమర్ 125 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో 13వ స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పతకంపై గురి పెట్టాడు. 28 ఏళ్ల అమర్ 2021 పాన్ అమెరికన్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించాడు. అనంతరం 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

సుమిత్ శుభారంభం



కిట్జ్‌బుహెల్ (ఆస్ట్రియా): జెనరాలి ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ 6–4, 1–6, 7–6 (7/3)తో 119వ ర్యాంకర్ లుకాస్ క్లీన్ (స్లొవేకియా)పై విజయం సాధించాడు. చివరి సెట్‌లో సుమిత్ 3–5తో వెనుకబడి పుంజుకోవడం విశేషం.

ఒలింపిక్స్ తర్వాత శ్రీజేశ్ వీడ్కోలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీలోని అత్యుత్తమ గోల్ కీపర్లలో ఒకడైన భారత స్టార్ పీఆర్ శ్రీజేశ్ వచ్చే నెలలో రిటైర్ కానున్నాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత అంతర్జాతీయ హాకీ నుంచి వీడ్కోలు తీసుకుంటానని కేరళకు చెందిన 36 ఏళ్ల శ్రీజేశ్ సోమవారం ప్రకటించాడు. 2006లో దక్షిణాసియా క్రీడల్లో తొలిసారి భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీజేశ్ ఇప్పటి వరకు 328 మ్యాచ్‌లు ఆడాడు. వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్న శ్రీజేశ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టుకు కాంస్యం దక్కడంలో కీలక పాత్ర పోషించాడు. 2014, 2022 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు, 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన టీమిండియాలో శ్రీజేశ్ సభ్యుడిగా ఉన్నాడు. నాలుగుసార్లు ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో (2011, 2016, 2018, 2023) బంగారు పతకాలు నెగ్గిన భారత జట్టులోనూ శ్రీజేశ్ సభ్యుడిగా ఉన్నాడు. 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టుకు శ్రీజేశ్ గోల్‌కీపర్‌గా వ్యవహరించాడు. 2021లో శ్రీజేశ్‌కు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న' లభించింది.



సినిమా

మోడ్రన్ మాస్టర్స్


● రాజమౌళి

'బాహుబలి, ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో తెలుగు సినిమా కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎగురవేశారు దర్శక ధీరుడు రాజమౌళి. తెలుగు చిత్ర పరిశ్రమకి తొలి ఆస్కార్(ఆర్ఆర్ఆర్ మూవీ) అవార్డు తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. అలాంటి ప్రతిభావంతుడైన రాజమౌళి జీవిత విశేషాలతో 'మోడ్రన్ మాస్టర్స్' అనే పేరుతో ఓ డాక్యుమెంటరీ రూపొందించింది ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్. ఇందులో రాజమౌళి సినీ ప్రయాణాన్ని చూపించనున్నారు. ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ డాక్యుమెంటరీ ట్రైలర్‌ని విడుదల చేశారు. ట్రైలర్ చూస్తే టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, కరణ్ జోహార్, జేమ్స్ కామెరూన్, కీరవాణి, రమా రాజమౌళి వంటి వారు రాజమౌళిపై తమ అభిప్రాయాలతో పాటు పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. 'మోడ్రన్ మాస్టర్స్' ట్రైలర్‌కి అనూహ్యమైన స్పందన వస్తోందంటే రాజమౌళి లైఫ్ స్టోరీ తెలుసుకోవాలనే క్యూరియాసిటీ సినీ అభిమానుల్లో ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేశ్ బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కించనున్న సినిమా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది.

అందుకే ఆపరేషన్ రావణ్ టైటిల్ పెట్టాం

\- వెంకట సత్య



''రామాయణం'లోని కొన్ని రిఫరెన్స్‌లను తీసుకుని మా సినిమా కథను రెడీ చేసుకున్నాం. అందుకే మా చిత్రానికి 'ఆపరేషన్ రావణ్' అనే టైటిల్ పెట్టాం. అయితే 'రామాయణం'లో రావణుడు మారువేషం వేసుకుని వచ్చాడు. మా మూవీలో మాస్క్ పెట్టుకుని వస్తాడు'' అని డైరెక్టర్ వెంకట సత్య అన్నారు. రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జోడీగా రాధికా శరత్‌కుమార్, చరణ్‌రాజ్ కీలక పాత్రల్లో నటించిన న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకట సత్య మాట్లాడుతూ– ''కేవీ రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు, రాజమౌళి, స్టీవెన్ స్పీల్‌బర్గ్‌గార్లు నా ఫేవరేట్ డైరెక్టర్స్. రాజమౌళిగారిలాంటి దర్శకుడు ధైర్యంగా ముందడుగు వేసి 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'లాంటి సినిమాలు చేయకపోతే తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి వెళ్లి ఆస్కార్ అందుకునేది కాదు. ఇక 'ఆపరేషన్ రావణ్' విషయానికొస్తే.. ఓ మనిషి సైకోగా ఎందుకు మారతాడు? అనే అంశాన్ని చూపిస్తున్నాం. అనుకున్న సమయంలో అనుకున్న బడ్జెట్‌తో షూటింగ్ పూర్తి చేశాం. అయితే సినిమా తీసినంత సులభంగా రిలీజ్ చేసుకోలేమని తెలుసుకున్నాను. నా కొడుకు రక్షిత్ అట్లూరి పాత్ర, నటన బాగుంటాయి. 'పలాస 2' సినిమా ఆలోచనలో ఉన్నాం. మా బ్యానర్ నుంచి ఏడాదికో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు.


● అజిత్

అజర్‌బైజాన్‌కు బై

అజర్‌బైజాన్‌కు బై బై చెప్పారు అజిత్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి'. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా, అర్జున్, ఆరవ్, రెజీనా, నిఖిల్ ఇతర రోల్స్‌లో నటిస్తున్నారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా అజర్‌బైజాన్‌లో ఈ సినిమా లాంగ్ షెడ్యూల్ పూర్తయింది. అజిత్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటుగా, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారట మేకర్స్. కాగా దాదాపు పదమూడేళ్ల క్రితం తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గ్యాంబ్లర్' (2011) సినిమా తర్వాత అజిత్–అర్జున్–త్రిష కలిసి నటిస్తున్న సినిమా 'విడాముయర్చి' కావడం విశేషం. హీరో కుటుంబం విహారయాత్రకు వెళ్తుంది. అక్కడ హీరో భార్య, అతని కుమార్తె అదృశ్యం అవుతారు. వారి ఆచూకీని హీరో ఎలా కనుక్కున్నాడు? ఏ విధంగా రక్షించాడు? అన్నది 'విడాముయర్చి' కథ అని కోలీవుడ్ టాక్.


నువ్వు సిద్ధమా..?

హాలీవుడ్ సూపర్‌హీరో హిట్ ఫ్రాంచైజీ 'డెడ్‌పూల్' నుంచి వస్తున్న తాజా సినిమా 'డెడ్‌పూల్ అండ్ వుల్వరీన్'. ర్యాన్ రేనాల్డ్స్, హ్యూ జాక్‌మన్, ఎమ్మా కోరిన్, మాథ్యూ మాక్‌ఫాడ్యేయన్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు షాన్ లేవీ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో డెడ్‌పూల్‌గా ర్యాన్ రేనాల్డ్స్, వుల్వరీన్‌గా హ్యూజాక్‌మెన్ కనిపిస్తారు. వాల్ట్ డిస్నీ స్టూడియోస్ మోషన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేస్తోంది. తెలుగులోనూ విడుదల కానున్న ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''నా కంటూ ఉంది ఈ తొమ్మిదిమందే... నా ప్రపంచం మొత్తం ఈ ఫోటోలో ఉంది. ఒక్కడ్నే వీళ్లను ఎలా కాపాడాలో తెలియడం లేదు. కానీ.. నువ్వు వీళ్లను కాపాడగలవు', 'నువ్వు సిద్ధమా..?', 'ఎల్లప్పుడూ సిద్ధం' వంటి డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.


● 'డెడ్‌పూల్ అండ్ వుల్వరీన్' పోస్టర్

విక్రమార్క వస్తున్నాడు

రామ్‌చరణ్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'మగధీర' సినిమాలో విలన్ పాత్రలో నటించిన దేవ్ గిల్ హీరోగా నటించిన చిత్రం 'అహో! విక్రమార్క'. పేట త్రికోటి దర్శకుడు. దేవ్ గిల్ ప్రొడక్షన్స్‌పై ఆర్తి దేవిందర్ గిల్, మిహిర్ కుల్కర్ని, అశ్విని కుమార్ మిస్రా నిర్మించారు. ఈ మూవీని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఆగస్టు 30న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. దేవ్ గిల్ మాట్లాడుతూ– ''అహో! విక్రమార్క' సినిమాలో పోలీసుల ధైర్యం, అంకితభావాన్ని గొప్పగా చూపించబోతున్నాం. నటుడిగా నాలోని మరో కోణాన్ని ఈ మూవీ ద్వారా ప్రేక్షకులు చూస్తారు'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, ఆర్కో ప్రవో ముఖర్జీ.


● దేవ్ గిల్

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హిందీ మూవీ 'కాకుడా' కూడా ఒకటి. ఈ సినిమా గురించి తెలుసుకుందాం.

కాకుడా రివ్యూ



మానవుని జీవితంలో అత్యంత సున్నితమైన మరియు భయోత్పాతమైన ఉదంతం ఏదైనా ఉంది అంటే అది మరణమే. ఆ మరణ ఇతివృత్తాంతాన్ని వినోదాత్మకంగా మలిచిన చిత్రమే 'కాకుడా'. ఈ సినిమా జోనర్ హారర్ కామెడీ. దీనికి దర్శకులు ఆదిత్య సరపోతదార్. మామూలుగా హారర్ కామెడీ చిత్రాల్లో దెయ్యం మనుషులను భయపెట్టడం లేదా మనిషే దెయ్యాలను భయపెట్టడం చూశాం. వాటన్నిటికీ విరుద్ధంగా 'కాకుడా' సినిమా కాన్సెప్ట్ ఉండడం విశేషం. ఉత్తరాది రాష్ట్రంలోని ఓ మారుమూల గ్రామానికి సంబంధించిన కథ ఇది. ఆ గ్రామం పేరే కాకుడా. ప్రతి మంగళవారం సరిగ్గా రాత్రి 7.15 నిమిషాలకు గ్రామంలోని ప్రతి ఇంటి చిన్న ద్వారం తలుపులు తీసి ఉంచాలి. ఇదే కథాంశం. ఎవరికైనా ఫలానా రోజున తాము మరణించే రోజు అని తెలిస్తే... ఇంకేముంది... క్షణక్షణం బాధతో నరకం అనుభవిస్తారు. కానీ ఈ సినిమాలో ప్రధాన పాత్రకి తాను మరణించే రోజు తెలిసినా పైకి కొంత బాధపడుతూనే అందరితో మామూలుగా ఉంటూ కథను నడిపిస్తాడు. రితేష్ దేశ్‌ముఖ్, సోనాక్షీ సిన్హా వంటి పెద్ద తారలు నటించిన ఈ చిన్న సినిమా ఆద్యంతం కాలక్షేపదాయకం. కొన్ని కొన్ని సన్నివేశాల్లో దెయ్యం రూపం కాస్త పిల్లలను భయపెట్టినా సినిమా మొత్తం సకుటుంబ సపరివార సమేతంగా సరదా సరదాగా చూడొచ్చు. ఈ వారానికి 'కాకుడా' సినిమా వినోదం కోసం గొప్ప ఛాయిస్ అని చెప్పొచ్చు. ఈ చిత్రం జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది.

– ఇంటూరు హరికృష్ణ

పుట్టిన ఊరు కోసం...


● సీతా నారాయణన్, అలీ రేజా

'బిగ్‌బాస్' ఫేమ్ అలీ రేజా, సీతా నారాయణన్ జోడీగా నటించిన చిత్రం 'రామ్ ఎన్ఆర్ఐ'. 'పవర్ ఆఫ్ రిలేషన్ షిప్' అనేది ఉపశీర్షిక. ఎస్.లక్ష్మీ నందా దర్శకత్వం వహించారు. ఎస్ఎంకే ఫిల్మ్స్ సింగులూరి మోహన్‌కృష్ణ సమర్పణలో మువ్వా సత్యనారాయణ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నిర్మాతలు ప్రసన్న కుమార్, సాయి వెంకట్, రామకృష్ణ గౌడ్, రామ సత్యనారాయణ వంటి వారు ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎస్.లక్ష్మీ నందా మాట్లాడుతూ– ''పుట్టిన ఊరు కోసం ఎన్ఆర్ఐలు ఏం చేశారు? అనే కథాంశంతో 'రామ్ ఎన్ఆర్ఐ' రూపొందింది'' అన్నారు. ''లక్ష్మీ నందాగారితో సోలోగా ఓ సినిమా తీస్తున్నాను'' అన్నారు సింగులూరి మోహన్‌కృష్ణ. ''మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు మువ్వా సత్యనారాయణ. నటుడు రవి వర్మ మాట్లాడారు.

స్కూల్ లైఫ్ ఆరంభం


● సావిత్రీ కృష్ణ, మహేశ్, కిరణ్ అబ్బవరం

పులివెందుల మహేశ్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రీ కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నైనీషా, రాహుల్ త్రిశూల్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ మూవీ పూజా కార్యక్రమానికి హీరో కిరణ్ అబ్బవరం, డైరెక్టర్ వి. సముద్ర ముఖ్య అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. పులివెందుల మహేశ్ మాట్లాడుతూ– ''స్కూల్ లైఫ్' నా ఒక్కడిదే కాదు. సినిమా మీద ఉన్న ఇష్టంతో పాటు కథ నచ్చి క్రౌడ్ ఫండింగ్ ద్వారా వచ్చిన డబ్బుతో పాటు నా ఇల్లు అమ్మి ఈ సినిమా తీస్తున్నాను. మా బడ్జెట్ సరిపోకపోవడంతో కథ నచ్చి, నన్ను నమ్మి సహకారం అందిస్తున్న నిర్మాత రాహుల్ త్రిశూల్‌గారికి కృతజ్ఞతలు'' అన్నారు. రాహుల్ త్రిశూల్ మాట్లాడుతూ– ''స్కూల్ లైఫ్' రెగ్యులర్ షూటింగ్‌ని ఆగస్టు 2న ప్రారంభించి సెప్టెంబర్ 2 వరకు సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ధర్మ ప్రభ, సంగీతం: హర్ష ప్రవీణ్.

కంచర్ల సందేశం


● ఉపేంద్ర బాబు, మీనాక్షి

'ఉపేంద్రగాడి అడ్డా' ఫేమ్ కంచర్ల ఉపేంద్ర బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'కంచర్ల'. యాద్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ జైస్వాల్ హీరోయిన్. సుమన్, అజయ్ ఘోష్ ఇతర పాత్రలు చేశారు. ఎస్ఎస్ఎల్‌వీ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్నారు. అరకులో చిత్రీకరించిన తాజా షెడ్యూల్‌తో ఈ మూవీ చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ–''మా ఇంటి పేరైన 'కంచర్ల' టైటిల్‌తో సినిమా నిర్మించడం సంతోషంగా ఉంది. ఆగస్టు 15 తర్వాత సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. ''మంచి కథాంశంతో తీసిన మా చిత్రం గొప్ప విజయం అందుకుంటుంది'' అన్నారు కంచర్ల ఉపేంద్ర బాబు. ''కంచర్ల' సినిమాలో మంచి సందేశం ఉంటుంది'' అన్నారు యాద్ కుమార్. ''మా మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుంటుంటుంది'' అన్నారు మీనాక్షీ జైస్వాల్.

స్టాక్ మార్కెట్లు				
దేశీ సూచీలు				
సెన్సెక్స్ ▽	102	80,502		
నిఫ్టీ ▽	22	24,509		
విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)				
నాస్‌డాక్	18,015	△	286	
డోజోన్స్	40,403	△	115	
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,199	△	43	
డాక్స్	18,407	△	235	
షాంఘై	2,964	▽	18	
నికాయ్	39,599	▽	465	

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో	ముంబై
బంగారం (99.9 స్వచ్ఛత)	73,218
బంగారం (99.5 స్వచ్ఛత)	72,925
వెండి (కేజీ)	88,196

	ఫారెక్స్ రేట్లు రూ.లలో		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.27	84.29
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.97	109.56
€	యూరో	ఎస్‌బీఐ	90.08	92.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.60	53.76
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.95	56.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.83	64.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.42	22.97
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.89	23.67
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

ఉపాధికి ఊతం.. ధరలకు కళ్లెం!

మోదీ 3.0 ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఉద్ఘాటన...

- ఈ ఏడాది జీడీపీ వృద్ధి రేటు 6.5–7 శాతంగా అంచనా
- లక్షలాది ఉద్యోగాల కల్పనే లక్ష్యం...
- 2030 నాటికి ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలి
- తయారీ, ఎగుమతులకు చైనా పెట్టుబడుల దన్ను...
- నిర్మాణాత్మక సంస్కరణలతో 7 శాతం పైగా వృద్ధి..
- ప్రైవేటు పెట్టుబడులు, చిన్న పరిశ్రమలకు ఊతం...
- విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని పూడ్చాల్సిందే...
- కార్మిక, వ్యవసాయ సంస్కరణలు తక్షణావసరం..
- పార్లమెంట్‌లో సర్వేను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో వృద్ధి రేటు అంచనాలను ప్రభుత్వం అచితూచి నిర్దేశించింది. స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 6.5–7 శాతం స్థాయిలో ఉండొచ్చని ఆర్థిక సర్వేలో లెక్కగట్టింది. ఉపాధి కల్పనను పెంచాల్సిన అవసరం ఉందని కూడా నొక్కిచెప్పింది. ధరాభారంతో అల్లాడుతున్న పేదలు, అల్పాదాయ వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీ లేదా కూపన్ల రూపంలో నిర్దిష్టంగా ఆర్థిక తోడ్పాటు కల్పించాల్సిన అవసరం ఉందని కూడా సర్వే సూచించింది. దేశంలో తయారీ రంగానికి తోడ్పాటు అందించడంతో పాటు ఎగుమతులను పెంచాలంటే చైనా నుంచి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెంచాల్సిందేనని స్పష్టం చేసింది. కాగా, గతేడాది (2023–24) 8.2 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే, ఈ ఏడాది వృద్ధి రేటు అంచనాలు చాలా తక్కువగా ఉండటం విశేషం. ఆర్‌బీఐ నిర్దేశించిన 7.2 శాతం వృద్ధి రేటు అంచనాలతో పోల్చినా సర్వేలో వృద్ధి అంచనా తగ్గింది. అనిశ్చిత వర్షపాతం, ప్రైవేటు రంగంలో పెట్టుబడుల మందగమనం వంటివి వృద్ధి అంచనాల తగ్గుదలకు ప్రధాన కారణంగా సర్వే పేర్కొంది. 'భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన వృద్ధి బాటలో పయనిస్తోంది. ప్రపంచ భౌగోళిక, రాజకీయ సవాళ్లన్నింటినీ దీటుగా ఎదుర్కొంటోంది' అని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సర్వే ముందుమాటలో పేర్కొన్నారు. కాగా, నిర్మాణాత్మక సంస్కరణలను అమలు చేయడం ద్వారా మధ్యకాలం పాటు నిలకడగా 7% వృద్ధి రేటు కొనసాగవచ్చని సర్వే తేల్చిచెప్పింది.

వికసిత భారత్ వైపు పయనం



వికసిత భారత్‌ను నిర్మించే దిశగా ముందుకు సాగుతున్నందున ప్రస్తుత పటిష్టతలతోపాటు మరింత పురోగతికి అవకాశాలు ఉన్న మార్గాలను సర్వే గుర్తించింది. ఆర్థిక సర్వే మన ఆర్థిక వ్యవస్థ ప్రబలమైన పటిష్టతలతను హైలైట్ చేస్తోంది. మా ప్రభుత్వం తీసుకువచ్చిన వివిధ సంస్కరణల ఫలితాలను కూడా సుస్పష్టం చేస్తోంది.

– ఎక్స్ పోస్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

కార్మిక సంస్కరణలు వేగవంతం...

కేంద్రంలో వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కారు 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగా 2024–25 పూర్తి స్థాయి బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రకటించే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రైవేటు పెట్టుబడులను పెంచడం, చిన్న–మధ్య తరహా వ్యాపారాలకు చేయూతనందించడం, సాగును లాభసాటిగా మార్చేలా వ్యవసాయ సంస్కరణలు, వాతావరణ మార్పుల సమస్యను ఎదుర్కొనేందుకు వనరుల సమీకరణ, ఆర్థిక అసమానతలను తగ్గించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించను న్నారు. విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని పూడ్చాలని కూడా సర్వే నొక్కిచెప్పింది. దేశంలో ఉద్యోగ కల్పనకు మరింత సానుకూల వాతావరణాన్ని సృష్టించాలంటే కార్మిక సంస్కరణల అమలును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని కూడా పేర్కొంది. 'దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అనుగుణంగా 2030 నాటికి వ్యవసాయేతర రంగంలో ఏటా సగటున 78.5 లక్షల ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది' అని సర్వే తెలిపింది.

అంచనాలు సుసాధ్యం



7 శాతం వృద్ధి రేటు సాధన భారత్‌కు తేలికే. మేము నిరాశావాదులం కాదు. రుతుపవనాల పురోగతి సవాళ్లను కూడా మేము పరిగణనలోకి తీసుకుంటున్నాము. ఫైనాన్షియల్ రంగం అవుట్‌లుక్ పటిష్టంగా కనబడుతోందని. పొదుపులను ఫైనాన్షియల్ మార్కెట్లవైపునకు మళ్లించడాన్ని చూస్తే.. భారత్ కుటుంబాలు కష్టాల్లో లేవన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.

– వి. అనంత నాగేశ్వరన్, సీఈఏ

చైనా పెట్టుబడులు పెరగాలి...

భారత్ ఎగుమతులు, దేశీ తయారీ రంగం మరింత పుంజుకోవాలంటే, చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరగాలని, లేదంటే చైనా సరఫరా వ్యవస్థతో భారత్ అనుసంధానం కావాల్సి ఉంటుందని సర్వే అభిప్రాయపడింది. మరోపక్క, చైనా నుంచి దేశంలోకి దిగుమతులు తగ్గాలని కూడా పేర్కొంది. 'అమెరికా తదితర కీలక మార్కెట్లకు భారత్ ఎగుమతులు భారీగా పెరగాలంటే చైనా పెట్టుబడులపై మనం మరింత దృష్టి సారించాలి. తూర్పు ఆసియా దేశాలు గతంలో ఇదే విధంగా లబ్ధి పొందాయి' అని సర్వే తెలిపింది. 2020లో గాల్వాన్‌లో చోటు చేసుకున్న సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా భారత్ టిక్‌టాక్, యూసీ బ్రౌజర్‌తో సహా 200 చైనా మొబైల్ యాప్‌లను నిషేధించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా చైనా ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం బీవైడీ భారీ పెట్టుబడి ప్రతిపాదనలను కూడా తిరస్కరించింది. 2000–2024 మధ్య భారత్ అందుకున్న మొత్తం ఎఫ్‌డీఐలలో చైనా కేవలం 0.37% (2.5 బిలియన్ డాలర్లు) వాటాతో 22 స్థానంలో ఉంది. కాగా, కీలక ఖనిజాల విషయంలో చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సర్వే స్పష్టం చేసింది.



పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడ్జెట్ బృందంతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, సహాయమంత్రి పంకజ్ చౌదరి

వ్యవసాయంలో సత్వర సంస్కరణలు

వ్యవసాయ రంగంలో సంస్కరణలను వెంటనే చేపట్టాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే నొక్కి చెప్పింది. లేదంటే ఈ రంగంలో నెలకొన్న వ్యవస్థీకృత సమస్యలు దేశ వృద్ధికి అడ్డుపడతాయని విధానకర్తలను హెచ్చరించింది. తూర్పు ఆసియా దేశాలు, అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలతో పోల్చితే.. దేశ వ్యవసాయరంగం సామర్థ్యాలను ఇంకా పూర్తి స్థాయిలో వెలుగులోకి తేవాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు వ్యవసాయరంగ సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని సూచించింది. ఈ రంగంపై దేశవ్యాప్తంగా చర్చలు అవసరమని నాగేశ్వరన్ పిలుపునిచ్చారు. ''దేశ వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎలాంటి సంక్షోభంలో లేదు. కాకపోతే నిర్మాణాత్మక మార్పు అవసరం. ఎందుకంటే వాతావరణ మార్పులు, నీటి సమస్య రానున్న రోజుల్లో పెద్దవి కానున్నాయి''అని సర్వే స్పష్టం చేసింది. ప్రస్తుతం రైతులకు ఎరువులు, విద్యుత్, ఆదాయపన్ను, మద్దతు ధరల పరంగా సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నప్పటికీ ప్రస్తుత విధానాలను తిరిగి సమీక్షించాలని అభిప్రాయపడింది. టెక్నాలజీ ఆధునికీకరణ, మార్కెటింగ్ మార్గాలను మెరుగుపరచడం, సాగులో ఆవిష్కరణలు, వ్యవసాయం–పరిశ్రమల మధ్య అనుసంధానత పెంపు దిశగా సంస్కరణలను సూచించింది.



ఆర్థిక సర్వే హైలైట్స్..

- అసాధారణరీతిలో వరుసగా మూడోసారి ప్రజలు మోదీ 3.0 సర్కారుకు పట్టం కట్టడం దేశంలో రాజకీయపరమైన, విధానపరమైన స్థిరత్వానికి అద్దం పడుతోంది.
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ దేశీయ వృద్ధి చోదకాలు 2023–24లో ఆర్థిక పురోగతికి దన్నుగా నిలిచాయి.
- భౌగోళిక, రాజకీయ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన, స్థిరమైన ప్రగతిని సాధిస్తోంది.
- కరోనా మహమ్మారి తదనంతరం దేశీయ వ్యాపార, వాణిజ్య రంగం రికవరీ కోసం ప్రభుత్వం అనేక కీలక చర్యలు తీసుకుంది.
- వాణిజ్యం, పెట్టుబడులు, వాతావారణ మార్పుల వంటి ప్రపంచ సమస్యల విషయంలో వివిధ దేశాలతో ఒప్పందాలు క్లిష్టతరంగా మారాయి.
- స్వల్పకాలానికి ద్రవ్యోల్బణం అంచనాలు తగ్గుముఖ ధోరణిలోనే ఉన్నప్పటికీ, పప్పుధాన్యాల కొరత , ధరల ఒత్తిడి నిలకడగా కొనసాగుతోంది.
- సాధారణ వర్షపాతం, దిగుమతులకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ధరలు శాంతించడంతో ఆర్‌బీఐ సానుకూల ద్రవ్యోల్బణం అంచనాలకు దన్నుగా నిలుస్తోంది.
- అధిక ఆహార ధరలతో అల్లాడుతున్న పేదలు, అల్పాదాయ వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీలు, నిర్దిష్ట కొనుగోళ్లకు కూపన్‌ల రూపంలో కొంతకాలం పాటు ప్రయోజనాలను అందించాలి.
- భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధానంపై ప్రభావం చూపొచ్చు.
- భారతదేశ ఆర్థిక సేవల రంగం పటిష్టమైన అవకాశాలున్నాయి. ఈ రంగంలో కీలకమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా, దేశీయంగా తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి.
- కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు పటిష్టంగా ఉండటంతో ప్రైవేటు పెట్టుబడులు మరింత పుంజుకోనున్నాయి.
- పన్ను నిబంధలనను సరళతరం చేయడం, వ్యయ నియంత్రణ, డిజిటైజేషన్ వంటివి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను సాధించేందుకు దోహదం చేస్తున్నాయి.
- భారత వృద్ధి పథానికి క్యాపిటల్ మార్కెట్లు కీలకంగా నిలుస్తున్నాయి. ప్రపంచ రాజకీయ, ఆర్థిక షాక్‌లకు మన మార్కెట్లు ఎదురొడ్డి నిలుస్తున్నాయి.
- చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) జోరందుకోవడం వల్ల ప్రపంచ సరఫరా వ్యవస్థలు మెరుగుపరచడంలో, ఎగుమతులను పెంచుకోవడంలో భారత్‌కు దన్నుగా నిలుస్తుంది.
- 2024లో దేశంలోకి వచ్చిన రెమిటెన్సులు (ప్రవాసులు స్వదేశానికి పంపిన నిధులు) 3.4 శాతం వృద్ధితో 124 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఈ మొత్తం 129 బిలియన్ డాలర్లను తాకనుంది.



ప్రయివేట్ రంగ పెట్టుబడులు కీలకం


ప్రయివేట్ రంగ ఫైనాన్సింగ్, కొత్త వర్గాల నుంచి వనరుల సమీకరణ దేశీయంగా నాణ్యమైన మౌలిక సదుపాయాల(ఇన్‌ఫ్రా) నిర్మాణానికి కీలకమని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పాలసీలు, సంస్థాగత మద్దతుతోపాటు.. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు సైతం ప్రధాన పాత్ర పోషించవలసి ఉంటుంది. మౌలిక రంగంలోని వివిధ విభాగాలకు పెట్టుబడులు సమకూర్చడంలో గణాంకాలు, మార్గదర్శకాలు తదితర నివేదికలు అత్యవసరం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కున్న డిమాండ్‌ను అంచనా వేయడం, ఉపవిభాగాల కల్పనలో సౌకర్యాల వినియోగం వంటి అంశాలకు ప్రస్తుత డేటాబేస్ సామర్థ్యం సరిపోదు. ఆర్థికపరమైన ఒత్తిడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏకీకృత ప్రణాళికల నేపథ్యంలో ఆచరణసాధ్యమైన ప్రాజెక్టులను చేపట్టి పూర్తిచేయవలసి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం కీలకమవుతుంది.



పేదలకు కూపన్లు లేదా ప్రత్యక్ష నగదు బదిలీ

వడ్డీరేట్ల నిర్ణయంలో ఆహార ధరలను పక్కనబెట్టండి... ఆర్‌బీఐకి సర్వే సూచన

వడ్డీ రేట్లను నిర్ణయించడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని చూడటం మానేయాలని ఆర్థిక సర్వే సూచించింది. అధిక ఆహార ధరలను ఎదుర్కోవటానికి పేదలకు కూపన్లు లేదా ప్రత్యక్ష నగదు బదిలీని ప్రభుత్వం అన్వేషించాలని సర్వే పేర్కొంది. ''భారతదేశ ద్రవ్యోల్బణ లక్ష్య ఫ్రేమ్‌వర్క్.. ఫుడ్ ఆర్టికల్స్‌ను పక్కనబెట్టాలి. అధిక ఆహార ధరలు చాలా సందర్భాల్లో సరఫరాలకు సంబంధించిన సమస్యే తప్ప, డిమాండ్ ప్రేరితం కాదు'' అని ఆర్థిక సర్వే పేర్కొంది. మధ్య, దీర్ఘకాలిక ద్రవ్యోల్బణం అవుట్‌లుక్ ధరల యంత్రాంగం పటిష్టత, మార్కెట్ అంశాలు, నిత్యావసారాల దేశీయ ఉత్పత్తి, దిగుమతులు వంటి అంశాలపై ఆధారపడుతుందని వివరించింది. అననుకూల వాతావరణం, తక్కువ రిజర్వాయర్ స్థాయిలు, పంట నష్టం వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేసి, గత రెండేళ్లలో ఆహార ధరలను పెంచడానికి దారితీసిందని కూడా సర్వే పేర్కొంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు–రెపో (ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి ఆర్‌బీఐ వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణంపై ఆధారపడే సంగతి తెలిసిందే. ప్లస్ 2 లేదా మైనస్ 2తో ఇది 4 శాతంగా ఉండాలే చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తోంది. ఈ సూచీలో ఫుడ్ ఆర్టికల్స్ ఒక భాగం. రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం లక్ష్యాన్ని సాధించడంలో ఆహార ధరలు ఒడిదుడుకులు తీవ్ర అడ్డంకిగా మారుతున్నాయి. ఇదే అంశంపై ఆందోళన వ్యక్తంచేస్తూ ఆర్‌బీఐ 2023 ఫిబ్రవరి నుంచి యథాతథ వడ్డీరేట్ల వ్యవస్థను కొనసాగిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. దీనిని పక్కనపెట్టి... రుణ రేట్లను తగ్గిస్తే ఆ నిర్ణయం వృద్ధికి దోహదపడుతుందన్నది సర్వే అభిప్రాయం.



రైల్వేల సామర్థ్యం పెరగాలి..



సామర్థ్యాలను వేగంగా పెంచుకోవడం, కార్యకలాపాలను ఆధునీకరించుకోవడం, ఇంధన ఆదా తదితర అంశాలపై రైల్వేస్ ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఎకనమిక్ సర్వే సూచించింది. ఇందుకు అనుగుణంగా సరకు రవాణా కోసం ప్రత్యేక కారిడార్లు, హై స్పీడ్ రైళ్లు, వందే భారత్.. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ .. ఆస్థా స్పెషల్ ట్రెయిన్స్ వంటి ఆధునిక ప్యాసింజర్ సర్వీస్ రైళ్లు, అధిక సామర్థ్యం ఉండే రైల్వే కోచ్‌లు, లాస్ట్–మైల్ రైల్ లింకేజీలు మొదలైన వాటిపై ఇన్వెస్ట్ చేయాలని పేర్కొంది. లాజిస్టిక్స్ వ్యయాలను, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు రైల్వేస్ 3 ప్రధాన కారిడార్ల రూపకల్పనలో ఉందని వివరించింది. ట్రాఫిక్ సాంద్రత అధికంగా ఉండే కారిడార్లు, ఇంధన.. ఖనిజ.. సిమెంట్ కారిడార్లు, రైల్ సాగర్ (పోర్టు కనెక్టివిటీ) కారిడార్లు వీటిలో ఉన్నాయని పేర్కొంది.

పర్యాటక రంగంలో అవకాశాలు అపారం..



పర్యాటక రంగం కల్పిస్తున్న అవకాశాలను సొంతం చేసుకోవాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే సూచించింది. కరోనా విపత్తు తర్వాత పర్యాటక రంగం వేగంగా కోలుకోవడాన్ని ప్రస్తావించింది. '2023లో 92 లక్షల మంది విదేశీ పర్యాటకులు భారత్‌ను సందర్శించారు. క్రితం ఏడాదితో పోల్చి చూస్తే 43.5 శాతం ఎక్కువ. భారత పర్యాటక రంగం వేగంగా విస్తరిస్తోంది. ప్రపంచంలో 39వ ర్యాంక్ సొంతం చేసుకుంది. పర్యాటకం ద్వారా రూ. 2.3 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించింది. ఇది క్రితం ఏడాదితో పోల్చితే 65.7% అధికం'అని సర్వే తెలిపింది. కృత్రిమ మేధ (ఏఐ) భారత సేవల ఎగుమతులపై ప్రభావం చూపిస్తుందన్న 'క్యాపిటల్ ఎకనమిక్స్' నివేదికను ప్రస్తావిస్తూ.. ఉపాధి కల్పన విషయంలో తక్కువ నైపుణ్యాలపై ఆధారపడిన పర్యాటకం ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తోందని పేర్కొంది.

ఏటా 78 లక్షల కొలువులు సృష్టించాలి..



కార్మిక శక్తి పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయేతర రంగాల్లో 2030 నాటికి ఏటా దాదాపు 78.5 లక్షల ఉద్యోగాలను కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఈ విషయంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక వృద్ధి అనేది ఉద్యోగాల కల్పన కన్నా జీవనోపాధి కల్పించడంపై ఆధారపడి ఉంటుందని సర్వే వివరించింది. వ్యవసాయ రంగంలో కార్మిక శక్తి 2023లో 45.8 శాతం స్థాయి నుంచి 2047 నాటికి 25 శాతానికి తగ్గుతుందని తెలిపింది. ఇదంతా వ్యవసాయేతర రంగాల వైపు మళ్లుతుంది కాబట్టి ఆ మేరకు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఏర్పడుతుందని సర్వే పేర్కొంది. పీఎల్‌ఐ స్కీములు, మిత్రా టెక్స్‌టైల్ స్కీము మొదలైనవి ఇందుకు కొంత తోడ్పడగలవని తెలిపింది. స్టాఫింగ్ కంపెనీల ద్వారా తాత్కాలిక సిబ్బంది నియామకాలు పెరుగుతున్నందున అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు దీన్నొక మాధ్యమంగా ఉపయోగించుకోవచ్చని వివరించింది. తయారీ రంగ శ్రేయస్సు, ఆర్థిక వృద్ధి సాధన దిశగా మెరుగైన ఫలితాలు సాధించేందుకు వ్యాపారసంస్థలకు ఇచ్చే ప్రోత్సాహకాలను పునఃసమీక్షించాలని సూచించింది. వర్కర్ల తొలగింపునకు కాకుండా ఉద్యోగాల కల్పనకు కృత్రిమ మేధ(ఏఐ)ని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై కార్పొరేట్లు మరింతగా దృష్టి పెట్టాలని ముందుమాటలో ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ @ రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు



దేశీయంగా 2024–2030 మధ్య కాలంలో పునరుత్పాదక ఇంధన (ఆర్‌ఈ) రంగంలో రూ. 30.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాగలవని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇందుకోసం స్థల సమీకరణ సమస్యలను పరిష్కరించుకోవడం, సానుకూల నిబంధనలతో నిధులను సమీకరించుకోవడం కీలకమని పేర్కొంది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యాలను సాధించే క్రమంలో వివిధ విభాగాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరగలదని వివరించింది. మరోవైపు, ఉద్గారాల విషయంలో 2070 నాటికి తటస్థ స్థాయికి చేరుకోవాలంటే భారత్‌కు ఏటా సగటున 28 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని సర్వే తెలిపింది. నిధులను సమకూర్చుకోవడమనేది ఒక అసాధారణ సవాలు కాగలదని వివరించింది.

14 శాతం ఐఫోన్ల తయారీ ఇక్కడే



ఎలక్ట్రానిక్స్ తయారీలో అంతర్జాతీయంగా భారత్ తన వాటాను పెంచుకుంటున్నట్లు ఆర్థిక సర్వే తెలిపింది. 2023–24లో స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ యాపిల్ 14% ఐఫోన్లను భారత్‌లోనే అసెంబుల్ చేసినట్లు వెల్లడించింది. దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ 2014 తర్వాత నుంచి గణనీయమైన వృద్ధిని చూస్తోందంటూ, 2021–22లో అంతర్జాతీయంగా మన వాటా 3.7%. దేశ జీడీపీలో 4% వాటాను ఆక్రమించింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో మొబైల్ ఫోన్ల విభాగం అధిక వృద్ధిని చూస్తోందని, అమెరికాకు మొబైల్ ఫోన్ల ఎగుమతులు 2022–23లో 2.2 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023–24లో 5.7 బిలియన్ డాలర్లకు దూసుకుపోయినట్టు వివరించింది. 2022–23లో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రూ.8.22 లక్షల కోట్లకు చేరితే, ఎగుమతులు రూ.1.9 లక్షల కోట్లకు పెరిగినట్టు తెలిపింది.

వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్లు కీలకం

దేశీ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్లు కీలకంగా మారుతున్నట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. టెక్నాలజీ, ఇన్నొవేషన్, డిజిటైజేషన్ దన్నుతో మూలధన నిర్మాణం, పెట్టుబడుల విస్తరణలో క్యాపిటల్ మార్కెట్ల వాటా బలపడుతోంది. అంతేకాకుండా దేశీ స్టాక్ మార్కెట్లు ప్రపంచ భౌగోళిక, రాజకీయ, ఆర్థిక విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ రిస్కులు, వడ్డీ రేట్లుసహా కమోడిటీ ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలోనూ దేశీ క్యాపిటల్ మార్కెట్లు గతేడాది(2023–24) ఉత్తమ పనితీరు చూపిన వర్ధమాన మార్కెట్లలో ఒకటిగా నిలిచాయి. ఈ కాలంలో బీఎస్‌ఈ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ ఇన్వెస్టర్లకు భారీ(25%కిపైగా) రిటర్నులు అందించాయి. ఇందుకు స్థూల ఆర్థిక పరిస్థితుల స్థిరత్వం, దేశీ ఇన్వెస్టర్ల బలిమి తోడ్పాటునిచ్చినట్లు సీతారామన్ పేర్కొన్నారు. 2024 మే నెలలో ఈక్విటీ మార్కెట్ల విలువ 5 ట్రిలియన్ డాలర్ల(రూ. 415 లక్షల కోట్లు)కు చేరింది. ప్రస్తుతం 9.5 కోట్లమంది రిటైల్ ఇన్వెస్టర్లు ప్రత్యక్షంగా 2,500 లిస్టెడ్ కంపెనీలలో 10% వాటాను కలిగి ఉన్నారు. గతేడాది ప్రైమరీ మార్కెట్ల ద్వారా రూ. 10.9 లక్షల కోట్ల మూలధన ఏర్పాటుకు సహకారమందించింది.



బడ్జెట్‌కు ముందు అప్రమత్తత

రిలయన్స్, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు ● సూచీలకు స్వల్ప నష్టాలు

ముంబై: కేంద్ర బడ్జెట్‌కు ముందు ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు బ్యాంకింగ్ రంగ షేర్లు డీలా పడ్డాయి. ఇటీవల విడుదలైన కొన్ని కార్పొరేట్ కంపెనీల క్యూ1 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడమూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచింది. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 102 పాయింట్లు నష్టపోయి 80,502 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22 పాయింట్లు పతనమై 24,509 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభనష్టాల మధ్య కదలాడాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 504 పాయింట్లు క్షీణించి 80,101 వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు పతనమై 24,362 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. మిడ్ సెషన్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(2%), ఇన్ఫోసిస్(1%)తో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. ఇంధన, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకుల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మెటల్, ఫార్మా, ఇండస్ట్రీయల్, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి.



- రిలయన్స్ ఇండస్ట్రీస్ జూన్ త్రైమాసిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో షేరు 3.50% నష్టపోయి రూ.3,001 వద్ద స్థిరపడింది.
- విప్రో షేరు 9% పతనమై రూ.506 వద్ద స్థిరపడింది. క్యూ1 ఆర్థిక ఫలితాల సందర్భంగా నిరుత్సాహక అవుట్‌లుక్ షేరు పతనానికి కారణం.
- జూన్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడంతో కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు 3.55% నష్టపోయి రూ.1757 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఐపోల లాభం జూమ్ | ఎఫ్అండ్‌వో ట్రేడింగ్ ప్రమాదకరం

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.